# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 11 ఆగస్టు 2023 వెల : రూ.15

మోదీ మౌనం వెనుక..

ఆయన నాయకత్వంలో అందరం సిగ్గు పడదాం!

మౌనం ప్రధానికి ఒక ఆయుధం

నగ్నంగా నడిచింది దేహం కాదు.. అది దేశం

వెలుగు, వివేకం, గాంధేయం..!

గాంధీజీ - రవీంద్రుల అపూర్వ మైత్రి

మేము ఆర్ఎస్ఎస్‌ను ఏనాడూ విడిచి ఉండలేదు

ఔరా.. ఏమి చిత్రమిది!!

భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు

భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నది ఎవరు?

పౌరస్మృతి - ప్రాథమిక హక్కులు

ఉమ్మడి బుల్‌డోజర్ సమైక్యానికా!?

పీటముడులు విప్పేదెలా?

బీజేపీ ఎన్నికల స్టంట్ యూసీసీ

హిందుత్వ కార్పొరేట్ కూటమిది ఏ విధానం

పేదరికం మీద పరిహాసం

విస్మరణ, విధ్వంసానికి విరుగుడు

మన కోసం మార్క్స్ ఆ రచన చేసి ఉంటే..

శ్రామిక విప్లవ యోధ ఎంగెల్స్

ఆగస్టు - 2023

# దారి దీపం
మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 11


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. మోదీ మౌనం వెనుక.. సంపాదకీయం 3
2. ఆయన నాయకత్వంలో అందరం సిగ్గు పడదాం! – కె.శ్రీనివాస్ 4
3. మౌనం ప్రధానికి ఒక ఆయుధం – కె.రామచంద్రమూర్తి 6
4. నగ్నంగా నడిచింది దేహం కాదు.. అది దేశం - బండారు రమేష్ 8
5. వెలుగు, వివేకం, గాంధేయం...! – రామచంద్రగుహ 9
5. గాంధీజీ - రవీంద్రుల అపూర్వ మైత్రి – డా.నందనూరు భాస్కరరెడ్డి 11
6. ఆర్ఎస్ఎస్‌ను ఏనాడూ విడిచి ఉండలేదు – గోపాల్ గాడ్సే ఇంటర్వ్యూ 12
7. ఔరా.. ఏమి చితరమిది!!? – విరించి విరివింటి 15
8. భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు –ప్రొ॥వినయ్‌లాల్ 16
9. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నది ఎవరు? – దేవరాజు మహారాజు 22
10.పౌరస్మృతికి - ప్రాథమిక హక్కులు – అనిశెట్టి శాయికుమార్ 23
11.ఉమ్మడి బుల్ డోజర్ సమైక్యానికా!? – బద్రీ రైనా 25
12.పీటముడులు విప్పేదెలా? 27
14.బీజేపీ ఎన్నికల స్టంట్ యూసీసీ – డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి 29
15.హిందుత్వ కార్పొరేట్ కూటమిది ఏ విధానం – ప్రభాత్ పట్నాయక్ 31
16.పేదరికం మీద పరిహాసం – ఎం.కోటేశ్వరరావు 33
17.అండమాను జైలు.. ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు 35
18.మన కోసం మార్క్స్ ఆ రచన చేసి ఉంటే.. – మందలపర్తి కిషోర్ 37
19.శ్రామిక విప్లవ యోధ ఎంగెల్స్ - కె.కుమార్‌రెడ్డి 40
20.మోదీ టిక్స్.. కార్టూన్స్ 43
21.కొత్త పుస్తకాలు.. స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495


దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

## దారి దీపం
మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495



సంపాదకీయం

# మోదీ మౌనం వెనుక

మోదీ ప్రసంగంలో ఒక చతురత వుంటుంది. జై భజరంగబలీ అంటారు. భారత్ మాతాకీజై అంటారు. ఈ నినాదాలను సభికుల చేత పలికిస్తారు. ఎక్కడ ఏ ఉపన్యాసం చెప్పినా అందులో విభజన రాజకీయం వుంటుంది. విద్వేషం తొంగి చూస్తుంది. మెజారిటీవాదం కనిపిస్తుంది. ప్రతిపక్షాల గతాన్ని తవ్వి తీస్తారు. ఇలా ఓట్లను దండుకునే రాజకీయమే కనిపిస్తుంది. ఆయన మౌనం దీనికంటే ప్రమాదకరమైంది. 2002లో గుజరాత్ మారణకాండ జరుగుతున్నప్పుడు ఆయన మౌనం వహించారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. సంఘ పరివార్ అల్లరి మూకలు మారణకాండ సాగించాయి. వేలాది మందిని హత్య చేశారు. మానభంగాలు చేశారు. గుజరాత్‌లో మెజారిటీ వాదాన్ని స్థిరపరుచుకుని ఎన్నికలలో గెలుపు సాధిస్తున్నారు. రాజధర్మాన్ని ఉల్లంఘించడానికే ఆయన మౌనం పాటించినట్లు కనిపిస్తుంది. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ అన్నవి రాజధర్మంలో పాటించి తీరాల్సిన విధులు. రాజ్యకాంక్ష గలవారికి రాజధర్మం గిట్టదు. గుజరాత్‌లో రాజధర్మంపై రాజ్యకాంక్షను గెలిపించింది ఆయన పాటించిన 'మౌనమే'.

ఇప్పుడు మణిపూర్ తగలబడుతున్నది. అదొక చిన్న రాష్ట్రం. దాదాపు 30 లక్షల జనాభా మాత్రమే ఉన్న రాష్ట్రం. ఇక్కడ మెయితీ తెగదే మెజారిటీ. కుకీ తెగ మైనారిటీ. మెయితీలు లోయ, మైదాన ప్రాంతాల్లో ఉంటే కుకీలు కొండ జాతివారు కావడంతో కొండ ప్రాంతాల్లో ఉంటారు. మెయితీల మద్దతుతో బీజేపీ గెలిచింది. ఇప్పుడు మణిపూర్‌లో డబుల్ ఇంజన్ సర్కారు వుంది. బీజేపీ మతపరమైన మెజారిటీ వాదం ఈ రాష్ట్రంలో మెజారిటీ తెగవాదం రూపం తీసుకుంది. కుకీలలో అత్యధికులు క్రైస్తవులు కావడం దీనికి తోడైంది. రిజర్వేషన్ల సమస్యపై తలెత్తిన ఈ రెండు తెగల మధ్య రగడ దాడుల రూపం ధరించింది అక్కడ గుజరాత్ నమూనాను అమలు చేయడం జరిగింది. మెయితీలకు ఆయుధాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభుత్వ కనుసన్నలలో పొందారు. అక్కడ మెయితీ తెగకు చెందిన ముఖ్యమంత్రి ఉన్నారు.

తన రాజకీయం కోసం ఈ మారణకాండను కొనసాగనిచ్చారు. అక్కడ ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియకుండా ఇంటర్నెట్‌ను బంద్ చేశారు. వందలాది గ్రామాలు నేలమట్టం అయ్యాయి. గృహ దహనాలు, హత్యాకాండ, మానభంగాలు సాగిపోయాయి. మే 4న జరిగిన ఘటన, ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి, మాననభంగం చేసి కిరాతకంగా హత్య చేసిన ఘటన బైటికి రావడంతో మోదీ మౌనం వీడాల్సి వచ్చింది. అయితే ఆయన పార్లమెంట్‌లో ప్రకటన చేయడానికి ససేమిరా అంటున్నారు. ఇది డబుల్ ఇంజన్ సర్కార్ దాదాపు మూడు నెలలుగా సాగుతున్న మారణకాండ. అయినా ఆయన పార్లమెంట్‌లో ప్రకటనకు సిద్ధం కావడం లేదు. ఎందుకంటే అక్కడ జరిగింది తన మెజారిటీ వాదానికి అనుకూలమైన దాడి. తన మత విద్వేష రాజకీయానికి అనుకూలమైన క్రైస్తవులు మీద దాడి. అంతకుమించి కొండ ప్రాంతాన్ని కుకీల నుంచి ఖాళీ చేసి అక్కడ ఖనిజ సంపద తన మిత్రులకు మెయితీలకు దఖలు పరిచాలి మోదీ మౌనం వెనుకవున్నది ఈ దారుణ వ్యూహమే.

- డీవీవీఎస్ వర్మ

సంపాదకులు, 85006 78977

# ఆయన నాయకత్వంలో అందరం సిగ్గు పడదాం!



- కె.శ్రీనివాస్

మణిపూర్‌కూ మనకూ ఉన్న సంబంధమేమిటి? అన్న ప్రశ్న వేసుకుంటే, అదీ మనమూ ఒకే దేశం వాళ్లమని వెంటనే జవాబు చెప్పగలం. ఆ తరువాత అదనంగా మరొక్క ప్రశ్న ఎదురైతే తెల్లమొహం వేయాల్సి వస్తుంది. అక్కడెక్కడో ఈ శాన్యం మూలన వున్న కొండలూ లోయలతో ఉన్న ఒక రాష్ట్రం. భారత్‌లో భాగమా కాదా అన్న పెనుగులాటలో ఉండిన ప్రాంతం. తిరుగుబాట్లు, సైన్యం అణచివేతలు, నిర్బంధాలు, నిరసనలు, వగైరా వగైరా ప్రాంతం. ఒక సమస్య గా మాత్రమే స్ఫురించే భూభాగం. ఆ మనుషులు కనిపిస్తే, వాళ్లు నేపాల్ వాళ్లో, సిక్కిం వాళ్లో, భూటాన్ వాళ్లో, చైనా వాళ్లో కూడా మనకు గట్టిగా తెలియదు. ఢిల్లీ లాంటిచోట్ల అయితే, వాళ్లంటే హేళన. సోదరులుగా గుర్తించలేనంత పలచన. మణిపూర్ ఒక్కటే కాదు, మిజోరం, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ, అస్సాం అంతా అంతే. అటువంటి మణిపూర్, 3 నెలల నుంచి మండిపోతుంటే, మనకు చాలాకాలం చీమ కుట్టినట్టు కూడా లేకపోవడానికి దేశ సమగ్రతలో ఉన్న అసంపూర్ణతలు ప్రధాన కారణం. దేశప్రజల మధ్య సోదరభావం, మమకారం ఏర్పడేట్టుగా నవభారతం రూపొందలేదు. ఇక, న్యూ ఇండియా అయితే, ఉన్న కాసింత ఐకమత్యాన్ని పెటాకులు చేసే దాకా నిద్రపోయేట్టు లేదు.

మణిపూర్ నిప్పు నుంచి మన ఆకాశం నిండా పొగ అలమున్న తరువాత కూడా, అక్కడ ఎవరు ఎవరో తెలుసుకోవాలని, ఎవరి హింసను ఎవరు అనుమతిస్తున్నారో గమనించాలని, న్యాయం ఎవరి వైపున ఉందో అర్థం చేసుకోవాలని తక్కిన దేశంలోని మధ్యతరగతి రాజకీయాసక్తులకు పెద్దగా అనిపించలేదు. అక్కడ రెండు రకాల జనసమూహాల మధ్య గొడవ జరుగుతోందన్న తటస్థ కథనంతో అతి సౌకర్యవంతంగా, సంతృప్తి చెందసాగారు. సత్యం తెలిసినవారు లేకపోలేదు. తెలియజెప్పేవారు కూడా లేరని కాదు. ఆదివాసీల అభాగ్యత గురించి, వారికి సంభవించగల తీవ్ర అన్యాయం గురించి హెచ్చరించిన వారున్నారు. ఆ ఆదివాసీలు అధికం క్రైస్తవులైతే, ఎదుటి పక్షం ప్రధానంగా మెజారిటీ మతస్థులైతే ఎటువంటి సన్నివేశం రూపొందుతుందో గ్రహించినవాళ్లు ఉన్నారు. మైనారిటీలుగా ముస్లిమ్ వేదన అర్థమైనంతగా ఈ దేశపు పౌరసమాజానికి ఇంకా క్రైస్తవ కష్టం తెలియలేదని గుర్తు చేసినవారున్నారు. ఉన్నారు కానీ, వారు అతి కొద్దిమంది, వారు చేరగలిగినవారూ కొద్దిమందే. అందుకే, దౌర్జన్యం, దౌష్ట్యం వాటి తీవ్రాతి తీవ్రరూపాలలో ఎదురైతే తప్ప, భారతీయ సామాజిక ప్రధాన స్రవంతి నిద్రాభంగానికి గురి కాలేదు, కల్లోల పడలేదు.

కదలగానే, మన విలువల నాడీ వ్యవస్థను కలవరపరచగానే, కదిలిపోవడానికి ఎక్కువ సమయం పట్టదు. పట్టలేదు. ఒకసారి ఉద్వేగ గ్రంథులు చలించిపోగానే, స్పందనలు తీవ్రంగాను, విస్తృతంగానూ వెల్లువెత్తుతాయి. వెల్లువెత్తాయి. మే 4 సంఘటన మీద చాలా గొప్ప ఆవేశాలు కవిత్వంగా మన ముందుకు వచ్చాయి. జరిగిన ఒక అమానుషానికి సమాజం కుమిలిపోయింది, కించపడింది, క్రోధంతో రగలిపోయింది. కవిత్వం గొప్ప విషయమే! కానీ, మనసు కలచివేసే సంఘటనతో మాత్రమే ఆ స్పందన సాధ్యమైంది. మనకు శతాబ్దాలుగా సహస్రాబ్దాలుగా పరిచితమైన, అందరం కథలు కథలుగా నిరసించిన అనాది నేరం తిరిగి ప్రత్యక్షమైతేనే మణిపూర్‌లో జరుగుతున్నదేమిటో మనకు అర్థమైంది. సాధారణీకరణ చెందిన అత్యాచారానికి, సాధారణీకరణ చెందిన దుఃఖానికీ మాత్రమే స్పందిస్తున్నాము. అవగాహనతో వివేకంతో మాత్రమే అర్థం చేసుకోగల హింస విశ్వరూపాన్ని ఆ క్రమంలో విస్మరిస్తున్నాము.

దేశం దేశమంతా సిగ్గుపడాలి అన్నారు ప్రధాని మోదీ. మూడు నెలలు కావస్తున్నా ఎందుకు పెదవి విప్పలేదో, అందరి అభ్యర్థనలు, విజ్ఞాపనలు అరణ్యరోదనలు ఎందుకయ్యాయో, ముందాయన జవాబు చెప్పుకుని, ప్రభుత్వ సారథిగా తానే సిగ్గుపడడంలో నాయకత్వం వహించాలి. బాధపడవలసింది కానీ, సిగ్గుపడవలసింది కానీ, కేవలం నడిరోడ్డు మీద స్త్రీలను దిగంబరం చేసి తరిమినందుకో, అడ్డుపడబోయిన కుటుంబ సభ్యులను చంపినందుకో, అందరి సాక్షిగానే పొలాల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినందుకో మాత్రమే కాదు. ఆర్తనాదాలను హింసలోనే ఖననం చేసినందుకు, అసహాయులను ఆధిపత్య హింసావాదులకు అప్పగించి అంతటా నిశ్శబ్దం విధించినందుకు సిగ్గుపడవలసిన వాళ్లు సిగ్గుపడాలి. ఆదివాసీల ప్రతిపత్తినో, దానితో వచ్చే ప్రత్యేక రక్షణలనో వివాదాస్పదమైన రీతిలో మరో పక్షానికి పంపకానికి పెట్టి, దాని ఫలితంగా ఉత్పన్నమయిన ఉద్రిక్తతల ఉప్పు బయటకు అందకుండా సమాచారాన్ని నాకాబందీ చేసి నిర్వహించాలనుకున్న కార్యానికి కర్త భారత కేంద్ర ప్రభుత్వం. గతంలో కశ్మీర్‌లోనూ ఇదే జరిగింది. ఇప్పుడు మణిపూర్‌లోనూ అదే జరుగుతోంది. ఇది యాదృచ్ఛికం కాదు. సంకల్పిత ప్రయోగం.

ఇంటర్నెట్ బందుల్లో భారత్‌కు ఘనకీర్తి వచ్చేసింది. ప్రధాన స్రవంతి మీడియా అని చెప్పుకునే పత్రికలు, టీవీఛానెళ్ల కంటె, సామాజిక మాధ్యమాల మీదనే ఆధారపడుతూ, రాజకీయ సామాజిక లాభాలు సాధిస్తున్న శక్తులకు ఆయా సందర్భాన్ని బట్టి పగ్గాలు వదలడం, నిషేధాలు విధించడం అలవాటై పోయింది. సత్యాన్ని మూసేయడం, అసత్యాన్ని తెరవడం ఒకే వ్యూహంలో భాగం. ఎంత కట్టడి చేసినా వాస్తవాలు బయటకు పొక్కకుండా ఉండవు. అప్పుడేమి చేయాలి? నరేంద్రమోదీ లాగా మౌనం వహించాలి. ఎవరు ఎన్నిసార్లు అడిగినా భీష్మించుకుని నోటికి తాళం వేసుకోవాలి. ఆఖరుకు యూరోపియన్ యూనియన్ పార్లమెంటు తీర్మానం చేసినా వాళ్లనే షటప్ అనాలి కానీ సీరియస్‌గా తీసుకోగూడదు. జాతీయమహిళా కమిషన్ రేఖాశర్మ లాగా, చెవినిబడ్డ ఆక్రందనలను తప్పుడు చిరునామాకు ఫార్వర్డ్ చేయాలి. నా పని అంతేగా అని చేతులు దులుపుకోవాలి. అన్ని రాష్ట్రాలకు తానే రాష్ట్ర హోంమంత్రి అని భావించే కేంద్రహోం మంత్రిలాగా చిద్విలాసంగా చిరునవ్వులు చిందించాలి.

మణిపూర్ హింస ప్రమాదవశాత్తూ జరిగినది కాదు. లేదా, ద్వైపాక్షికమూ కాదు. ప్రభుత్వ ప్రోద్బలంతోనో, ఆశీస్సులతోనో, కుమ్మక్కుతోనో ఆధిక్యవర్గం బలహీనుల మీద చేస్తున్న దాడి. బాధిత పక్షం నుంచి కూడా చెదురుమదురు దాడులు జరిగి ఉండవచ్చు. కానీ, మొత్తంగా ఈ పరిణామానికి స్క్రీన్ ప్లే ముందుగా రూపొందించినదే. ఇద్దరు పాత్రధారులు మెయితీలు, కుకీలు. మొదటివారు హిందువులు. రెండోవారు క్రైస్తవులు. ఇది మరీ గీత గీసినట్టు ఉండదు. మెయితీలలో కూడా క్రైస్తవులు ఉన్నారు. కుకీలలో క్రైస్తవం తీసుకోని ఆదివాసీ విశ్వాసులు ఉన్నారు. మెయితీలు లోయలలో, మైదానాల్లో నివసిస్తారు. కుకీలు కొండ ప్రాంతాల్లో జీవిస్తారు. కుకీలు మాత్రమే ఆదివాసీలు. కొండప్రాంతాలలో వారి భూములకు రాజ్యాంగ రక్షణ ఉండేది. మెయితీలకు కూడా కుకీల మాదిరిగా ఎస్టీ హోదా కల్పిస్తూ కోర్టు ఆదేశించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అందుకు అనుకూలంగా ఉన్నది. దాని ఫలితంగా, మెయితీలు కొండ ప్రాంతాల్లో భూములు కొనడానికి నివసించడానికి అర్హత పొందుతారు. అధికారంతో సాన్నిహిత్యం, మెరుగైన ఆర్థిక సామాజిక వనరులు ఉన్న మెయితీలకు, కొండప్రాంతాలలో ప్రధానంగా సంప్రదాయ ఆదివాసీ పద్ధతులలో జీవించే కుకీలకు మధ్య జరిగే 'ఘర్షణ'లు వాస్తవానికి ఎవరు ఎవరి మీద చేసే దాడులో మే4 నాటి సంఘటన నిరూపించింది. కుకీలు నివసించే కొండప్రాంతాలలో అపారమైన ఖనిజవనరులు ఉన్నాయని, వాటిని పరులకు హక్కుభుక్తం చేయడానికి మెయితీలను ఉపయోగించుకుంటున్నారని బలమైన వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కుకీలు చుట్టుపక్కల రాష్ట్రాలలోను ఉనికి కలిగిన తెగ. బంగ్లాదేశ్, మైన్మార్‌లలో కూడా వీరి జనాభా ఉన్నది. అందుకని, వీరిమీద చొంబాటుదారులన్న ముద్ర, క్రైస్తవం ఎక్కువ కాబట్టి దానికి సంబంధించిన ముద్రలు ఉన్నాయి. రాష్ట్రాన్ని పాలిస్తున్న బిరేన్ సింగ్ సామరస్యానికి కాకుండా, ఒక పక్షం వైపు పనిచేస్తున్నాడని స్పష్టం అవుతోంది.

నాలుగు గోడల మధ్య బంధించి హింసిస్తే తిరగబడే పిల్లిలాగా, మణిపూర్‌లో అదిమిపెట్టి, అణచిపెట్టిన సత్యం విస్ఫోటించింది. సాధారణంగా వెనువెంటనే ప్రతివాదనలు గుప్పించవలసిన వాట్సాప్ యూనివర్సిటీ రెండు రోజులపాటు దిగ్భ్రాంతిలో పడిపోయింది. ప్రధానమంత్రి మౌనమే దోషిగా బోనులో నిలబడే సరికి, ఏమి చేయాలో అసత్యవాదులకు పాలుపోలేదు. మరో వైపు, మణిపూర్ దారుణానికి దేశవ్యాప్తంగా ఒక్కసారిగా స్పందన పెరిగి, ప్రభుత్వ వ్యతిరేకతగా వ్యక్తం కాసాగింది. రెండు రోజులు సమయం తీసుకున్న తరువాత, మొదట సంప్రదాయ పద్ధతిలోనే ఫేక్ న్యూస్ మొదలయింది. మే 4 సంఘటనలో ప్రముఖంగా కనిపిస్తున్న నిందితుడు ముస్లిమ్ అని ఒక వాదన చేయబోయారు. దానికేమంత విశ్వసనీయత రాకపోవడంతో, బెంగాల్‌లో జరిగినట్టు చెబుతూ ఒక బాధిత స్త్రీ విడియోను సంధించారు. నిజానికి అది ఉత్తరప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటన విడియో అని తరువాత తెలిసింది. మణిపూర్‌ను ఖండించినప్పుడు, బెంగాల్‌ను ఎందుకు ఖండించరు? అన్నది వాదన. మణిపూర్ సమస్యకు నెహ్రూయే కారణం, కాంగ్రెసే కారణం అనే అరిగిపోయిన రికార్డు మళ్లీ ప్లే చేశారు. ఇక పరవా లేదు, ఆ అఘాయిత్యం వార్త బయటపడి వారం గడిచిపోయింది. ఉద్వేగాలు చల్లారి ఉంటాయి అనుకుని, కుకీల మీద ప్రతికూల ప్రచారం ప్రారంభించారు. వాళ్లు, క్రైస్తవం కలిసి చేస్తున్న ద్రోహాలు, చర్చిలు కేంద్రంగా జరిగే ఘోరాలు, సరిహద్దుల ఆవలినుంచి కుకీల చొరబాట్లు ఇవన్నీ పుంఖానుపుంఖంగా గుప్పిస్తున్నారు. అన్నిటికంటె ఘోరం, మణిపూర్‌లో పోలీసుల మీద దాడులు చేయడానికి ఉద్యమకారులు నగ్నదళాలు ఏర్పాటు చేశారట! అత్యాచారాలు జరిగిన విడియో దృశ్యాలను అటువంటి నగ్నదళాల ప్రదర్శన అనుకోవాలని వారి ఉద్దేశం. వాస్తవం బయటకు పొక్కకుండా మొదట కట్టడి చేయడం, వెల్లడి అయినా అవి ప్రభావవంతం కాకుండా ఉండడానికి బాధితులనే దోషులుగా చేసే ప్రతివాదనలను నిర్మించడం ఇదీ క్రమం. అరణ్యరోదనం, సమాజం నడివీధిలోకి వచ్చినా ఉపయోగం ఉండదు!

మనలోనే భాగమైన వారి గురించి మనకు తెలియవలసినంత తెలియకపోవడం ఒక అన్యాయం. అదొకరకం సమాచార పరిమితి అనుకుంటే, ఆ అణగారిన ప్రాంతాలలోని, అణగారిన తెగలకు సంబంధించిన జీవన్మరణ సమస్యలను, వాటినుంచి ఉత్పన్నమయిన సంఘటనలను, చెలరేగే హింసను ఇతరులకు తెలియకుండా, దేశాన్నంతటినీ కౌరవసభగా మార్చివేయడం క్షమించరాని అన్యాయం. జరిగిన ఘటన అత్యాచారమో హత్యో కావచ్చు, కానీ, అమలు జరుగుతున్నది అంతకంటె మించిన వ్యూహమని గుర్తింపు కలగకపోవడం మరో విషాదం. ఇదంతా మన జ్ఞానేంద్రియాలను నిష్ఫలం చేసి, అజ్ఞాన సామ్రాజ్యాన్ని స్థాపించడం కోసమే! ❑


# మౌనం ప్రధానికి ఒక ఆయుధం



- కె.రామచంద్రమూర్తి

ప్రధాని నరేంద్రమోదీ మణిపూర్ విషయంలో పాటిస్తున్న భయంకరమైన మౌనం వీడటానికి ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించినట్టూ, వారిపైన సామూహిక అత్యాచారం జరిగినట్టే వీడియో సమాచారం వెల్లడి కావలసి వచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని తీవ్రమైన వేదననూ, ఆగ్రహాన్నీ వెల్లడిస్తూ 'మీరు చర్యలు తీసుకుంటారా, మమ్మల్ని తీసుకోమంటారా?' అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, మణిపూర్ ప్రభుత్వాన్ని మందలించిన తర్వాతనే మోదీ సుమారు మూడు మాసాల మౌనం వీడారు. రెండు దశాబ్దాల కిందట గుజరాత్‌లో నరమేధం జరిగినప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏ విధంగా మౌనం పాటించారో ఇప్పుడు మణిపూర్‌లో అల్లకల్లోలం జరుగుతున్నప్పటికీ అదే మౌనాన్ని ఆశ్రయించారు. ఈ మౌనం వెనుక మెజారిటీవాదం ఉన్నది.

ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి మానభంగం చేసిన ఉదంతం మే 4వ తేదీన జరిగింది. అంతకుముందు ఏప్రిల్ 14న హైకోర్టు తన పరిధిలో లేని అంశంపైన తీర్పు ఇచ్చింది. మెజారిటీ మైతీలను ఆదివాసులుగా గుర్తించి వారికి రిజర్వేషన్లు అమలు జరగాలని నిర్ణయించింది. మహిళలపైన అత్యాచారం జరిగిన తర్వాత పక్షం రోజులకు మే 18న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నోరు తెరిచిన తర్వాతనే ప్రధాని మౌనానికి స్వస్తి చెప్పారు. అదే రోజు, గురువారం, 20 జులై 2023న, మధ్యాహ్నం ఒకటిన్నరకు ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రకటించారు. చంద్రచూడ్ వ్యాఖ్య తర్వాత ఒకే రోజులో అన్ని పరిణామాలూ జరగడం విశేషం. ప్రధాని ఖండనలో సైతం రాజకీయం దండిగా ఉంది. "ఏ రాష్ట్రంలోనైనా, అది రాజస్థాన్ కావచ్చు, ఛత్తీస్‌గఢ్ కావచ్చు, మణిపూర్ కావచ్చు, మహిళలను రక్షించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నది. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ వ్యాఖ్యానించారు. రెండు తెగల మధ్య మూడు మాసాలుగా పోరాటం జరుగుతూ వంద మందికి పైగా ప్రజలు చనిపోగా, లెక్కలేనన్ని చర్చిలు దగ్ధం కాగా, ఆస్తులు ధ్వంసం కాగా కకావికలం అవుతున్న మణిపూర్‌కి మామూలుగా జరిగే నేరాలు జరిగిన రాజస్థాన్‌కూ, ఛత్తీస్‌గఢ్‌కూ పోలిక లేదు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రభుత్వాలు నిందితులను అరెస్టు చేశాయి. అంతకంటే ఎక్కువ నేరాలు జరిగిన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ను ప్రధానమంత్రి ప్రస్తావించలేదు. ఎందుకంటే అవి బీజేపీ పాలిత రాష్ట్రాలు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు. ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి ఇంత సంకుచితంగా వ్యవహరించినప్పుడు ఎవరికి చెప్పుకోవాలి? ఎక్కడ మొత్తుకోవాలి?


The Telegraph

OPPENHEIMER NUGGETS — Why Nolan cast Murphy, plus 9 things

AJANTA MURALS — An artist's request

GOOGLE'S NEWS — AI 'helpmate' for journalists

WHAT WENT WRONG — Neymar on PSG's failures in Champions League

CALCUTTA FRIDAY 21 JULY 2023

IN BRIEF

Didi moots Manipur peace bid

It took 79 days for pain and shame to pierce 56-inch skin

**56 ఇంచుల చర్మానికి బాధ తెలియడానికి 79 రోజులు పట్టిందంటూ ది టెలిగ్రాఫ్ పత్రిక మొసలి కన్నీరు కారుస్తున్నట్టు మొసళ్ల ఫొటోలతో బ్యానర్ కథనాన్ని ప్రచురించింది.**

మౌనం ప్రధానికి సంబంధించినంత వరకూ ఒక ఆయుధం. ఒక విధానం. ప్రముఖ సంపాదకురాలు గౌరీ లంకేష్‌ను హత్య చేసినా, ముగ్గురు హక్కుల నేతలను చంపివేసినా ప్రధాని మౌనాన్నే ఆశ్రయించారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు సంవత్సరం పొడుగునా నిరసన ప్రదర్శనలు చేసినా, మహిళా వస్తాదులు న్యాయం కావాలంటూ ఎన్ని మాసాలు జంతర్‌మంతర్‌లో ప్రదర్శనలు చేసినా మౌనమే ప్రధాని సమాధానం. మణిపూర్‌లో వంద మందికి పైగా మరణించినా అదే మౌనం.

మణిపూర్‌లోని ఇంఫాల్ లోయలో నివసించే మైతీలు మెజారిటీ తెగ. కొండలలో నివసించే కుకీల సంఖ్య మైతీల కంటే తక్కువ. కుకీలు క్రైస్తవులు. వీరు కాకుండా నాగాలు ఇంఫాల్ లోయ పక్కనే ఉంటారు. ఇటీవల నాగా మహిళను

ఎవరో ఇంఫాల్ (మణిపూర్ రాజధాని)లో హత్య చేశారు. నాగాలు ఆగ్రహోదగ్రులైనారు. సకాలంలో మణిపూర్ పౌర సమాజం నాగా మహిళ హత్యను ఖండించింది. మైతీల రాడికల్ సంస్థ ఆరంబై టెన్గోల్ హత్యను నిర్ద్వంద్వంగా ఖండించింది. అంతటితో నాగాలు సర్దుకున్నారు. లేకపోతే మైతీ-నాగా ఘర్షణలతో ఉత్తర మణిపూర్ రావణకాష్టంగా మారేది.

దేశీయాంగ మంత్రి అమిత్ షా సైతం కర్ణాటకలో ఎన్నికలు ముగిసిన తర్వాతనే మణిపూర్ సందర్శించారు. అప్పటి నుంచి ఢిల్లీ నుంచి కుకీలు నివసించే దక్షిణ మణిపూర్ కొండలలో శాంతి భద్రతలతో ముఖ్యమంత్రికి సంబంధం లేదు. ఢిల్లీ నుంచే నేరుగా కుకీల ప్రాంతంలో పరిపాలనను సాగిస్తున్నారు. ఢిల్లీ మద్దతు మైతీలకు ఉన్నది. ముఖ్యమంత్రి బీరేంద్రసింగ్‌ను బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించమని జూన్ 24న ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష నాయకులందరూ ముక్తకంఠంతో కోరారు. అయినప్పటికీ మోదీ సమాధానం మౌనమే. ముఖ్యమంత్రి ప్రజల గౌరవం, విశ్వాసం కోల్పోయారు. ఆయనను మైతీలతో అంటకాగుతున్న ముఖ్యమంత్రిగా కుకీలూ, నాగాలూ నమ్ముతున్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీజేపీ ముఖ్యమంత్రిని తొలగించడానికి మోదీ ససేమిరా అంటున్నారు. మణిపూర్‌లో ఘర్షణలు జరిగిన తర్వాత 79 రోజులకు మోదీ నోరుతెరిచారు. ఈలోపు ఆయన అమెరికా వెళ్లారు. ఫ్రాన్స్ సందర్శించారు. యునైటెడ్ ఎమిరేట్స్‌లో పర్యటించారు. అమెరికా పార్లమెంటులో మాట్లాడారు. ఫ్రాన్స్‌లో భారత సంతతికి చెందిన ప్రవాస భారతీయులను ఉద్దేశించి అద్భుతంగా ప్రసంగించారు. భారత్ ఔన్నత్యాన్ని పొగుడుతూ వ్యాఖ్యలు చేశారు. చంద్రయాన్-3ని నింగికి పంపిన శాస్త్రజ్ఞులను పారిస్ నుంచే అభినందించారు. చిరుత పులులు చనిపోవడం గురించి మాట్లాడారు. ఈలోగా ఎన్నికలు జరగబోతున్న మధ్యప్రదేశ్, తెలంగాణలో పర్యటించారు. కానీ మణిపూర్ మాత్రం వెళ్ళలేదు. మణిపూర్ వెళ్ళిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలో, ఎప్పుడు ఏమి మాట్లాడాలో తెలియని అజ్ఞాని రాహుల్‌గాంధీ అని బీజేపీ వరిష్ఠ నేతలు నిందించారు. భోపాల్‌లో గంభీరోపన్యాసం చేస్తూ ప్రధాని మోదీ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నేతలు 70 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతిపరుల గుట్టులన్నీ రట్టు చేస్తామనీ, అందరి లెక్కలూ తేలుస్తామని భీకర ప్రతిజ్ఞ చేశారు. ఇది జరిగిన వారంలోపే అదే ఎన్‌సీపీ నాయకులను మహారాష్ట్ర ప్రభుత్వంలో చేర్చుకున్నారు. 70 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపించిన అజిత్ పవార్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. అవినీతి ఆరోపణలపైన కొన్ని మాసాలు జైలులో గడిపిన ఛగన్ భుజ్‌బల్‌ను మంత్రిగా చేసి ఆదరించారు. అందుకే మోదీ 33 సభలలో ఎన్నికల ప్రచారం చేసినా కర్ణాటక ప్రజలు బీజేపీని తోసిరాజన్నారు. మోదీ మాటకు విలువ పడిపోతున్నది. మాటలకూ, చేతలకూ పొంతన లేకుండా పోతున్నది. మోదీ మాట్లాడుతూనే ఉన్నారు. మణిపూర్ గురించి మాత్రం మొన్నటి దాకా మాట్లాడలేదు. మోదీ దేశ విదేశాలలో పర్యటిస్తూనే ఉన్నారు. మణిపూర్‌ను మాత్రం సందర్శించడం లేదు. కారణం తెలియదు. మణిపూర్‌లో జరిగినటువంటి ఘోరం రాజస్థాన్‌లో కానీ హిమాచల్‌ప్రదేశ్‌లో కానీ, ఛత్తీస్‌గఢ్‌లో కానీ జరిగి ఉన్నట్లయితే అక్కడికి మోదీ, షా, స్మృతి ఇరానీ వెంటనే వెళ్ళేవారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించేవారు. మానవ హక్కుల కమిషన్ నోటీసులు పంపించేది. పార్లమెంటులో రచ్చ రచ్చ జరిగేది. రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించేవారు. కానీ మణిపూర్ బీజేపీ పాలనలో ఉంది. బీరేన్ సింగ్ బీజేపీకి చాలా ముఖ్యుడు. తనకు మహిళలపైన అత్యాచారం జరిగినట్టు ఎఫ్ఐఆర్ దాఖలయ్యే వరకూ తెలియదని మొదట అన్నారు. ఇప్పుడు వీడియో బయటికి పొక్కిన తర్వాతనే తనకు ఈ విషయం తెలిసిందని ముఖ్యమంత్రి అంటున్నారు. తనకు తెలిసిన కొన్ని గంటలలోనే ప్రధాన నిందితుడిని అరెస్టు చేయించామని చెప్పుకుంటున్నారు. నిజానికి ఇద్దరు కుకీ మహిళలను అల్లరిమూకకు అప్పగించింది పోలీసులేనని ఆరోపణ. పోలీసులు చేసిన 'ఘనకార్యం' గురించి కూడా తెలియని ముఖ్యమంత్రి అధికారంలో ఉండటానికి అర్హుడా? పోలీసులలో, సాయుధ పోలీసులలో సైతం తెగ భేదాలు ఉన్నాయి. మైతీ పోలీసులు దక్షిణాదిన కొండలలో కుకీలు నివసించే ప్రాంతంలో పనిచేయరు. పోలీసు శిక్షణ కేంద్రం నుంచి, కేంద్ర బెటాలియన్ నుంచీ, మణిపూర్ సాయుధ బెటాలియన్ నుంచీ 6.32 లక్షల బుల్లెట్లూ, 4,537 మర తుపాకులూ మాయమయ్యాయి. వీటిలో అయిదు శాతం మాత్రమే కుకీల చేతుల్లోకి వెళ్ళాయి. తక్కినవి మైతీల చేతుల్లో ఉన్నాయి **(మిగతా 12వ పేజీలో)**

**భోపాల్‌లో గంభీరోపన్యాసం చేస్తూ ప్రధాని మోదీ ఎన్‌సీపీ నేతలు రూ.70 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, వారి గుట్టులన్నీ రట్టు చేస్తామని భీకర ప్రతిజ్ఞ చేశారు. ఇది జరిగిన వారంలోపే అదే ఎన్‌సీపీ నాయకులను మహారాష్ట్ర ప్రభుత్వంలో చేర్చుకున్నారు. రూ.70 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపించిన అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. అవినీతి ఆరోపణలపైన కొన్ని మాసాలు జైలులో గడిపిన ఛగన్ భుజ్‌బల్‌ను మంత్రిగా చేసి ఆదరించారు.**

# నగ్నంగా నడిచింది దేహం కాదు.. అది దేశం

యుగాలు దాటొచ్చిన మనిషిని
మృగాలుగా మార్చింది ఎవ్వడు ?
పాలిచ్చిన అమ్మల రొమ్ములను
బరితెగించి ఊరేగించిన ఉన్మాదానికి
ఊతమిచ్చింది ఎవ్వడు ?

వేట కుక్కల్ని ఉసి గొల్పింది ఎవ్వడు ?
విద్వేషాన్ని రక్తనాళాలలోకి
ఎక్కించింది ఎవ్వడు?
తల్లుల జననాంగాల మీద తాండవ మాడిన
గాడిద కొడుకులను కనిపెంచింది ఎవ్వడు ?

నెత్తురుని మరిగించింది ఎవ్వడు ?
కత్తులను నూరించింది ఎవ్వడు ?
పరమత ఆలయాలను కూల్చింది ఎవ్వడు?
ఉసురు తీసి ఉత్సవం చేసింది ఎవ్వడు ?

మంటలను రాజేసింది ఎవ్వడు ?
గిరిజన పంటలను కాల్చేసింది ఎవ్వడు ?
మదమెక్కి ఆడబిడ్డలపై మానభంగం చేసిన
మతోన్మాద మూకలకు నూకలు
ఇస్తున్నది ఎవ్వడు?
పాకలు వేసి "భక్షణ శిక్షణ"
అందిస్తున్నది ఎవ్వడు ?

ఎవ్వడురా విషాన్ని విరజిమ్ముతున్నది ?
ద్వేషాన్ని దేశంపై వెదజల్లుతున్నది ?
మతాన్ని మంటలకు ఇంధనం చేస్తున్నది ?

పచ్చని గసగసాల పైరు కొండల
మణిపూర్ కన్నుల కుండల నిండా
మరిగే వెచ్చిని నీరును నింపుతున్నది ?
వాడు....! వాడెవడంటే....!!

ఛాందస పీఠంపై పీటలు వేసుకొని
మౌఢ్య సిరా చుక్కలను
మౌన కలంలోకి ఒంపుకొని
రణ మరణ శాసనాలు లిఖిస్తున్నాడు.
మన జీవన గమనాలను శాసిస్తున్నాడు.

అయితే..! ఇప్పుడు వాడు అనుకుంటున్నట్టు !!
మణిపూర్ నడి వీధుల్లో
నగ్నంగా నడిచింది దేహం కాదు ..'అది దేశం'

పాశవిక అత్యాచారం జరిగింది
మానం మీద కాదు.. 'వాడి మౌనం మీద'

**- బండారు రమేష్, ఖమ్మం**

**(వాడి మౌనం ఎంత ప్రమాదమో.. మన మౌనం అంతకంటే ప్రమాదం మిత్రులారా)**

# మరో విషాద భారతం

మ మణిపూర్ మారణహోమంలో
ఆడపడుచుల మాన ప్రాణాల
నగ్నదేహాలు ఊరేగుతున్నాయి
ఉన్మాదుల అకృత్యాలకు బలవుతున్నాయి
దుశ్శాసన వారసుల అత్యాచారాలకు
అవమాన భారంతో భరతమాత
శిరస్సును వేలాడేసింది
నాడు ద్రౌపది మాన సంరక్షణకు
ఉరుకులు పెట్టిన శ్రీకృష్ణుడు
ఏడీ నేడు ?
ఒక్కడంటే ఒక్కడు లేడేని
హస్తినాపుర రాజ మందిరాలపై
తనకు తాను అవనతమయ్యింది
సిగ్గుతో జాతీయ పతాక
ఆధునిక ప్రభువుల రాజధర్మానికి
అశోకుని ధర్మచక్రం తునాతునకలయ్యింది
బంకించంద్ర బాబు వందేమాతర గీతం
విషాద రాగాన్ని ధ్వనిస్తోంది
నాగరిక ప్రపంచం ముందు
తల దించుకుంది నాదేశం నేడు

**- కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ**

# వెలుగు, వివేకం, గాంధేయం...!



- రామచంద్రగుహ

**'మన జీవితాలలోని వెలుగు వెళ్లిపోయింది.**
**కాదు, ఆ కాంతి ప్రకాశిస్తూనే ఉంది.**
**సహస్రాబ్దాల తరబడి అది మన హృదయాలను**
**జ్యోతిర్మయం చేస్తూనే ఉంటుంది'**

**- 1948 జనవరి 30 సాయంత్రం జవహర్‌లాల్ నెహ్రూ ఆకాశవాణిలో జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ అన్న మాటలవి.**

ఆ జ్యోతి, మనం మహాత్ముడుగా గౌరవిస్తున్న మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. మత సామరస్యానికై 75 ఏళ్ల క్రితం (జనవరి 30న) ఆయన ప్రాణత్యాగం చేశారు. ఇన్ని దశాబ్దాల తరువాత కూడా గాంధీ జీవితాచరణలు, బోధనలకూ ప్రాధాన్య మున్నదా? వాటిని మనం ఔదలదాల్చాలా? అవును. శిరసా వహించాలి. 21వ శతాబ్ది మూడో దశకంలో మహాత్ముని జీవితమూ, భావాలూ ఎందుకు యుక్తమైనవో పది భావద్యో తకమైన కారణాలను ప్రతిపాదించదలుచుకున్నాను.

సత్యాగ్రహం మొదటి కారణం. బలాన్ని ఉపయోగించకుండా అధర్మ పాలకులు, అన్యాయాలను ప్రతిఘటించేందుకు ఆయన ఒక వినూత్న మార్గాన్ని మనకు చూపారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే సత్యాగ్రహ భావన 1906 సెప్టెంబర్ 11న జోహాన్నెస్‌బర్గ్‌లోని ఎంపైర్ థియేటర్‌లో జరిగిన ఒక సమా వేశంలో ప్రభవించింది. జాతి వివక్షా విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపి స్వచ్ఛందంగా అరెస్టవ్వాలని ఆ సమావేశంలో పాల్గొన్న భారతీయులు గాంధీ నాయకత్వంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. 95 సంవత్సరాల అనంతరం సరిగ్గా అదే రోజున న్యూయార్క్‌లో ప్రపంచ వాణిజ్య కేంద్రాన్ని ఉగ్రవాదులు కూల్చివేశారు. రెండు 9/11లు! ఒకటి–అహింసాత్మక పోరాటం, వ్యక్తిగత త్యాగాల ద్వారా న్యాయసాధనకు పూనుకోగా మరొకటి హింస, విధ్వంసకాండతో శత్రువును జడిపించడానికి ప్రయత్నిం చింది. అన్యాయంపై నిరసన పోరాటంగా సత్యాగ్రహం మరింత నైతికమైనదని, ప్రత్యామ్నాయ పోరాట రూపాలకంటే అదే మరింత ప్రభావశీలమైనదని చరిత్ర రుజువు చేసింది. దక్షిణాఫ్రికా, భారత్‌లలో బ్రిటిష్ పాలనపై పోరాటానికి గాంధీ ఉపయోగించిన సత్యాగ్రహ పద్ధతిని ఆ తరువాత ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది అనుసరించారు. అమెరికాలో 1960వ దశకంలో జరిగిన పౌరహక్కుల ఉద్యమం వాటిలో అగ్రగణ్యమైనది. గాంధీ తన మాతృదేశాన్ని, దాని సంస్కృతిని ఔదలదాలుస్తూనే అందులోని మానవతా విరుద్ధ లక్షణాలను నిరసిస్తూ వాటిని సరిదిద్దడానికి ప్రయత్నించారు. ఇది ఆయన వర్తమాన ప్రాధాన్యానికి రెండో కారణం. గాంధీ కేవలం బ్రిటిష్ వారిపైనే కాకుండా భారత్‌పై కూడా పోరాడారని చరిత్రకారుడు సునీల్ ఖిలానీ ఒకసారి వ్యాఖ్యానించారు. భారతీయ సమాజం లో అసమానతలు ఎల్లెడలా దట్టంగా ఉన్నాయని గాంధీ గ్రహిం చారు. అసంఖ్యాక భారతీయులను పీడిస్తున్న దురాచారాలలో ఒకటైన అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన పోరాడారు. అస్పృశ్యత ఉన్నంతవరకు భారతీయులు నిజమైన స్వాతంత్ర్యా నికి అర్హులు కారని విశ్వసించినందునే అంటరానితనంపై ఆయన ఎడతెగని యుద్ధం చేశారు. అలాగే మహిళలు సకల జీవన రంగాలలో, ముఖ్యంగా ప్రజా జీవితంలోకి ప్రవేశిం చేందుకు గాంధీ అద్వితీయమైన తోడ్పాటునందించారు.

మహాత్ముడు అనుష్ఠాన హిందువు. అయితే పౌరసత్వాన్ని మత ప్రాతిపదికన నిర్వచించేందుకు ఆయన నిర్ద్వంద్వంగా నిరాకరిం చారు. కులం హిందువులను అడ్డంగానూ, మతం భారత్‌ను నిట్ట నిలువుగానూ విభజించిందని ఆయన భావించారు. ఈ చీలిక లను ఆయన వ్యతిరేకించారు. హిందూ–ముస్లిం సమైక్యతకు కృషి చేశారు. అందుకు ప్రాణత్యాగం చేసేందుకు కూడా ఆయన సిద్ధమయ్యారు. ఇది మహాత్ముని సార్వకాలిక ప్రాధాన్యానికి మూడో కారణం. జీవిత వైవిధ్యాన్ని గౌరవించడం గాంధీ గొప్పద నానికి, ఆయన స్ఫూర్తిదాయక ప్రాసంగికతకు నాలుగో కారణం. గుజరాతీ ఆయన మాతృభాష. ఆ భాషలో ఆయన మహా వచన కారుడు అని అందరూ అంగీకరించారు. ప్రాంతీయ సంకుచి తత్వం ఆయనలో ఏ కోశానా లేదు. ఇతర భాషా సంస్కృతులను చిన్నచూపు చూడడం, స్వభాషా సంస్కృతులు సర్వోత్తమమైనవని భావించడం ఆయన స్వభావానికి పూర్తిగా విరుద్ధం. లండన్‌లో ఉన్నత విద్యాభ్యాసం, దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ వృత్తి జీవితం ఆయనకు స్వదేశంలోని మత, భాషా పరమైన వైవిధ్యాన్ని గుర్తించి గౌరవించేలా చేశాయి. ఆయన సన్నిహిత సహచరుల లో హిందువులే కాదు, ముస్లింలూ ఉన్నారు. అలాగే గుజరాతీలే కాదు తమిళ తంబీలు కూడా ఎంతో మంది ఉన్నారు.

గాంధీ ఎంత దేశభక్తుడో అంతగా అంతర్జాతీయవాది. మరిం త స్పష్టంగా చెప్పాలంటే ఆయన విశ్వనరుడు. ఇది, మహాత్ముని ప్రాధాన్యాన్ని విశదం చేసే ఐదవ కారణం. భారతీ య నాగరికత

సమున్నతమైనదని ఆయన ప్రశంసించారు. అయితే 20వ శతాబ్దంలో ఏ దేశమూ బావిలో కప్పలా ఉండలేదని, ఉండకూడదని కూడా ఆయన విశ్వసించారు. ప్రాచ్య ఋషులే కాదు, పాశ్చాత్య విజ్ఞులూ ఆయన్ని ప్రభావితం చేశారు. తన విలక్షణ దృక్పథం, చింతనా రీతికి గోఖలే, రాయచంద్ భాయికే కాకుండా టాల్‌స్టాయి, రస్కిన్‌లకు కూడా ఆయన రుణపడి ఉన్నారు. అన్ని జాతుల, మతాల వారూ ఆయన సన్నిహిత స్నేహితులలో ఉన్నారు. ప్రస్తావిత ఐదు అంశాలూ స్వతంత్ర భారతదేశాన్ని పూర్తిగా ఒక భిన్న, సమున్నత దారిలో ఎలా ముందుకు నడిపాయో తెలుసుకోవాల్సిన అవసరముంది. హింసాత్మక పద్ధతులను అనుసరించకుండా చర్చల ద్వారా అహింసాయుతంగా స్వాతంత్ర్య సాధనకు గాంధీ ప్రాధాన్యమిచ్చారు. ఈ గాంధీ వారసత్వమే మన దేశం ఏక పార్టీ నియంతృత్వ రాజ్యంగా కాకుండా బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థగా ప్రభవించేందుకు విశేషంగా దోహదం చేసింది. జెండర్, కుల సమానత్వానికి గాంధీ, అంబేద్కర్‌లు జీవితాంతం కృషి చేశారు. ఆ సమానత్వ సాధనకు తోడ్పడే నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరిచారు. మత, భాషా పరమైన వైవిధ్యాన్ని పరిరక్షించాలని గాంధీ, నెహ్రూలు వక్కాణించినందునే మన దేశం పౌరసత్వాన్ని మతప్రాతిపదికన నిర్వచించలేదు. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించడం ద్వారా సామాజిక సమానత్వం, సాంస్కృతిక బహుళత్వానికి మహాత్ముడు అగ్రప్రాధాన్యం ఇవ్వడం వల్లే స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామిక, సమ్మిళిత రాజకీయ విలువలు వర్ధిల్లుతున్నాయని చెప్పి తీరాలి.

పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు ప్రారంభం కాక పూర్వమే మహాత్ముడు పర్యావరణ వాది. ఇది ఆయన ప్రాధాన్యానికి ఆరో కారణం. విచక్షణారహిత అభివృద్ధి, అడ్డూ అదుపూ లేని వినియోగదారీ సంస్కృతి ఈ ధరిత్రిని ధ్వంసం చేస్తాయని ఆయన 1928లోనే హెచ్చరించారు. గాంధీ జీవితం ఒక ప్రవాహ సదృశం. కొత్త వ్యక్తులతో సంభాషణలు, సంవాదాలుబీ నూతన అనుభవాల నుంచి మహాత్ముడు నిత్యం విలువైన విషయాలు నేర్చుకునేవాడు. ఈ విశాల దృక్పథం ఆయన ప్రాధాన్యానికి ఏడవ కారణం. వాస్తవాలకు అనుగుణంగా ఆయన తన అభిప్రాయాలను మార్చుకునేవారు. జీవిత క్రమంలో ఆయన మూడు అంశాలపై తన భావాలు, దృక్పథాన్ని మార్చుకున్నారు. జాతి, కులం, జెండర్ వాటిలో ముఖ్యమైనవి. ఈ జీవన వాస్తవాలపై గాంధీ తన యవ్వన కాలపు దురభిప్రాయాలను త్యజించి మరింత ప్రగతిశీల వైఖరిని అలవరచుకున్నారు. అనాలోచిత జాతి దురహంకారం నుంచి బయటపడి సూత్ర బద్ధ జాతి వివక్ష వ్యతిరేకవాదిగా మారారు. కులానికి సంబంధించి సామాజిక నిచ్చెన మెట్ల వ్యవస్థను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అంతిమంగా కుల వ్యవస్థ దురాచారాలపై నేరుగా పోరాడారు. తొలుత మహిళలను రాజకీయేతర కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేసిన గాంధీ ఆ తరువాత వారిని ప్రజా జీవితంలో ప్రవేశించేందుకు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేందుకు హృదయపూర్వకంగా ప్రోత్సహించా రు. తన అనుయాయులను నాయకులుగా రూపొందించడంలో గాంధీకి అద్భుతమైన నేర్పు ఉన్నది. ఇది ఆయన ప్రాధాన్యానికి ఎనిమిదో కారణం. ప్రతిభావంతులను గుర్తించి వారిని అన్ని విధాల ప్రోత్సహించేవారు. శిక్షణ ఇచ్చేవారు. సమున్నత బాధ్యతలను నిష్పాక్షికంగా నిర్వర్తించేలా వారిని తీర్చిదిద్దేవారు. ఆ తరువాత వారు తమ సొంత మార్గాలలో ముందుకు సాగేందుకు స్వేచ్ఛనిచ్చేవారు. గాంధీ అనుయాయులలో అనేక మంది మహానాయకులుగా ఎదిగారు. జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, కమలాదేవి ఛటో పాధ్యాయ, సి.రాజగోపాలాచారి, జకీర్ హుస్సేన్, జెబి. కృపలానీ, జేసీ కుమారప్ప మొదలైన వారినెందరినో ఉదహరించవచ్చు.

ప్రత్యర్థుల దృక్పథంలోని సమంజసత్వాన్ని అంగీకరించి, వారితో గౌరవ పూర్వకంగా రాజీపడేందుకు సుముఖత చూపే వైఖరి గాంధీ గొప్పదనానికి, ప్రాధాన్యానికి తొమ్మిదో కారణం. రాజకీయ ప్రత్యర్థులైన జిన్నా, అంబేద్కర్‌లతోనూ, దక్షిణాఫ్రికా, భారత్‌లలో బ్రిటిష్ పాలనాధికారులతోనూ ఆయన తీవ్రంగా విభేదించేవారు. అయితే ఆ విభేదాలు మేధాపరమైనవి, విధానపరమైనవి మాత్రమే, వారిపట్ల వ్యక్తిగత అయిష్టత, విద్వేష భావం చూపడమనేది గాంధీ స్వభావంలో లేనేలేదు. ఆ విభేదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఆయన ప్రయత్నించేవారు.

గాంధీ రాజకీయ జీవితమూ ఒక తెరిచిన పుస్తకమే. సంపూర్ణ పారదర్శకత దాని విశిష్ట గుణం. మహాత్ముని ప్రాధాన్యానికి ఇది పదవ కారణం. ఎవరైనా సరే గాంధీ ఆశ్రమంలోకి వెళ్లవచ్చు. ఆయనతో ఎవరైనా స్వేచ్ఛగా సంవాదపడవచ్చు. ఎవరైనా సరే బాపూ వద్దకు స్వేచ్ఛగా వెళ్లవచ్చుబీ ఆయన్ని హత్య చేయవచ్చు! నిజానికి అంతిమంగా జరిగింది కూడా ఇంతేకదా!!


ఇవీ, గాంధీ జీవితం నుంచి మనం నేర్చుకోవల్సిన పాఠాలు. మహాత్ముని జీవనరీతులు, సామాజిక దురన్యాయాలు, అధర్మ పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఆయన అనుసరించిన పద్ధతులు, నవీన నాగరికతలోని ప్రమాదకర పోకడల గురించి అసాధారణ దూరదృష్టితో చేసిన హెచ్చరికలు నేడు కేవలం మన దేశానికే కాకుండా యావత్ప్రపంచానికీ ఉపయుక్తమైనవి. కలహశీల మతోన్మాద మెజారిటీ వాదంబీ ప్రతీకార రాజకీయ ధోరణులుబీ సత్యసంధత లోపించిన నాయకులు, చిత్తశుద్ధిలేని ప్రభుత్వాలు, విచక్షణారహితంగా ప్రాకృతిక సంపదల విధ్వంసం, వ్యక్తి పూజలు పెరిగిపోతున్న వర్తమాన భారతదేశంలో గాంధీ జీవితం నేర్పుతున్న పాఠాలకు మరింత ప్రాధాన్యమున్నది. ❑

# గాంధీజీ-రవీంద్రుల అపూర్వ మైత్రి

- డా.నందనూరు భాస్కరరెడ్డి

ఆధునిక భారతదేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, మోహన్ దాస్ కరంచంద్ గాంధీలిద్దరూ పేరెన్నికగన్న దిగ్గజాలు. వారిలో మొదటివారు కవి, రచయిత, తత్వవేత్త, చిత్రకారులు, వాటన్నిటికీ మించి గొప్ప దేశభక్తులు. రెండవ వారు భారత దేశ స్వాతంత్ర ఉద్యమాన్ని అనితరసాధ్యంగా ముందుకు నడిపించిన చోదకశక్తి. రవీంద్రులు1861 మే నెల ఏడవ తేదీన దేవేంద్ర నాథ్ ఠాగూర్, శారదా దేవి దంపతులకు పదమూడు మంది సంతానంలో చిన్నవాడిగా కలకత్తాలో జన్మించారు. బాల్యంలో ఇంటివద్ద విద్యనభ్యసించారు. 17 ఏళ్ల వయస్సులో సాధారణ విద్యనభ్యసించడానికి ఇంగ్లండ్ వెళ్లి చదువు పూర్తిచేయకనే తిరిగి వచ్చేశారు. కానీ సునిశిత పరిశీలన శక్తీ, అపారమైన జీవితానురక్తీ కలిగిన ఆయన సాహిత్యరంగంలో శిఖరాయమానంగా ఎదిగి, గొప్ప పేరు ప్రఖ్యాతులు అర్జించారు. తర్వాత తన ఆశయాల సాధన కోసం 'శాంతినికేతన్' అన్న ప్రయోగాత్మక విద్యాలయాన్ని స్థాపించారు. రవీంద్రుల సాహిత్య ప్రతిభకు గుర్తింపుగా 1913లో తొలి భారతీయునిగా, ఆసియా వాసిగా నోబెల్ బహుమతిని అందుకు న్నారు. ఆశ్చర్యకరంగా 1937, 1938, 1939, 1947లలో, చివరికి 1948 జనవరిలోనూ ఐదుసార్లు గాంధీజీ పేరు నోబెల్ బహుమతికి నామినేట్ అయినప్పటికీ ఫలప్రదం కాలేదు. దీని గురించి ప్రస్తావిస్తూ 2006లో నోబుల్ కమిటీ సెక్రటరీ 'మా 106 సంవత్సరాల చరిత్రలో అదొక గొప్ప విస్మరణం', అని పేర్కొన్నారు.

రవీంద్రులు గాంధీజీని మహాత్మునిగా, గాంధీజీ రవీంద్రులను గురుదేవులుగా గౌరవించుకునేవారు. గాంధీజీ రవీంద్రుల మధ్య తాత్విక, ఆధ్యాత్మిక దృక్పథాల్లో చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ కొన్ని ప్రధానమైన అంశాల్లో పూర్తిగా ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండేవారు. వీటిల్లో ముఖ్యమైంది ప్రజలకు సేవ చేయడంలో వారికి ఉన్న నిబద్ధత. రవీంద్రులు గాంధీజీకి రాసిన తొలి లేఖలో ప్రజా సేవను వారిద్దరి ఉమ్మడి సాధనగా పేర్కొన్నారు. గాంధీజీ మూర్తిభవించిన ప్రజాసేవకుడన్నది జగమెరిగిన సత్యం. ప్రజాసేవే ఆయన పిలుపు, ఆయన జీవితం. అందువల్లనే 'నా జీవితమే నా సందేశం' అని చివరికి ధైర్యంగా ప్రకటించగలిగారు. గాంధీజీ చేసిన ప్రజాసేవ గురించి అందరికీ తెలుసు. దాని గురించి తిరిగి చెప్పనక్కరలేదు. కానీ రచయితగా, కళాకారునిగా విఖ్యాతిగాంచిన రవీంద్రులు చేసిన ప్రజాసేవ గురించి ప్రజా బాహుళ్యానికి అంతగా తెలియదు.



బెంగాల్లో గ్రామీణ ప్రాంతంలోని వారి ఎస్టేట్ వ్యవహారాలను పర్యవేక్షించడానికి వెళ్లినప్పటి నుంచి ఆ చుట్టుపక్కల ఉన్న నిరుపేదల సాధకబాధకాలను చూసి, వారి సంక్షేమానికి తోడ్పడాలని సంకల్పించారు. ప్రజల సమస్యల్ని తన రచనల్లో ప్రస్తావిస్తూ రావడమే కాకుండా శాంతినికేతన్ చుట్టుపక్కలనున్న పల్లెల అభివృద్ధిపై దృష్టి సారించారు. ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధించడంతోపాటు, వారు పరస్పర సహకారం అందించుకునే దిశగా ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. 'మన కష్టాల కారణాలను బయటనుంచి తొలగించలేం, వాటిని లోపల నుంచి నిర్మూలించాలి. దీని కోసం అందరూ విద్యావంతులు కావాలి, ఐక్యంగా ఉంటూ సమిష్టిగా జీవనోపాధికి కృషి చేయాలి,' అని తన రచనల్లో పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతి పట్ల తన అనురక్తిని కొన్ని కథల్లోనూ,నవలల్లోనూ ప్రత్యేకించి పేర్కొన్నారు. ప్రజల కోసం 'ఘోరా' పడ్డ తపన, 'చతురంగ' అనే నవలలో 'జేతామోషై' పాత్ర చిత్రణ ఆయన అభిప్రాయాలకు అద్దం పడుతాయి.

పేదలకు సేవ చేయాలన్న అంకిత స్వభావమే గాంధీజీ రవీంద్రులను స్వరాజ్య సాధన వైపు నడిపింది. వారి దృష్టిలో స్వరాజ్య ఉద్యమం కేవలం బ్రిటిష్ పాలన నుండి రాజకీయ స్వేచ్ఛను పొందడం కాదు, స్వాతంత్ర్యంతోపాటు సాంఘిక, రాజకీయ, ఆర్థిక బాధల నుండి ప్రజలకు విముక్తిని కలిగించడం.

ప్రభుత్వం మీద ఆధారపడకుండా స్వతంత్రంగా తమ జీవితాలను నడిపించుకునే శక్తి సామర్థ్యాలను పెంపొందించు కోవడం స్వరాజ్యం యొక్క ప్రధాన లక్ష్యం. దీనికోసం ప్రజలు నిర్భయంగా ముందుకు పోవాలని గాంధీజీ చెబితే, ఆత్మ శక్తితో ముందుకు సాగాలని రవీంద్రులు బోధించారు. నిజానికి ఈ రెండు భావనలు విడదీయరానివి. పైగా సేవాతత్పరతనూ బాధ్యతాయుత్వాన్నీ కలిగినప్పుడే ఈ రెండు భావనలను పొందగలరు. భారతదేశానికి సాంఘిక స్వేచ్ఛను, అంటే మంచిని చేయగల స్వేచ్ఛను పొందడమే నిజమైన స్వాతంత్రం అని రవీంద్రులు రాశారు.

స్వరాజ్యంపై తన దృక్పథాన్ని 'మన రాజు సామ్రాజ్యంలో మనమందరం రాజులం,' అనే అర్థం వచ్చేటట్టు రవీంద్రులు ఒక ప్రసిద్ధమైన పాటలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సార్వభౌమత్వాన్ని కలిగి ఉంటే అప్పుడు రాజు అవసరం ఉండదు అని ఆయన అభిప్రాయం. ఇదే అభిప్రాయాన్ని గాంధీజీ 'జ్ఞానోదయపూర్వక అరాచకం'గా అభివర్ణించారు. 1939 జనవరిలో గాంధీజీ ఇలా రాశారు: 'నా అభిప్రాయంలో రాజకీయ స్వేచ్ఛ అనేది అంతిమ లక్ష్యం కాదు. ప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందడానికి అదొక సాధనం కావాలి. జాతీయ జీవనాన్ని అదుపులో ఉంచడానికి జాతీయ ప్రతినిధులు కలిగి ఉండే అధికారాన్ని 'రాజకీయ అధికారం' అని అంటాం. ఒకసారి గనక జాతీయ జీవనం దానికదే పరిపూర్ణతను సంత రించుకుంటే అప్పుడు రాజకీయ అధికారంతో పనిలేదు. అప్పుడు దానికదే జ్ఞానోదయపూర్వక అరాచక స్థితి ఏర్పడు తుంది. అందులో ప్రతి ఒక్కరూ స్వయంగా పాలకుడే. అలాంటి ఆదర్శమైన స్థితిలో రాజకీయ వ్యవస్థగానీ రాజకీయ అధికారం గానీ ఉండదు.'

గాంధీజీ, రవీంద్రులు బ్రిటిష్ పాలనను ఎదుర్కోవడానికి అహింసా సిద్ధాంతాన్ని నైతిక శక్తిగా వినియోగించుకున్నారు. తాము కీలకపాత్ర వహిస్తున్న కొన్ని ఉద్యమాలు హింసాయు తంగా మారినప్పుడు, వాటి నుండి స్వతహాగా వైదొలగారు. స్వదేశీ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో ఒకసారి తీవ్ర మానసిక సంఘర్షణకు లోనై 'ఏక్ లా చోలోరే,' అనే ఓ మధురమైన పాటను రవీంద్రులు రాశారు. దీని అర్థం 'ఎవరూ నీ పిలుపును వినకుంటే ఒంటరిగానే ప్రయాణించు' అని. ఈ పాటను గాంధీజీ తన జీవిత నినాదంగా మార్చుకుని, దాన్ని జీవితాంతం ఆచరించి చూపారు. చౌరిచౌరాలో సహాయ నిరాకరణ ఉద్యమం హింసాయుతంగా మారినప్పుడు దాని నుండి గాంధీజీ బయటకు వచ్చేశారు. తర్వాత, జీవితపు చివర దశలో దేశ విభజన చర్చలలోనూ పాల్గొనకుండా ఒంటరిగా నౌఖలి అనే ప్రదేశానికి వెళ్లిపోయి తన ఆదర్శాలైన సేవ, అహింస, నిర్భయత్వాలను కొనసాగించారు.

గాంధీజీ రవీంద్రులకు అహింసా సిద్ధాంతం ఎంతో ప్రీతి పాత్రమైనది గనుక వారు జాతిపరంగానూ మతపరంగానూ ద్వేషరహితమైన, సామరస్య పూర్వకమైన భారతదేశాన్నీ, ప్రపంచాన్నీ చూడాలని ఎంతగానో ఉవ్విళ్ళూరారు. వేర్పాటు వాదుల చర్యతో వారి కలలకు భంగం వాటిల్లగా తీవ్ర మనో వేదనను అనుభవించారు. దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న హింసాకాండను స్వయంగా చూడలేకపోయినప్పటికీ తాను మరణించడానికి కొన్ని నెలలకు ముందు ప్రపంచమంతా జరుగుతున్న ఘర్షణల్ని చూసి రవీంద్రులు బాధపడ్డారు. దురదృష్టవశాత్తు దేశ విభజన సమయంలో తన కళ్ళ ముందు జరిగిన మారణకాండను చూసి చలించిపోయిన గాంధీజీ, అది వరకటి మనిషి కాలేకపోయారని స్వయంగా ఆయన అనుయా యులు చెప్పారు. ఆ సంఘటనలను తలచుకొంటూ జీవితపు చివరి దశలో 'అపజయం పొందడం నాకు ఇష్టం లేదు, కానీ నేను ఓడిపోయానేమో,' అని నిర్మల్ బోస్‌తో గాంధీజీ తన ఆవేదనను తెలియజేశారు.

ఒకరి పట్ల ఒకరు గౌరవాన్ని ప్రదర్శిస్తూ, సాంఘిక రాజకీయ అంశాల మీద తమదైన విభిన్న అభిప్రాయాలను బహిరంగ చర్చలలో గాంధీజీ, రవీంద్రులు వ్యక్తీకరించిన తీరు ఒక ఆదర్శవంతమైన దృష్టాంతం. వారు ప్రజాభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పరుషత్వానికి తావులేని ఆదర్శవంతమైన చర్చలు జరిపారు. ఇది వారిద్దరి వారసత్వంగా రూపొందిన రాజ్యాంగం. నాగరికమైన చర్చలతో సంభాషణలతో ద్వేషరహిత మైన మతవిద్వేషాలులేని భారతదేశాన్ని మలచే అసిధారావ్ర తానికి గాంధీజీ రవీంద్రుల ఆదర్శం ఒక దీపస్తంభం. ❑

# మౌనం ప్రధానికి ఒక..

(7వ పేజీ తరువాయి)

మణిపూర్ మహిళలు సాహసవంతులు. మైతీ మహిళలు జైలును ముట్టడించి 12 మంది కాగ్లీ యేవోల్ కెన్నా లుప్ మిటిటెంట్ గ్రూపుకు చెందిన యోధులను విడుదల చేయించారు. ఈ ఉదంతంలో చర్యలు లేవు. నిర్బంధాలు లేవు. విచారణ లేదు. 12 మంది మణిపూర్ మహిళలు కంగ్లాఫోర్ట్‌లో నగ్నంగా నిలబడి నిరసన ప్రదర్శన చేశారు. తమ హక్కులను హరించడం పట్ల నిరసన ప్రకటించారు. షర్మిల పదహారేళ్ళు నిరాహార దీక్ష చేసింది. ఏఎఫ్ఎస్ పీఏ(ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్)ను రద్దు చేయమని డిమాండ్ చేసింది. కల్లోలిత ప్రాంతాలలో అమలుచేసే ఈ చట్టం పరిధిని కుదించారు. అటువంటి మహిళలను సైతం మత సంఘర్షణలలో సమిధలు చేస్తున్నారు. ❑

# మేము ఆర్ఎస్ఎస్‌ను ఏనాడూ విడిచి ఉండలేదు

- నాథూరాం గాడ్సే సోదరుడు గోపాల్ గాడ్సేతో.. ఫ్రంట్‌లైన్ ఇంటర్వ్యూ

**ప్ర : మీరూ ఆర్ఎస్ఎస్‌లో ఉన్నారా ?**

- మా అన్నదమ్ములైన నలుగురూ నాథూరామ్, దత్తాత్రేయ, నేను, గోవింద్ ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారమే. మా పెంపకం అంతా ఇంట్లో కన్నా ఆర్ఎస్ఎస్ ముంగిట్లోనే సాగింది. ఆర్ఎస్ఎస్ మా పాలిట కుటుంబం.

**ప్ర : నాథూరాం ఆర్ఎస్ఎస్ ఉన్నారా ? దాన్ని విడిచి పెట్టలేదా?**

- నాథూరాం ఆర్ఎస్ఎస్ 'బౌద్ధిక్ కార్యవాహక్'(మేధో కార్యకర్త). ఆర్ఎస్ఎస్‌ను ఏనాడో విడిచి పెట్టానని నాథూరాం అన్నాడంటే దానికి కారణం గాంధీ హత్యానంతరం గురు గోల్వాల్కర్, ఆర్ఎస్ఎస్‌లు అప్పటికే ఇబ్బందుల్లో ఉన్నాయి. కాబట్టి వారిని ఇంకా ఇబ్బందుల్లోకి నెట్టకూడదనే ఉద్దేశంతోనే. వాస్తవికానికి తను ఆర్ఎస్ఎస్‌ను ఏనాడూ విడిచి ఉండలేదు.

**ప్ర : నాథూరాంకి, ఆర్ఎస్ఎస్‌కు ఏం సంబంధం లేదని ఈ మధ్యన అద్వానీ కూడా అన్నారు కదా?**

- ఆ మాటలకి నే బదులు చెప్పాను కూడా. అవి పిరికితనంతో అన్నమాటలు. 'వెళ్ళి గాంధీని చంపు' అని ఆర్ఎస్ఎస్ ఓ తీర్మానం చేసి ఉండకపోవచ్చు గాక, కానీ మీరు (ఆర్ఎస్ఎస్) అతన్ని(నాథూరాం) మావాడు కాదని వదిలించుకోలేరు. హిందూ మహాసభ అతను మావాడు కాదని చెప్పలా. 1949 లో నాథూరామ్ హిందూ మహాసభలో పనిచేస్తూ ఆ క్రమంలోనే ఆర్ఎస్ఎస్‌లో 'బౌద్ధిక కార్యవాహ్' అయ్యాడు.

**ప్ర : గాంధీని చంపాలని ఎప్పుడు ప్లాన్ చేశారు?**

- (ఆర్ఎస్ఎస్ నీడలే) హిందూ రాష్ట్ర దినపత్రికలో సంపాదకుడిగా పనిచేస్తున్న నాథూరామ్‌కు టెలిప్రింటర్ ఉండేది. అందులో గాంధీ ఆ మరుసటి రోజున నిరాహార దీక్ష చేయనున్నాడనే వార్త చూశాడు. పాకిస్తాన్-కాశ్మీరు దురాక్రమణ వివాదం పరిష్కరింపబడేంత వరకు భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు చెందిన రూ.55 కోట్లను స్తంభింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రూ.55 కోట్లు భారత్-పాక్ విభజన సందర్భంగా పాకిస్థాన్‌కు చెందాల్సిన సొమ్ముగా నిర్ణయిం చారు. ఈ సొమ్మును స్తంభింపచేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ నిరాహారదీక్షకు పూనుకోవాలనుకున్నాడు. ఆ వార్త చూడగానే నాథూరామ్ ఇంక దీనికి స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నట్టున్నాడు. కాని అంతకుముందు చాలాసార్లు గాంధీని



లేపెయ్యాలని ఆలోచించారు. శరణార్థ శిబిరాల్లో వారు అలా అనుకున్నారు. మనకీ ప్రారబ్ధం తెచ్చిపెట్టాడు కాబట్టి అతన్ని చంపేస్తే పోలా అని అనేక సందర్భాల్లో అనేకమంది అనుకున్నారు. అట్లానే కుట్రల మీద కుట్రలకు పథకాలు రచించినా ఏవీ ఒక కారణాన గాలికి కొట్టుకుపోయే పేల పిండిలా ఎగిరిపోయాయి. అన్ని పరిస్థితులూ సరిగ్గా కుదరడంతో సరిగ్గా ఆ కుట్ర విజయవంతమైంది. కుట్రదారులకు సంబంధించి వారి కల నిజమైంది. వారి లక్ష్యం సాధించబడింది.

**ప్ర : మీకు, సావర్కరుకు ఇందులో సంబంధం ఏమిటి?**

- సావర్కర్‌ను మేం గురువుగా భావిస్తాం. మా రాజకీయ గురువు ఆయన. సావర్కర్‌ను మేం పూర్తిగా అర్థం చేసుకోవడమే నిజమైతే ఈ పని (గాంధీ హత్య) మేం చేయొచ్చా ? చేయకూడదా? అని అడగడం అవివేకం అవుతుంది. బలహీనులు మాత్రమే గురువు గారి ఆశీస్సులు కోరుకుంటారు. ఉదాహరణకు గురువుగారు 'మూర్ఖుల్లారా అలాంటి పని చెయ్యబాకండి' అంటూ మా చేతులు కట్టేసారనుకోండి ఆ తర్వాత ఆ పని వేరే వాళ్ళెవరో కానిచ్చేసారనుకోండి.

**ప్ర : గాంధీ హత్యానంతరం సావర్కర్ స్పందన ఏమిటి?**

- అందరి మాదిరిగానే 'ఈ దురదృష్టకరమైన వార్త వినగానే నేమ్రాన్పడిపోయాను' అని. ఇది జనం కోసం చేసిన ప్రకటన.

**ప్ర : గాంధీ జాతీయోద్యమంలోకి హిందూ సంస్కృతిని చొప్పించడం ద్వారా ఉద్యమాన్ని మరింత విశాల పరిచాడని, ప్రజామోద పునాది వేశాడని చాలా మంది నిందించడం మీరు ఎరిగి ఉంటారు కదా. దీని గురించి మీరేమంటారు?**

• అదేమాట నిజమై ఉంటే ఈ దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించి ఉండేవాడు. కాని, అతను అట్లా చెయ్యలేదు. అట్లానే చచ్చిపోయే ముందు గాంధీ 'హేరామ్' అన్నాడని కాంగ్రెస్ పుట్టించింది. నిజానికి అట్లాంటిదేం జరగలేదు. గాంధీ ప్రాణం విడుస్తూ హేరామ్ అన్నాడన్న కట్టుకథ అల్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా 'రామ' శబ్దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంది.

**ప్ర : గాంధీగారు హిందూత్వకు సంబంధించి విరాట పురుష దృక్పథం నుండి కాక.. పౌరుషహీనంగా విశ్లేషించాడనే విమర్శ కొందరు చేస్తున్నారు. దీని గురించి మీరేం అనుకుంటున్నారు ?**

• ఇదంతా చాలా అసందిగ్ధమైన వ్యవహారం. గాంధీ వ్యవహార శైలి ఎలా ఉంటుందంటే యుద్ధాన్ని ఆపండని రూజ్‌వెల్ట్‌కు, చర్చిల్‌కు, హిట్లర్‌కు, ఇతర యుద్ధ ప్రభువులకు టెలిగ్రాములు పంపాడు. పండిత నెహ్రూ వచ్చి 'మన భూభాగం కాపాడుకోవడానికి నేను సైన్యాన్ని పంపనా' అనడిగితే పంపమని చెప్పాడు. సైన్యం చేతికి చరఖాలు ఇచ్చి పంపకపోయాడా? అంటే ఏంటి ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి.

**ప్ర: 'హిందువులు చాలా కాలంగా పిరికితనంగా బతుకుతున్నారు. నిజానికి అహింసా మార్గం హిందువులని బలహీనులుగా మారుస్తుంది. ఇప్పటి నుంచైనా మనం దూకుడు మీద ఉండాలి' అని ఉమాభారతి, సాధ్విరితంబర పిలుపునిస్తున్నారు.**

• ఆ మాటలు నేను ఒప్పుకోను. నా దేశంలో నేను దూకుడుగా రెచ్చిపోవాల్సిన పనిలేదు. ఉదాహరణకు నాకు మలేరియా జ్వరం సోకిందనుకోండి డాక్టరు నాకు ఇంజెక్షన్ చేస్తాడు. నా శరీరం మీద దాడి చేసిన మలేరియాను నా ఒంట్లోంచి తుడిచేస్తాడు. ఇక్కడ మలేరియా పట్ల నేను దూకుడుగా ఎందుకుండాలి. అదే నా శరీరాన్ని దురాక్రమించింది కదా. ఇందుకు పరిష్కారం దెబ్బకి దెబ్బ తియ్యడమే. తుడిచి పెట్టెయ్యాలంటే భరతమాత దేహం మీద ఇలాంటి మలేరియా క్రిముల వంటి వాటిని ఏరిపారెయ్యాలి దానికి మీరేం పేరు పెట్టుకున్నా సరే.

**ప్ర : హిందూ మహాసభకు బీజేపీకి మధ్యన ఒక కొనసాగింపు ఉందని మీరు ఎలా అనుకుంటున్నారు ?**

• ఇవన్నీ హిందూ రాజ్యస్థాపనకు కలిసి రావాల్సిందే.వేరే దారిలేదు హిందువులు-ముస్లింలు మధ్య విభజన వచ్చి తీరుతుంది. అప్పుడు మరో బోస్నియాను ఇక్కడి చూస్తారు.

**ప్ర : అంటే అంతర్యుద్ధం వస్తుందనా?**

• అనివార్యంగా, ఓట్ల కోసం ముస్లింలను బుజ్జగించే ధోరణి జనాన్ని ఆ వైపుకు నెడుతుంది. బీజేపీ నేరుగా హిందూ కార్డును వాడదు. వాడలేదు కూడా. వాళ్ళు ముస్లిం ఓట్లను లెక్కలోకి తీసుకోకూడదు. ఒకసారేమో 'రామ మందిరం అంటారు. ఆనక ముస్లింలకు సర్ది చెబుతుంటారు అవి చెల్లవు.

**ప్ర : జాతీయోద్యమం కాలంలోను, అనేక సామాజిక సంస్కరణ ఉద్యమాల్లోను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అట్లాంటి జనం సాంస్కృతిక నేపథ్యం ఏమై ఉంటుందని మీరనుకుంటున్నారు. అందులో చాలా మంది సద్బ్రాహ్మణ కుటుంబాల నుంచి వచ్చిన వారు కూడా ఉన్నారుగా ?**

• బ్రాహ్మణ తరగతికి చెందిన వాళ్ళు – పీష్వాలు– అందరికన్నా పైన ఉంటారు. వాళ్ళలో విప్లవకారులు ఉన్నారు. మంగల్ పాండేను తీసుకోండి. స్వాతంత్ర్యోద్యమ హీరో అతను. బ్రాహ్మణుడు. అలాగే మహారాష్ట్ర వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే అని బ్రాహ్మణుడు. తిరుగుబాటు లేవదీశాడు. 1883లో చనిపోయాడు. ఇహ ఛాపేకర్ సోదరుల సంగతి తీసుకోండి. 1897 పూనా ప్లేగ్ కమిటీకి నిరంకుశ అధ్యక్షుడిగా వ్యవహరించిన వాల్టర్ ఛార్లెస్ పాండేని హతమర్చారు. తిలక్ ఎవరు? బ్రాహ్మణుడు. విష్ణుశాస్త్రి చిపులంకర్, రానడే.. ఇలా..

**ప్ర : మీరు చెప్పదలచుకుంది ఏమిటి?**

• వాళ్లంతా గొప్ప ఆలోచనాపరులు. దేశం కోసం బలి దానానికి సిద్ధపడినవాళ్ళు. దేశ సమగ్రత కోసం నిలబడిన వాళ్లు విభజన మూలంగా మహారాష్ట్ర ప్రత్యేకంగా నష్టం వాటిల్లింది ఏమీ లేదు. అయినప్పటికీ మహారాష్ట్ర నుండి వేరుపడిన ప్రొవిన్షియల్ ప్రాంతాలు, అక్కడ ఆకృత్యాలకు గురవుతున్న ప్రజానీకం గురించి ఒక మహారాష్ట్రీయుడు 2000 మైళ్ల దూరానికి పోవాల్సిన అవసరం ఏమొచ్చింది. జాతీయ సమగ్రత అంటే అదీ. ఆ సంప్రదాయం లాంటి గొప్ప ఉత్తేజంతో నడిచింది. ఆ విశాల భావన నడిపించింది ఈ పేపర్లు ఉన్నయ్యే 'ఎల్లో జర్నలిజమ్' అని చెప్పుకోవచ్చు. అవి పీష్వా పేరుని బ్రాహ్మణులని అప్రతిష్ట పాలెయ్యడానికి వాడుకుంటూ ఉంటారు. ఎందుకంటే అవి సోకాల్డ్ బలహీన తరగతుల నుండి, బహుజనుల నుండి వారిని బుజ్జగించడమే పనిగా పెట్టుకున్నాయి.

**ప్ర : ఈ రెండు ప్రత్యేకతలకు విలువలేదంటారా?**


• నేను ఇంతకుముందు చెప్పినట్లు విభజన సమయంలో ఎవరినీ ఉపేక్షించలా ? అందరూ ఊచకోతకు గురయ్యారు. ముస్లిమ్ కత్తులకు ఎరగా మారిన వారంతా హిందువులే. శ్మశానంలో మనం కలుసుకున్నాం. కానీ బతికి ఉన్నంత కాలం 'లేదు లేదు నేను హిందువుని కాదు' అని చెప్పుకుంటాం. హిందువులెవరో ముస్లింలు నిర్ణయిస్తారు. అదలా జరుగుతుంది అంతే. ఎవరికన్నా పారంపర్యంగా సంపద లభించింది అనుకోండి దర్జాగా ఖర్చులు పెడుతూ ఉంటారు. వాళ్ళకు దాని విలువ తెలియదు. ఈ జనానికి, హిందూత్వ కూడా అలాంటిదే. నవ్వొస్తుంది తల్చుకుంటే. ❑

(ఫ్రంట్ లైన్, 1994 జనవరి 28 సంచిక)

# ఔరా.. ఏమి చితరమిది!!?



- విరించి విరివింటి



గాం ధీజీని తిట్టే మహా పురుషులందరూ ఈ రోజు బయటకి వస్తుంటారు. ఇలా తిట్టే వాళ్ళల్లో చాలా మందికి గాంధీజీ ఎవరు ? ఏమిటనేది ? తెలియదు. తెలుసుకోవాలని ఇంట్రెస్టు కూడా ఉండదు. గాంధీజీ గురించి తెలుసుకోవాలంటే మొదటగా ఆయన ఉన్నప్పటి కాల చరిత్రను చదవాలి. రెండోది ఆయన ఆ కాలాన్ని ఎలా దర్శించాడో తెలుసుకోవాలంటే ఆయన రాసిన పుస్తకాలు చదవాలి.

'నాకు గాంధీజీ భావజాలం నచ్చలేదు' అన్నాడొకాయన. 'ఆయన రాసిన ఏ పుస్తకంలో భావజాలం నచ్చలేదు?' అనడిగాను. 'గాంధీజీ పుస్తకాలు కూడా రాశాడా?'. అని మళ్ళీ ప్రశ్న వేశాడు. ఇలా ఉంటుంది!!. గాంధీజీ భావజాలం తెలియాలంటే ఆయనతో కలిసి పయనించాలి. ఇపుడు ఆయన లేరు కాబట్టి ఆయన పుస్తకాలు చదివితే తప్ప ఆయన భావజాలం ఏంటో తెలిసిరాదు.

గాంధీజీ భావజాలం నచ్చలేదన్న ఆ మిత్రుడికి గాంధీజీ పుస్తకాలు రాశారన్న విషయమే తెలియదు. ఏ భావజాలం రాశారో తెలియదు. కానీ గాంధీజీని విమర్శిస్తాడంట. ఇలాంటి వాళ్ళు చాలా మంది కనిపిస్తూ ఉంటారు. 'ఇంతకీ గాంధీ గురించి ఎక్కడ చదివావు'. అని అడిగాను. 'మొన్న వాట్సప్‌లో వచ్చింది'. అన్నాడు. వాట్సప్ జ్ఞానం అన్నమాట. చూడండి ఇది సీరియస్ సమస్య. మనం జ్ఞాన మార్గాల మార్పు గురించి గతంలో చర్చించుకున్నాం. టీవీలు, వాట్సాప్‌లు లేని కాలంలో ఎవరైనా గాంధీని తెలుసుకోవాలన్నా విమర్శించాలన్నా పుస్తకాలే ఆధారం. గాంధీజీ రాసిన పుస్తకాలు చదివితే ఆయన గురించి మనకు వచ్చే అవగాహన First hand direct understanding అవుతుంది. కానీ ఇపుడు పుస్తకాలు జ్ఞాన మార్గాలుగా లేవు. యూట్యూబ్ వాట్సప్‌లు జ్ఞాన మార్గాలయ్యాయి. కాబట్టి అందులో వచ్చిన ప్రతీది నిజమనుకునే ఒక తరం మొదలైంది. ప్రత్యక్షమైన అనుభూతి లేని first hand direct undrstanding లేని తరం. గాంధీజీ గురించి తెలుసుకోవాలంటే గాంధీజీ బుక్స్ చదవాలి అని కాక వాట్సప్‌లో వచ్చే విషయాలు చదవాలి అనుకోవడం.. లేదా యూట్యూబ్‌లో ఎవరో చెబితే వినాలి అనుకోవడం స్వీయ మరుగుజ్జుతనాన్ని తెలివిగా కప్పేసే చర్యగా భావించాలి. అధ్యయనం నశించిన ఒక భయంకరమైన బ్లా బ్లా తరమొకటి తయారు కాబోతున్నది.

ఇలాగే వాట్సప్‌లో వచ్చిన ఏదో రాత చదివి గాంధీని తెగ తిట్టేసిన ఇంకో మిత్రుడు.. ఒకప్పుడు మా ఇంట్లో గాంధీ ఫోటోలుండేవి.. అన్ని చింపేసి కాల్చేశానని ఊగిపోతూ సంబరపడ్డాడు. 'బాబూ నోట్ల మీద కూడా గాంధీజీ బొమ్మనే ఉంటుంది. పొరపాటున కాల్చేసేవు. నీ ఆవేశం పాడుగాను' అని తిట్టి పంపాను.

గాంధీజీ దాదాపు 45 పుస్తకాలు రాశారు. రాజకీయాల్లో తలమునకలై ఉంటూ కూడా 45 పుస్తకాలు రాయడమంటే ఆయన స్పిరిట్ ఏమిటో అర్థం చేసుకోవాలి. అలా పుస్తకాలు రాసిన రాజకీయ నాయకుడు మరొకరు కనబడరు. నెహ్రూ కూడా పుస్తకాలు రాశారు. ఒకరకంగా చెప్పాలంటే రామచంద్ర గుహ వంటి వారు గాంధీజీని నెహ్రూని ఆధునిక భారత నిర్మాతలుగా పేర్కొనడానికి కారణం వారి పుస్తకాలే. పుస్తకాలు రాయగలగడమే వారిని ఇతరులకంటే విశిష్టంగా నిలబెట్టింది. ప్రస్తుతం పుస్తకాలు రాయగలిగిన రాజకీయ నాయకులు లేరు. విస్తృతంగా చదవగలిగిన గుణాలు లేవు. ఫొటో షూట్లకే సెల్ఫ్ ప్రమోషన్లకే సమయం దొరకని వారు ఒక గాంధీజీలాగా పదుల సంఖ్యలో పుస్తకాలు రాయగలరా?. మీడియా ను సోషల్ మీడియాను manipulate చేసి ఎలక్షన్లు గెలవాలని తాపత్రయ పడే మన ప్రస్తుత నాయకుల నుండి గాంధీజీ వంటి మహాత్ముడిని ఊహించగలమా?. ఒట్టి మొద్దు శుంఠల్లాగా ఉంటారు కదూ..! ఊహించలేమని కవి భావం. ❑

# భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు



అనువాదం : వల్లభనేని గీత

- ప్రొ ॥ వినయ్‌లాల్

**హిందూత్వ ఐకాన్ అయిన వి.డి.సావర్కర్ మహాత్మా గాంధీ సలహా మేరకే బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష కోరుతూ లేఖలు రాశారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను లాస్‌ఏంజెల్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో చరిత్ర మరియు ఆసియన్ అమెరికన్ స్టడీస్ ప్రొఫెసర్ అయిన డా ॥ వినయ్‌లాల్ తిరస్కరించారు. ఫ్రంట్ లైన్ కోసం కేరళకు చెందిన జర్నలిస్ట్ అభిషేక్.కె.బోస్‌కు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అసంబద్ధ వ్యాఖ్యలను ఖండించారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను పాఠకులకు అందిస్తున్నాం.**



**అభిషేక్ కె బోస్ : హిందూత్వ ఐకాన్ అయిన వి.డి.సావర్కర్ మహాత్మాగాంధీ సలహా మీదనే బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష కోరుతూ ఉత్తరం వ్రాశారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు ? మీ అభిప్రాయం ఏమిటి ? స్వాతంత్ర పోరాటంలో వీడీ సావర్కర్, ఇతర హిందూత్వవాద నాయకులు ఎటువంటి పాత్ర పోషించారని మీరు భావిస్తున్నారు ?**

- **డా ॥ వినయ్‌లాల్ :** రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడింది తప్పని నేను ఖచ్చితంగా, నిస్సందేహంగా చెబుతున్నాను. సావర్కర్‌ను క్షమాభిక్ష కోరుతూ లేఖ రాయమని మహాత్మాగాంధీ చెప్పినట్లు చిన్న ఆధారం కూడా లేదు. ఈ వాదన పూర్తిగా కల్పితమే. రక్షణమంత్రి ఈ వాదనకు తెరలేపకమునుపే సావర్కర్ బ్రిటిష్ ప్రభుత్వానికి రాసిన అనేక లేఖలపై, క్షమాభిక్ష వినతులపై గణనీయమైన పరిశోధన జరిగింది.

ఉదాహరణకు ఎ.జి. నూరాని వ్రాసిన సావర్కర్ అండ్ హిందూత్వ : ది గాడ్సే కనెక్షన్ (లెఫ్ట్ వర్డ్ బుక్స్, 2002) అనే పుస్తకం ప్రచురితమైంది. ఆ పుస్తకంలోని అనుబంధాలను గనుక పరిశీలిస్తే ఆ లేఖలలోని కొన్ని అంశాలను ఎలా మార్చారో అర్థమవుతుంది. సావర్కర్ 1911లో దాఖలు చేసిన లేఖలోని అంశాలు అందుబాటులో లేవు. కానీ 1913 లోను, ఆ తరువాత పంపిన లేఖలు చదువుతున్నప్పుడు ఆవేదన కలుగుతుంది. ఆ లేఖలలో సావర్కర్ 'బ్రిటిష్ ప్రభుత్వ బహుముఖ ప్రయోజనం కోసం నన్ను విడుదల చేసినట్లయితే నేను బ్రిటిష్ రాజ్య అభివృద్ధికి బలమైన చేదోడుగా, విశ్వసనీయుడుగా ఉంటాను'. తనను విడుదల చేయడం బ్రిటీషు ప్రభుత్వానికే ప్రయోజనమని సూచనచేస్తూ 'బ్రిటీష్ ప్రభుత్వానికి అనుగుణంగా నా పరివర్తన ఉంటుంది. తప్పుదారి పట్టి నన్ను అనుసరించే ఎంతో మంది దేశ యువతను తిరిగి బ్రిటీషు విధేయులుగా మార్చడానికి ఉపకరిస్తుంది. ప్రభుత్వం ఎలా కోరుకుంటే అలా సేవ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను'. అని సావర్కర్ ఆ లేఖలలో రాశాడు. సావర్కర్ తన లేఖ ముగింపులో ఇంకా దయనీయమైన పదాలు ఉపయోగించారు. 'బలాఢ్యులు మాత్రమే దయ కలిగి ఉంటారు. తప్పిపోయిన పిల్లలు తిరిగి తల్లిదండ్రుల వంటి ప్రభుత్వం వద్దకు కాక ఇంకెక్కడికి వెళ్ళగలరు?' బ్రిటిష్ ప్రభుత్వం ఏది చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నన్ను జైలు నుండి విడుదల చేయండి అని సావర్కర్ చెప్పడమే దీని సారాంశం. 'తల్లి-తండ్రి' వంటి బ్రిటిష్ ప్రభుత్వం తన బిడ్డను గుండెలపైకి చేర్చుకోవాలని సావర్కర్ అడుగుతున్నాడు.

గాంధీజీ ఎన్నోసార్లు జైలుకు వెళ్ళారు. ఆయన ఎప్పుడైనా తనను విడుదల చేయమని గాని, క్షమాభిక్ష కోరుతూ గాని విజ్ఞాపన చేశారా ? నిజానికి 1922లో దేశద్రోహ నేరంపై భారత శిక్షాస్మృతి సెక్షన్ 124 క్రింద విచారణ జరుగుతున్న సమయంలో న్యాయమూర్తి గనుక తాను నేరం చేసినట్లు విశ్వసిస్తే చట్ట ప్రకారం ఎంత కఠినమైన శిక్ష వేయగలిగితే అంత వేయమని ఆనాటి బ్రిటి ప్రభుత్వానికి చుక్కలు చూపించారు. కానీ గాంధీజీని ఇష్టపడని భగత్ సింగ్, రాజ గురు సుఖ్‌దేవ్ వంటి వారిని తీసుకుందాం. వారు ఉరిశిక్ష పడ్డాక కూడా క్షమాభిక్ష కోరలేదు. సరికదా, భగత్‌సింగ్ తండ్రి 'నువ్వు చిన్న వాడివి. నీకు ఎంతో భవిష్యత్తు ఉంది. బ్రిటీష్ అధికారులను క్షమించమని కోరుతూ ఉత్తరం వ్రాయమంటే అటు వంటి సలహా ఇచ్చినందుకు ఆయన తన తండ్రిపై మండిపడ్డారు. కానీ సావర్కర్ అందుకు పూర్తి భిన్నంగా జైలుకు అనుభవించినందుకే పదే పదే క్షమాభిక్ష అర్జీల రాస్తూనే ఉన్నాడు. క్షమాభిక్ష ఉత్తరం వ్రాస్తే వారు క్షమిస్తారని గాంధీజీ సావర్కర్‌కు సలహా ఇచ్చారనే వాదనను తీసుకుందాం. 1920 జనవరి 18న సావర్కర్ సోదరుడు తన అన్నతోపాటు ఉన్న సమ ఖైదీలకు బ్రిటిషు అధికారులు క్షమాభిక్ష పెట్టారని, కానీ ఆయనను మాత్రం విడుదల చేయలేదని, ఈ విషయంగా మీరేమైనా సాయం చేయగలరా ? అని గాంధీజీని అడుగుతూ ఉత్తరం రాశాడు. లాహోర్ జైలులో వున్న గాంధీజీ జనవరి 25న (ఈ అంశం భారత ప్రభుత్వం ప్రచురించిన కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మా గాంధీలోని 19వ వాల్యూమ్ ఉన్నది). నీ ఉత్తరం అందింది. నీకు సలహా ఇవ్వడం చాలా కష్టం" అని సమాధానం వ్రాశారు. మన గౌరవ రక్షణ శాఖమంత్రి గారికి గాంధీజీ సావర్కరు క్షమాభిక్ష రాయమన్నారన్న విషయం ఎలా తోచింది? ఆ ఉత్తరంలో ఏమైనా పేర్కొన్నారా? లేదు. ఇంకా ఆ ఉత్తరంలో 'మీ సోదరుడు పాల్పడిన నేరం పూర్తిగా రాజకీయ సంబంధమైనదని పేర్కొంటూ నేర తీవ్రతను తగ్గించేలా సంక్షిప్తంగా ఒక పిటిషన్ వ్రాయండి. ప్రజల దృష్టిని కేంద్రీకరించేందుకు ఉపయోగపడుతుందని ఈ సలహా ఇస్తున్నాను.' వైరుధ్యాలు ఉన్నప్పటికీ రాజకీయ ఖైదీలకు, సాధారణ నేరాలు చేసి జైలు శిక్ష అనుభవిస్తున్నవారికి వ్యత్యాసం ఉందని గాంధీ అర్థం చేసుకున్నారన్నది ముఖ్యం. గాంధీజీ సావర్కర్‌ను రాజకీయ ఖైదీగా పరిగణించారు. 19లో గాంధీజీ యంగ్ ఇండియా జర్నల్‌లో ఒక ఆర్టికల్ రాశారు. కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మా గాంధీలోని వాల్యూమ్ 20లో కూడా 'సావర్కర్ సోదరులు' అన్న శీర్షికన ఈ ప్రస్తావన ఉంది. సావర్కర్ సోదరులు ఇతర రాజకీయ ఖైదీలలాగే క్షమాభిక్షకు అర్హులని గాంధీజీ స్పష్టత కలిగి ఉన్నారని ఆ వ్యాసంలో విశ్లేషించారు.

**గాంధీజీ మరణించినపుడు ఆయనను నెహ్రూతోను, జిన్నాతోను ఎవరూ పోల్చ లేదు. జీసస్ క్రైస్ట్, బుద్ధుడు వంటి మానవతా మూర్తులతో పోల్చారు. గాంధీజీ ప్రపంచంలో ఎప్పటికీ ఒక చారిత్రాత్మక వ్యక్తిగానే నిలిచిపోతారు. దీన్నే బోర్జ్వా సాంస్కృతిక మూలాలుగా చెబుతారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ గాంధీ పేరును వాడుకుని తమ హిందూ జాతీయవాద భావనకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది అభ్యంతరకరమే కాదు పూర్తిగా తిరస్కరించా ల్సిన అంశం. దీన్ని మనం వ్యతిరేకించకపోతే ఇంకో అబద్ధాన్ని ప్రచారంలోకి తీసుకువస్తారు.**

కానీ గాంధీ ఆ సోదరుల గురించి తాను ఏ అభిప్రాయం కలిగి ఉన్నారనేది ఈ వ్యాసంలో స్పష్టంగా వ్రాశారు. 'ఆ ఇద్దరు సోదరులు తమను విడుదల చేసినందుకు ప్రతిగా ఇక ఏ విధమైన విప్లవ ఆలోచనలను చేయబోమని తమ రాజకీయ విధానాన్ని స్పష్టం చేశారు. బ్రిటిషు సంస్కరణల చట్టం భారతదేశానికి రాజకీయ హక్కులను సాధించడానికి, దాని పరిధిలో పనిచేయడానికి వీలు కల్పిస్తాయని భావించి, దానికి లోబడి ఉండేందుకు అంగీకరించారు. బ్రిటిషు పాలన నుండి దేశానికి స్వాతంత్ర్యాన్ని కోరమని, బ్రిటిషు పాలనకు అనుబంధంగా ఉంటేనే భారతదేశ భవిష్యత్తు బాగుంటుందని వారిరువురూ నిస్సందేహంగా పేర్కొన్నారు.

సావర్కర్ జైలు నుండి విడుదల కావడం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని కూడా లక్ష్యపెట్టలేదని ఇంతకన్నా స్పష్టంగా ఇంకెక్కడ దొరుకుతుంది? ఒకవేళ అతను స్వాతంత్ర్యం కోసం ఏమైనా చేసి ఉన్నా అది చాలా స్వల్పం. ఇండియా, పాకిస్థాన్ విభజనకు మహమ్మద్ ఆలీ జిన్నా బాధ్యుడనే భారతీయుల ధోరణి గురించి డా॥బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన విషయాలను గుర్తు చేయాలనుకుంటున్నాను. దేశ విభజనను ముందుగా ప్రతిపాదించింది జిన్నా కాదు. సావర్కర్. జిన్నాకు సావర్కర్‌కు వున్న సారూప్యత ఎప్పుడూ బయట పడలేదు. కానీ, దేశ విభజన వ్యూహకర్త జిన్నా కాదు, సావర్కరేనని అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు. అంబేద్కర్ తన థాట్స్ ఆఫ్ పాకిస్తాన్ (1940) పుస్తకంలో 'జిన్నా, సావర్కర్ ఒక దేశం, రెండు జాతుల అంశంపై వాదించుకున్నట్లు పైకి కనబడినా దేశ విభజనకు అంగీకరించారు. వారి అభిప్రాయం ప్రకారం ఇండియాలో రెండు జాతులు ఉన్నాయి. అవి ఒకటి ముస్లిం, ఇంకొకటి హిందూ అని పూర్తిగా విశ్వసించారు. విశ్వసించమేకాదు. దాని కోసం పట్టుబట్టారు' అని రాశారు.

## గాంధీ, సాంస్కృతిక రాజధాని

**అభిషేక్ కె బోస్ :ఆర్ఎస్ఎస్ మరియు దాని అనుబంధ సంస్థలు గాంధీజీ వారసత్వాన్ని చేజిక్కించుకోవడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు ? సంఘ్ పరివార్‌లో అంతటి స్థాయి వున్న వ్యక్తి లేరనా ? దీనిపై మీ అభిప్రాయం ఏమిటి ?**

• **డా ॥ వినయ్‌లాల్ :** మీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి వ్యక్తిగా గాని, సంస్థగా గాని ఏమైనా చేశామని చెప్పాలంటే వారు ఖచ్చితంగా గాంధీ జీ వారసులమని చెప్పుకోవడం అత్యవసరం. ఇతర వ్యక్తులకు వున్న పరిమితులు గాంధీజీకి కూడా ఉన్నాయి. సాంస్కృతిక మూలాల అంశంపై ఫ్రెంచి సిద్ధాంతవేత్త పియెర్ బోర్ద్యూ చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తే గాంధీ అంటే ఏమిటో మనకు అర్థమవుతుంది. గాంధీ పేరు ప్రపంచవ్యాప్తంగా ఒక సాంస్కృతిక మూలాలతో ముడిపడి వుంది. 1950, 1960లలో అమెరికాకు వలస వచ్చిన భారతీయులతో నేను మాట్లాడాను. (1924 వలసల చట్టం మరియు ఆసియన్ బహిష్కరణ చట్టం ప్రకారం 1923 -45 మధ్య భారతీయులు యు.ఎస్.కు రావడానికి అనుమతి లేదు). వారికి అమెరికాలో తెలిసిన వారు ఎవరూ లేరు. కానీ మేము గాంధీ గారి దేశం నుండి వచ్చామని వారు చెప్పగానే అక్కడి వారు వారిని హృదయ పూర్వకంగా ఆహ్వానించారు. పౌరహక్కుల కోసం జరిగిన పోరాటానికి ముందే గాంధీ యు.ఎస్.లో సుపరిచితుడు. గాంధీజీ మరణించినపుడు ఆయనను నెహ్రూతోను, జిన్నాను ఎవరూ పోల్చలేదు. జీసస్ క్రైస్ట్, బుద్ధుడు వంటి మానవతా మూర్తులతో పోల్చారు. గాంధీజీ ప్రపంచంలో ఎప్పటికీ ఒక చారిత్రాత్మక వ్యక్తిగానే నిలిచిపోతారు. దీన్నే బోర్ద్యూ సాంస్కృతిక మూలాలుగా చెబుతారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ గాంధీ పేరును వాడుకుని తమ హిందూ జాతీయవాద భావనకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది అభ్యంతరకరమే కాదు పూర్తిగా తిరస్కరించాల్సిన అంశం. దీన్ని మనం వ్యతిరేకించకపోతే ఇంకో అబద్ధాన్ని ప్రచారంలోకి తీసుకువస్తారు.

**మానవత్వాన్ని ప్రతిబింబించే చరిత్రను మాత్రమే అధ్యయనం చేస్తే మనం ఆలోచనాత్మకంగా, మానవతావాదులుగా మారము. సమాజంలో కొన్ని హానికరమైన వ్యాఖ్యలు ఎలాంటి పాత్ర పోషించాయో అధ్యయనం చేయాలి. సావర్కర్, గోల్వాల్కర్లు తత్వవేత్తలుగా అతిసాధారణమైన వారు అయినప్పటికీ సావర్కర్ కొన్ని అంశాలలో ప్రశంసించదగినవాడు. ఇది మనం ఒప్పుకోవాలి. ఉదాహరణకు అతను మరాఠీలో గొప్ప కవి. తన 10వ ఏట నుండే రచనలు చేశాడు. అందులోను 1857-58 నాటి విప్లవంపై విమర్శనాత్మక పుస్తకం రాశాడు. అది చాలా ఆసక్తికరమైన పుస్తకం.**

## హిందూత్వ చరిత్ర విశ్లేషణ

**అభిషేక్ కె బోస్ : దేశవ్యాప్తంగా పలు కాలేజీలలో ఆర్ఎస్ఎస్, ఆ సంస్థ నాయకుల చరిత్రను బోధించాలని వివాదాలు జరుగుతున్నాయి. కేరళలోని కన్నూరు యూనివర్సిటీ కర్క్యులమ్ సావర్కర్, ఎం.ఎస్. గోల్వాల్కర్, దీన్ దయాళ్ ఉపాధ్యాయవంటి ఆర్ఎస్ఎస్ నాయకుల రచనలు చేర్చారు ? హిందూత్వవాదులు సిద్ధాంతాలు బోధించాల్సిన అవసరం ఉందని మీరు భావిస్తున్నారా ?**

• **డా ॥ వినయ్‌లాల్ :** ఈ అంశాన్ని మనం చాలా సూక్ష్మంగా పరిశీలన చేయాల్సిన అవసరం వుంది. పారిశ్రామిక విప్లవ కాలం నుండి నేటి వరకు ఉన్న సమకాలీన ప్రపంచ చరిత్రను నేను 18-21 ఏళ్ళ విద్యార్థులకు బోధిస్తాను. 1990 సంవత్సరాల నాటి కాలం నాజీ జర్మనీ, హిట్లర్ నాటి కాలం. హిట్లర్ మీనా కాంఫ్ అనే ఒక గ్రంథాన్ని వ్రాశాడు. అది సాధారణమైనది. దాన్ని చదివిన మేధావులు ఎవరూ హిట్లర్ ఆలోచనల వల్ల ప్రభావితులవరు. అంతమాత్రాన దేశాన్ని దోచుకున్న వ్యక్తి ఎటువంటి రాజకీయ మేధస్సు కలిగి లేదని చెప్పలేము. నేను నా విద్యార్థులను మీన్ కాంఫ్‌లో పది పేజీ లు చదవమని చెబుతాను. హిట్లర్ గురించి చదవమంటే నేను యూదు మతానికి వ్యతిరేకంగా ప్రచారం చేసినట్లా? ఎంత మాత్రమూ కాదు. పెదధోరణులు ప్రమాదకం అయినప్పటికీ వాటిని అర్థం చేసుకోవడం సంక్లిష్ట బోధనా విధానంలో భాగం. మానవత్వాన్ని ప్రతిబింబించే చరిత్రను మాత్రమే అధ్యయనం చేస్తే మనం ఆలోచనాత్మకంగా, మానవతావాదులుగా మారము. సమాజంలో కొన్ని హానికరమైన వ్యాఖ్యలు ఎలాంటి పాత్ర పోషించాయో అధ్యయనం చేయాలి. తెలుసుకోవాలి. సావర్కర్, గోల్వాల్కర్లు తత్వవేత్తలుగా అతిసాధారణమైన వారు అయినప్పటికీ సావర్కర్ కొన్ని అంశాలలో ప్రశంసించదగినవాడు. ఇది మనం ఒప్పుకోవాలి. ఉదాహరణకు అతను మరాఠీలో గొప్ప కవి. తన 10వ ఏట నుండే రచనలు చేశాడు. అందులోను 1857-58 నాటి విప్లవంపై విమర్శనాత్మక పుస్తకం రాశాడు. అది చాలా ఆసక్తికరమైన పుస్తకం. అంతేకాదు, హిందూత్వ భావనకు జన్మనిచ్చింది సావర్కర్ కాదు. బెంగాలీ నుండి క్రైస్తవుడిగా మారిన బ్రహ్మ బంధ ఉపాధ్యాయ్ అనే వేద పండితుడు. ఆయనే హిందూత్వపై మొదటగా రచనలు చేశాడు. అది వేరే కథ. సావర్కర్ చెప్పే పుణ్యభూమి వాదన

గురించి అర్థం చేసుకోవాలంటే ఆ పుస్తకంలో కొంత భాగం చదవాలి. ఇతరులకు తప్పు అనిపించే వాదనలు కూడా మనం అధ్యయనం చేయకపోతే విద్యార్థులకు సరైన బోధన చేయలేము.

గోల్వాల్కర్, సావర్కర్లను గొప్ప తత్వవేత్తలుగా భావించకపోయి నప్పటికీ హిందూత్వ భావజాలం ఎటువంటి హానికరమైన పరిణామాలకు దారితీస్తుందో విద్యార్థుల ఊహకు అందాలంటే వారి రచనల్లోని కొన్ని అంశాలను బోధించాల్సి ఉంటుంది. గోల్వాల్కర్ విషయంలో ఇది మరింత స్పష్టం. అతను రాసిన బంచ్ ఆఫ్ థాట్స్ గాని, ఉయ్ అండ్ ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్ గాని చూస్తే అతను నాజీ సిద్ధాం తానికి చాలా రుణపడ్డాడు అని అర్ధమవుతుంది. నాజీలను ఆరాధించే గోల్వాల్కర్ నాజీలాగానే మాట్లాడుతాడు. జర్మనీలో నాజీలు యూదు మతస్థులను హింసించిన విధానాన్ని భారతదేశం కూడా ఆదర్శంగా తీసుకోవాలని చెబుతాడు. జర్మనీలో యూదులు ఎలాంటి కష్టాలను అనుభవించారో మన దేశంలోని కొంతమంది ప్రజలు కూడా అటువంటి కష్టాలు అనుభవించాలని చెప్పింది ఎవరో నేను ప్రత్యేకించి వివరించనక్కరలేదు. ఇది గుర్తుంచుకోవాల్సిన ప్రధాన అంశం. దీనదయాళ్ ఉపాధ్యాయ్ పేరు ప్రచారం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం చాలా కృషి చేస్తున్నది. 2015కు ముందు అతని గౌరవార్థం ఒక స్టాంపు కూడా ముద్రించింది. 2015 నుండి 2017 వరకు సంవత్సరానికి ఒక స్టాంపు విడుదల చేసింది. దీనదయాళ్ చెప్పిన సమగ్ర మానవతావాదంలో వున్న ప్రధానమైన అంశం ఏమిటి? జయప్రకాష్ నారాయణ్ చెప్పే వాదన ఇదే. జేపీ కొంత మెరుగుగా ఆలోచించగలిగిన వాడే అయినా అతనివి దీనదయాళ్ విధానాలకు భిన్నమైనవేమీ కాదు. అయితే పచ్చి హిందూత్వ పక్షపాతంతో కలుషితమైపోయిన ఆలోచనలు దీనదయాల్‌లో స్పష్టంగా కనబడుతాయి.

## చరిత్రను పున:లిఖించడం

**అభిషేక్ కె బోస్ : నేడు చరిత్రను మార్చి వ్రాసే ప్రయత్నాలను అడ్డుకునేవారు అంతగా కనబడడం లేదు. చాలా మంది చరిత్రకారులు ఈ పనిలో సంఘ్పరివార్చేతులు కలుపుతున్నారు. హరప్పా నాగరికత పేరును సరస్వతి నాగరికతగా మార్చడానికి ప్రయత్నించడం దీనికి తార్కాణం. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సిలబస్‌లో మార్పులు చేయడానికి 90వ దశకంలో చేసిన ప్రయత్నాలను చూశాం. ఎందుకని మన దేశంలో ఈ ప్రయత్నాలను అడ్డుకునే వారు లేరు ?**

• **డా ॥ వినయ్‌లాల్ :** ఈ ప్రశ్నకు విశాల దృక్పథంతో సమాధానం వెతకాలి. చరిత్రను మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి ఆశ్చర్యపోనక్కరలేదు. దురదృష్టవశాత్తు ఇది మన దేశంలో మాత్రమే కాక, అధికారంలో వున్న వారి ప్రత్యేకహక్కుగా ప్రపంచమంతటా వ్యవహరిస్తున్నారు. ఈ అంశం గురించి నేను చాలా ఏళ్ల నుండి రాస్తున్నాను. 2003లో రాజకీయాలు, చరిత్ర రచనపై 'ది హిస్టరీ ఆఫ్ హిస్టరీ పాలిటిక్స్ అండ్ స్కాలర్షిప్ ఇన్ మోడరన్ ఇండియా' (ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2003) అనే పుస్తకం రాశాను. అధికారం సంపాదించి వారు చరిత్రను మార్చి రాయడం వారి ప్రత్యేక హక్కుగా భావిస్తున్నారు. ప్రతి దేశంలోను చరిత్ర పుస్తకాలలోని అంశాలపై విభిన్న వాదనలు ఉంటాయి. ఇండియాలో మనం వీటిపట్ల ఎలా ఆలోచిస్తున్నాం అనేదే సమస్య.

భారతీయ జర్నలిజంలో సంకుచితత్వం ఉన్నది. మన జర్నలిస్టులు ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఏమి జరుగుతుందో గమనించాలనుకోరు. జపాన్‌లో ఆ దేశపు చరిత్ర పాఠ్య పుస్తకాలపై అనేక చర్చలు జరుగుతున్నాయి. ఎందుకు ? రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ పోషించిన పాత్ర, జపాన్ ఏం చేసి ఉండాలి? రెండో ప్రపంచ యుద్ధంలో తాను పాల్పడిన అకృత్యాలకు జర్మనీ క్షమాపణలు చెప్పినట్లు జపాన్ కూడా క్షమాపణలు చెప్పాలా ? తదితరాలపై చర్చలు జరుగుతుంటాయి. క్షమాభిక్షల రాజకీయాల గురించి నేను మాట్లాడబోవడం లేదు. చరిత్ర పాఠ్య పుస్తకాలలో అంశాలు, అధికారంలో వున్న వారు చరిత్రను మార్చడానికి ప్రయత్నిస్తున్నారన్న వాస్తవం గురించిన ఈ వాదనలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న వారు ఇంతే చేస్తారు అనుకుంటూ ఏం జరిగినా చేతులు ముడుచుకుని కూర్చోమని దీనర్థం కాదు. చారిత్రక ఆధారాల ద్వారా, తార్కిక శక్తుల ద్వారా లేదా సహేతుకమైన నిర్ధారణల ద్వారా పాఠ్య పుస్తకాలు రాయబడుతున్నాయా ? అన్న దానిని పూర్తిగా పరిశీలించాలి. మనం వాటిని సీరియస్‌గా తీసుకోవాలి.

సరస్వతి నాగరికత గురించిన వాదన ఏమిటి ? హిందూత్వ దళం ఎందుకు ఈ వాదన పట్టుకు వేలాడుతోంది ? వారు చెబుతున్న కారణాలలో ఒకటి ఆర్యులు విదేశీయులు అన్న అభిప్రాయాన్ని చెరిపేయడం. ఆర్యులు ఇండియాకు వలస వచ్చారని చెబుతున్న దానికి ఆధారాలు లేవని వారు చెబుతున్నారు. ముస్లింలే ఈ దేశంలో విదేశీయులు అని వారి వాదన. అసలు ముస్లింలను విదేశీయులని అనడంలో వారి ఉద్దేశ్యం ఏమిటి? ఎంతకాలం నుండి ముస్లింలు భారతదేశంలో ఉన్నారు? వెయ్యి సంవత్సరాల నుండా? ఏ కోణంలో వారు విదేశీయులవుతారు అని నేను వారిని ప్రశ్నిస్తున్నాను. ఆర్యులు విదేశీయులని ఎవరైనా చెప్పారంటే అది చాలా పెద్ద సమస్య అవుతుంది. చర్చ మొత్తం దీనిపైనే

అని నేను చెప్పట్లేదు. ఇది వారి స్వాభావిక ఎత్తుగడ అని చెబుతున్నాను. ఇదే స్థానమార్పిడి చర్చ – ఒక అంశం గురించి వాదన చేస్తున్నట్లు ఉంటుంది. కానీ అది వేరే అంశానికి సంబంధించి ఉంటుంది.

**అభిషేక్ కె బోస్ : ప్రతిపక్షం దాన్ని ఎదుర్కోవడానికి ఏమీ చేయడం లేదని మీరు ఎందుకు అనుకుంటున్నారు ? దేశంలోని మేధావి వర్గాలు ఎందుకని మౌనం వహిస్తున్నాయి ?**

● **డా ॥ వినయ్‌లాల్ :** దేశంలోని మేధావి వర్గాలు మౌనంగా ఉన్నాయని నేను భావించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం భిన్నాభిప్రాయాలను సహించలేక అణగదొక్కాలని చూస్తున్నది. దేశంలోని యూనివర్సిటీలలో ఏం జరుగుతుందో చూడండి. జేఎన్ యూనివర్సిటీలో ఏం జరిగిందో చూడండి. హిందూత్వ వాదులు జేఎన్ కమ్యూనిస్టుల కంచుకోట అని చెబుతారు. ఇది అసంబద్ధమైన వాదన. కొంత మంది వామపక్ష భావ జాలం కలిగిన చరిత్రకారులు, సామాజికవేత్తలు ఉన్న మాట వాస్తవమే. కాని వారు ఇతర యూనివర్సిటీలైనా అదే పనిచే స్తారు. కానీ జేఎన్‌యూలో ఏం జరుగుతుంది? కేరళలోని కన్నూర్లో క్రితం నెల జరిగిన వివాదం గురించి ప్రస్తావిం చారు. ఇటీవలే జేఎన్‌యూ ఐచ్ఛిక పాఠంగా ఉగ్రవాదం మరియు ఉగ్రవాద వ్యతిరేక వ్యూహాలు అనే కోర్సును ప్రవేశపెట్టింది. మీరు ఉగ్రవాదం గురించి, దాన్ని తిప్పికొట్టే వ్యూహాల గురించి అధ్యయనం చేయాలనుకుంటే ఇస్లామిస్టు జిహాద్ గురించి అధ్యయనం చేయాలని చెబుతోంది. అంటే దానర్ధం ఇస్లాం జిహాద్ మాత్రమే ఉగ్రవాదానికి పర్యాయపదంగా చెప్పదలచుకున్నారు. దీన్ని ఎవరు ధృవీకరించారు ? అకడమిక్ కౌన్సిల్, వైస్ ఛాన్సలర్ దీనిని ఆమోదించారు. ఇది పూర్తిగా సందేహాస్పదమైన కోర్సు. దురదృష్టవశాత్తూ భారత విశ్వ విద్యాలయాలు ప్రపంచం దృష్టిలో హాస్యాస్పదంగా మారిపోయాయి. భిన్నాభిప్రాయాలు చెప్పేవారు. పక్కకు నెట్టివేయబడుతున్నారు. వారి నోరు నొక్కేస్తున్నారు. నేడు వైర్, స్క్రోల్ వంటి వెబ్ పోర్టల్స్ ఉన్నాయి గానీ కేవలం నాయక బృందానికి ప్రబోధనలు చేసినట్లుగా ఆంగ్ల శ్రోతలతోనే మాట్లాడుతారు. కానీ, వైర్ కొన్నేళ్ల క్రితమే విషయాలను అర్ధమయేలా చేయటం కోసం హిందీలో కూడా వీడియోలు అందించడం కోసం ప్రశంసనీయ కృషి చేస్తున్నది. మీరు పాఠ్యాంశాల్లో తెస్తున్న అసంబద్ధ మార్పులను వ్యతిరేకించే వారు లేరంటే మాత్రం అది వాస్తవం కాదు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారికి ఎదురవుతున్న సమస్యలు చిక్కుగా ఉన్నాయి. ట్రోల్స్ అనేవి యు.ఎస్.లో కూడా ఉన్నాయి. కానీ నాకు తెలిసినంతవరకు భారత్‌లో నడుస్తున్న ట్రోల్స్ మాత్రం పూర్తిగా దుర్మార్గమైనవి. రాయనలవి కానివి. వారికి ఉన్నతమైన చదువులు లేకపోయినా సోషల్ మీడియా శక్తిని చేసుకున్నారు. ఇటువంటి సోషల్ మీడియా తో ఉన్న ప్రమాదమేమంటే అది కేవలం ప్రజాస్వామికీకరణకు మాత్రమే కాకుండా నిరంకుశత్వానికి కూడా దారి తీస్తుంది.

**అభిషేక్ కె బోస్ : భారత ప్రభుత్వం దేశంలోని విద్యా సంస్థలన్నింటిలో ఏకీకృత విద్యాంశాల విధానాన్ని ఏర్పాటు చేసే దిశగా ఉందని రిపోర్టులు ఉన్నాయి. మీ అభిప్రాయం ఏమిటి?**

● **డా ॥ వినయ్‌లాల్ :** దాని గురించి నేను విన్నాను. కానీ దానిపై అభిప్రాయం చెప్పేంత స్పష్టత లేదు. దేశానికి సంబంధించి 10 వేల సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం చరిత్రను మార్చి వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విన్నాను. 10 వేలు కావచ్చు, 15 వేలు కావచ్చు. హరప్పా లేక ఇండస్ లోయ నాగరికత క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల క్రితం నాటిది. ఒకవేళ నిజంగా దేశం మొత్తం ఒకే పాఠ్యాంశాలు ఏర్పాటు చేయాలని అనుకుంటే అది ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. అది స్వేచ్ఛా తర్కానికి ముగింపు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం దేశమంతటా ఏకీకృత పాఠ్యాంశాలను నియంతృత్వంగా రుద్దితే మాత్రం అది ఆలోచనా, స్వేచ్ఛా తర్కానికి చరమ గీతం అవుతుంది. చిన్న గమనిక నేను నా విద్యార్థులకు చరిత్రను బోధించే సమయంలో నేను పాఠ్య పుస్తకాన్ని ఉపయోగించను. పలు ఆర్టికల్స్‌ని ప్రాథమిక సమాచారాన్ని అధ్యయనం చేయమని వారికి చెబుతాను. పాఠ్య పుస్తకం జ్ఞానాన్ని ఏకరూపంలోనే ఉంచుతుంది. కాబట్టి నేను చరిత్రను పాఠ్య పుస్తకాలతో బోధించను. ఏకీకృత పాఠ్యాంశాలు సమస్యలను పదింతలు చేస్తాయి. దాన్ని ఆచరిస్తే గనుక దేశం మరమనుషులను ఉత్పత్తి చేసే కార్ఖానాగా మిగిలిపోతుంది. అదే జరగబోయేది. స్వాతంత్ర్య పోరాటం చేసింది. ఇందుకేనా? అప్పుడు స్వాతంత్ర్యం పొంది. ప్రయోజనం ఏమిటి ? బ్రిటిషు వారికి బానిసలుగా వున్న కాలంలో ఇంతకన్నా ఎక్కువ స్వేచ్ఛనే కలిగి ఉన్నాము.

**అభిషేక్ కె బోస్ : చాలా యూనివర్సిటీలు ఇర్ఫాన్ హబీబ్, ఆర్.ఎస్. శర్మ, రొమిల్లా థాపర్ వంటి ప్రముఖ చరిత్రకారుల పుస్తకాలను ఉద్దేశ్య పూర్వకంగానే పరిశోధన విభాగంలో ఉండకుండా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీరేం అంటారు?**

● **డా ॥ వినయ్‌లాల్ :** యూనివర్సిటీ గ్రంథాలయాల నుండి ఇర్ఫాన్ హబీబ్, ఆర్.ఎస్.శర్మ, రొమిల్లా థాపర్, డి.ఎన్. ఝా ఇంకా ఇతర మేధావుల రచనలు తొలగిస్తున్నారని చెబుతు న్నారా? అందుకే కొందరు నిరంకుశ లేదా అంతకన్నా దుర్మార్గమైన రాజ్యాలతో సారూప్యత సరికాదని అంటున్నారు.

మనం ఇప్పుడు ఆ దిశగానే పయనిస్తున్నాం. పుస్తకాలను ఉండకుండా చేయడం, తగులబెట్టడం వేరు కాదు. క్రిస్టల్నాక్లో ఏం జరిగింది ? యూదుల ప్రార్ధనాలయాలు, దుకాణాలు రాత్రికి రాత్రి అగ్నికి ఆహుతి చేసేశారు. వారికి వ్యతిరేకంగా చరిత్ర పుస్తకాలన్నింటినీ తగులబెట్టి చలిమంటలు వేసుకున్నారు. అది వారి ఉన్మాదానికి పరాకాష్ట. చరిత్రకారుల కృషి ఇక దొరకకుండా చేయడం, లేదా యూనివర్సిటీలు, గ్రంథాలయాల నుండి బయటకు విసిరేయడం-జరుగుతున్న ది ఇదే. అయితే ఇది కేవలం అభ్యంతరకరమైన వాటిని తొలగించడం కాదు. అంతకన్నా పెద్ద సమస్య. పుస్తకాలను తగులబెట్టడం, పాతిపెట్టే సంస్కృతి తిరోగమన మార్గం. ప్రమాదకరమైన మార్గం. విశిష్ట మధ్యయుగ కాలం.

**అభిషేక్ కె బోస్ : కొన్ని యూనివర్సిటీలలో మధ్యయుగం నాటి చరిత్రను బోధించకుండా ఆదేశాలు కూడా జారీ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.**

• **డా ॥ వినయ్‌లాల్ :** అదే గనుక జరిగితే ఇంకో సమస్య తోడైనట్లే. మధ్య యుగాలకాలం. ఏదేమైనప్పటికీ భారతదేశంలో జాతీయోద్యమాన్ని నిర్మించేందుకు ఈ సాంస్కృతిక ఉద్యమం దోహదపడింది. ముస్లిం రాజుల పాలనా కాలం - ముస్లిం రాజుల ఆక్రమణలు, ముస్లిం రాజుల పాలన - అవడంతోనే ఈ సమన్య ఉత్పన్నమైందని మనకు తెలుసు. ఉత్తర భారతంలో ఢిల్లీ సుల్తానులు, దక్షిణ భారతంలో బహమనీ సుల్తానులు, దానితోపాటు మొఘల్ సామ్రాజ్య పాలన. ఈ అంశాలు బోధించకపోతే విద్యార్ధులు ఈ కాలంలో ఏం జరిగిందో తెలుసుకోలేరు. దేశంలోని మార్పులను అర్ధం చేసుకోవడానికి అవస్థపడతారు. ఇది కేవలం దేశ చరిత్రలోని ఒక పెద్ద భాగాన్ని తొలగించడమే కాదు. ఇది మనం చాలా కీలకంగా ఆలోచించాల్సిన సమస్య. ఆర్ఎస్ఎస్, బిజెపి మూక మధ్యయుగ చరిత్ర యూరోపియన్ చీకటి యుగం లేదా మధ్య




గాంధీజీ హత్య కేసు ముద్దాయిలలో సావర్కర్

యుగం వంటిదని యూనివర్సిటీలను, విద్యాసంస్థలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. యూరోపియన్ చరిత్రనే భారత చరిత్రగా చొప్పించేందుకు ప్రయత్నిస్తారు. యూరోపియన్ చీకటి యుగం లేదా మధ్యయుగం గుర్తు ఉండే ఉంటుంది. భారత మధ్యయుగ చరిత్ర మొత్తం చాలా గొప్ప కాలం. ఆ కాలంలోనే భారతీయ భాషలు, సాహిత్యం విలసిల్లాయి. భక్తి ఉద్యమం నడిచింది. 1000-1700 సంవత్సరాల మధ్యలోనే ప్రపంచంలో ఎక్కడాలేనంత భక్తి సాహిత్య భాండాగారంగా భారతదేశం విరాజిల్లింది. ఉత్తర భారతంలో తులసీదాస్, సూర్దాస్, మీరాబాయి, కబీర్, నందా స్లలు, మహారాష్ట్రలో తుకారాం, ఏక్నాథ్, నరసింహ మెహతా వంటి ప్రముఖ వ్యక్తులు, అంతకన్నా ముందు 13వ శతాబ్దంలో జ్ఞానేశ్వర్, దక్షిణ భారతంలో బసవన్న, వీరశైవుల వంటి పద్యకారులు, బెంగాల్లో చైతన్య, చండీదాస్, ఇలా అనేకమంది ఉన్నారు. నాకు ఇప్పటికిప్పుడు గుర్తు వచ్చిన కొన్ని పేర్లను మాత్రమే చెప్పాను. ఇప్పుడు వారు దీన్ని ఒకే విధానంగా మలిచేందుకు, వారికి వీలైన ఆలోచనలు చొప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

యూరోపియన్ చరిత్రలో మధ్య యుగాల చీకటి యుగంగా పిలుస్తున్నారు. ఆ కాలంలో యూరప్ దేశాలు మేధస్సు, సాంస్కృతిక వారసత్వంతో సంబంధాలు కోల్పోయాయి. అరబ్బుల వల్లే అరిస్టాటిల్ వంటి గ్రీకు తత్వవేత్తలు పశ్చిమ దేశాల్లో వెలుగులోకి వచ్చారన్నది మనకందరకు తెలుసు. ఈ అంశంపై వేలకొద్దీ పుస్తకాలు వ్రాయబడ్డాయి. ముస్లిం పరిపాలన సాగిన మధ్యయుగాన్ని చీకటి యుగం అనే పేరుతో వారికి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. విభజన ఆధారంగా చరిత్రను అధ్యయనం చేయాల్సిన అవసరం లేనప్పటికీ దేశ చరిత్రను ప్రాచీన, మధ్య, ఆధునిక భారత చరిత్ర లుగా విభజించి చూసిన ఆలోచన కూడా యూరప్ నుండి తీసుకున్నదే. ఉత్తర భారతదేశంలో ఇండో ఇస్లామిక్ సంస్కృతుల - కలయికతో అభివృద్ధి చెందిన తరహా సంస్కృతి మూరిష్ స్పెయిన్ (8, 15 శతాబ్దాలలో ఉత్తర ఆఫ్రికా, స్పెయిన్లో నివసించిన ముస్లిం తెగ ప్రజలు) లో తప్ప ప్రపంచంలో మరే ఇతర ప్రాంతంలోను కనబడదు. గంగా యమున సంగమం, ఇండో ఇస్లామిక్ సంస్కృతుల కలయిక వంటి ఆలోచనను సహించలేని చరిత్రకారులు కొద్ది మంది ఉన్నప్పటికీ ఈ కలయికపై చర్చలను కొనసాగించడానికి అవకాశం ఉంది. దక్కన్, బహమనీ సామ్రాజ్యాలలో భాగంగా ఉన్న బీజాపూర్ వంటి కాస్మో పాలిటన్ నగరాలను కూడా అధ్యయనం చేయాలి. స్థూలంగా చెప్పాలంటే మధ్యయుగం మొత్తాన్ని మన చరిత్ర పుస్తకాలలోనుండి తొలగించడం వల్ల నేను వివరించిన సమస్యలే కాకుం డా భవిష్యత్తు తరాల మేధస్సు, ఊహాశక్తి పూర్తిగా విఫలమయ్యే ప్రమాదం ఉంది. ❑

# భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నది ఎవరు?



- దేవరాజు మహారాజు

**1950** జనవరి 26వ తేదీన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దీని డ్రాఫ్టింగ్ కమిటీకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఛైర్మన్ గా వ్యవహరించారు. ఇది పూర్తి కావడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. ఇందులో 395 ఆర్టికల్స్ (అధికరణాలు), 22 పార్ట్స్, 12 షెడ్యూళ్ళు ఉన్నాయి. మన రాజ్యాంగం అమలులోకి వచ్చి 72 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, భారతదేశ సామాజిక వ్యవస్థను ఒకసారి నిశితంగా గమనించి నట్లయితే-మనకు కనిపించేది ఏమిటి ? రాజ్యాంగంలో రాసుకున్న దానికి బయట కనబడుతున్న దానికి పోలికే లేదు. పూర్తి భిన్నంగా కనబడుతూ ఉంది. అందుకు కారకులెవరూ? కేవలం పరిపాలకులు.. రాజకీయ నాయకులు మాత్రమే దోషులు కాదు. కొంతలో కొంత సామాన్య ప్రజలు బాధ్యులే.

రాజ్యాంగం అమలులోకి వచ్చే నాటికి భారత దేశంలో అక్షరాస్యత కేవలం 8-10 శాతం మాత్రమే ఉండేది. నిరక్షరాస్యులైన నాటి భారతదేశ పౌరులు రాజ్యాంగం గూర్చి, చట్టాల గూర్చి తెలియక వాటిపై అవగాహన లేక అజ్ఞానంతో, అంధ విశ్వాసాలతో మతాన్ని, కులాల్ని, అంటరానితనాన్ని పాటించేవారు. అసమానత్వమే సరైన విధానమని భావించే వారు. మరి ఈ రోజు 85 అక్షరాస్యతను సాధించిన బారతీయ సమాజం రాజ్యాంగాన్ని చట్టాల్ని దుర్వినియోగ పరుస్తూ ఉంది. విద్యావంతులైన నేటి నాయకులు, ధనవంతులు, పెత్తందార్లూ తమ బాధ్యతల్ని మరిచి రాజ్యాంగంపై గౌరవం లేక విచ్చల విడిగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా ఒక అవినీతి సమాజం, నేరప్రవృత్తి గల సమాజం, లంచగొండి సమాజం ఏర్పడింది. నిస్సహాయులైన సామాన్యపౌరులు ఈ పరిస్థితులను ఎదుర్కోలేక పోతున్నారు. ఉదాహరణకు మతం పేరిట జరుగుతున్న మారణ హోమాలు, కులాల వివక్ష, అత్యాచారాలు, దోపిడీలు, ఆకలి చావులు, భ్రూణహత్యలు, వరకట్న వేధింపులు, గృహహింసలు, ఎన్నో ఎన్నెన్నో - సమాజం భ్రష్టుపట్టి పోవడానికి కారణాలు ఎన్నో - మనసు ఉన్న మనుషులకు, మంచితనం వున్న వారికి, అసహాయులకు ఇది భద్రత కల్పించలేకపోతోంది. అందుకు కారణం రాజ్యాంగ వైఫల్యమని కొందరు చెపితే, పాలకుల తప్పిదం అని మరికొందరు చెపుతున్నారు. కారణం ఏదైనా, జరిగే నష్టం ఏ ఒక్కరికో కాదు. ఇది మొత్తం భారతజాతికి జరుగుతున్న నష్టం. ఈ విషయం ప్రతి భారతీయ పౌరుడు గ్రహించాలి. మతానికీ, ప్రాంతానికీ, కులానికీ, లింగభేదానికీ అతీతంగా ఆలోచించగలగాలి. ప్రతి విషయాన్ని రాజ్యాంగానికి లోబడి ఆచరిస్తూ ఉండాలి!

**భారత రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు కొన్ని సౌలభ్యాలు కలిగించింది. అందులో ముఖ్యమైనవి**

- సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం
- ఆలోచనా స్వేచ్ఛ - భావ ప్రకటనా స్వేచ్ఛ
- స్థాయిలోను, అవకాశాల్లోనూ సమానత్వం
- ప్రజలందరిలో అఖండతా భావాన్ని, దేశీయ సమైక్యతను, వ్యక్తి గౌరవాన్ని నిలుపుకోవడం, పెంపొందించగలగడం.

రాజ్యాంగంలోని పీఠికలోనే ఇంత గొప్ప లక్ష్యాలు నిర్దేశించుకున్నప్పటికీ మరి ఈ దేశాన్ని ఏ చీడ పురుగులు పట్టి పీడిస్తున్నాయి ? స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గూర్చి చెప్పిన వాటిని అమలు కాకుండా అడ్డుకుంటున్న దుర్మార్గులు ఎవరు ? - ప్రతి పౌరుడూ ఆలోచించాలి. జరుగుతున్న సంఘటనల్ని విశ్లేషించుకోవాలి.


**సమానత్వాన్ని సాధించడానికి భారత రాజ్యాంగంలో కొన్ని అధికరణలు ఉన్నాయి.**

- అధికరణం 14 : చట్టం ముందు అందరూ సమానులే.
- అధికరణం 15: కుల,మత, లింగ వివక్షతకు తావులేదు.
- అధికరణం 16: ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికీ సమాన అవకాశాలు
- అధికరణం 17: అంటరానితనం నిషేధం
- అధికరణం 18: బిరుదుల నిషేధం

భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడానికి ఇలా కొన్ని అధికరణలు ఉన్నప్పటికీ మరి ఎందుకు సమానత్వం సాధించలేకపోతున్నాం? అడ్డుపడుతున్నది ఎవరు ? దేశ ప్రజలు జాగరూకులై నిశితంగా గమనిస్తూ ఉండాలి కదా? ఎదుర్కొంటూ ఉండాలి కూడా!

(మిగతా 24వ పేజీలో)

# పౌరస్మృతి - ప్రాథమిక హక్కులు



- అనిశెట్టి శాయికుమార్

భారత ఉపఖండంలోని సామాజిక వ్యవస్థలు భిన్నభాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పాటింపులు, పద్ధతుల సమాహారం. ఇక్కడ మతపరంగానే కాకుండా, భాషా జాతులు, దళిత గిరిజన సముదాయాలు, కుల పరమైన పాటింపుల వంటివి అనేక భిన్నత్వాలతో నిండి ఉన్నాయి. ముఖ్యంగా ఆస్తి పంపకాలు, దత్తత, మహిళా హక్కులు, వివాహ ఆచారాలు, విడాకులవంటి అంశాలలో దక్షిణ ప్రాంతానికీ, ఉత్తరాదికీ గణనీయమైన వైవిధ్యాలున్నాయి. అంతర్గత సమూహాల్లో పాటించే పద్ధతుల్లోను చెప్పుకోదగ్గ తేడాలున్నాయి. వీటన్నిటినీ కలిపి అందరికీ ఒకే చట్టం ఉండాలనీ, తద్వారా మత ఛాదస్తం, ఆధిపత్య ధోరణులు నశించి, మానవ సమానత్వం పరిఢవిల్లుతుందని, ముఖ్యంగా మహిళలకు సమాన హక్కులు లభించి, సమాజం ముందుకు వెళుతుందనీ పురోగామి శక్తులు ఆశించారు. కానీ, దీని అమలు కత్తి మీద సాము వంటిది. అందువల్లనే దీన్ని హక్కుల్లో కాకుండా అధికరణం 44 కింద మార్గదర్శక సూత్రాల్లో చేర్చారు. దీన్ని న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదని కూడా అధికరణం 37లో చెప్పారు. ఇక్కడ ఒక్క ముస్లింలకు మాత్రమే కాదు. మతంతో సంబంధం లేకుండా, వెనుకబడ్డ తరగతులు, వర్గాలు, దళితులు, ఆదివాసీల వంటి వారికి కూడా ప్రత్యేక ఆచారాలు, పద్ధతులూ వాడుకలూ ఉన్నాయి. సిక్కిం, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో మతంతో సంబంధం లేని, వారి ఆచారాల్ని అనుసరించి, భిన్నమైన చట్టాలున్నాయి. సామాజిక పాటింపులన్నీ ఏ సముదాయానికి ఆ సముదాయపు ప్రత్యేక అంశాలుగా సంస్కృతితో మమేకమై ఉంటాయి. బ్రిటీషు పాలకులు కూడా వీటిలో వేలు పెట్టేందుకు జంకారు. బ్రిటీషు పాలకుల కాలంలో, వారి పాలన కింద ఉన్న భారత ఉపఖండం మొత్తానికీ ఒకే నేర న్యాయ సంహితగా క్రోడీకరించింది. అయితే, ఈ న్యాయ చట్టాల క్రోడీకరణ పరిధిలో నుంచి హిందూ, ముస్లిం వ్యక్తిగత చట్టాలను మినహాయించింది. వ్యక్తిగత చట్టాలు మాత్రం ఆయా భిన్న మత, ప్రాంత, సాముదాయక వాడుకలు, ఆచార సాంప్రదాయాల పద్ధతుల ప్రకారం కొనసాగాయి. ఈ వ్యక్తిగత చట్టాల్లో జోక్యం చేసుకుని, మానవ హక్కుల ప్రాతిపదికన సంస్కరణలు తెచ్చే కృషి మాత్రం బాబాసాహెబ్ అంబేద్కర్‌తోనే ప్రారంభమైంది. స్వాతంత్ర్య భారతావని తొలి న్యాయ శాఖ మంత్రిగా కేంద్ర పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా ముఖ్యంగా స్త్రీల హక్కుల కోసం అంబేద్కర్ ప్రతిభావంతంగా కృషి చేశారు. అత్యధిక ఛాందసవాద సభ్యుల వ్యతిరేకతకు నిరసనగా ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ఆ నాడు ఆయన విజయం సాధించకపోయినా, ఆయన ఆలోచనల్లోని ప్రజాస్వామిక సత్తా వలన అనంతర కాలంలో అనేక చట్టాలు రూపొందడానికి తను ప్రతిపాదించిన హిందూ కోడ్ బిల్లు దోహదపడింది. వివాహ వయసు పెంపుదల, బహు భార్యత్వ నిషేధం, హిందూ వివాహ చట్టం, వారసత్వ చట్టం, దత్తత, పోషణ చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, స్త్రీలకు ఆస్తి హక్కు, గృహ హింస నిరోధక చట్టం, తలాక్ రద్దు వంటి అనేక చట్టాలు కాలక్రమేణా రూపొందాయి. ఆడవారికి ఆస్తి హక్కు కల్పిస్తూ కేంద్రం 2005లో చట్టం చేస్తే, ఈ అంశం ఉమ్మడి జాబితాలోది కాబట్టి, అంతకంటే ఎంతో ముందుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ సహా కొన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని తెచ్చాయి. ఇక న్యాయస్థాన తీర్పులు కూడా వ్యక్తిగత చట్టాల్లో ఏకరూపత కోసం దోహదం చేశాయి.

ఇండోర్‌కు చెందిన షాబానో అనే ముస్లిం మహిళ కేసులో, భారతదేశంలో అందరికీ సమానంగా వర్తించే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125 ప్రకారం, ఆమెకు జీవితాంతం భరణం చెల్లించాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ముస్లిం మత చాందసుల దేశవ్యాప్త ఆందోళనల కారణంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, భారతదేశంలో అందరికీ సమానంగా వర్తించే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125 ముస్లిం మహిళలకు వర్తించకుండా 1986 లో ఒక చట్టం చేసింది. డేనియల్ లతీఫ్ కేసులో ముస్లిం మహిళలకు మాత్రమే భరణం నిరాకరించడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులుగా వున్న 14, 15 అధికరణాలు ప్రసాదించిన చట్ట సమత్వ భావనకు, 21వ అధికారణలో హామీ ఇచ్చిన జీవించే హక్కుకు వ్యతిరేకమని తీర్పు ఇచ్చింది. 2019 జూలై 30వ తేదీన మూడుసార్లు 'తలాక్' చెప్పి విడాకులు ఇవ్వడాన్ని శిక్షార్హమైన నేరంగా ప్రకటిస్తూ భారత పార్లమెంటు ఒక చట్టం చేసింది. అలానే వారసత్వ చట్టంలో క్రైస్తవులకు వర్తించే సెక్షన్ 118ని రాజ్యాంగంలోని 14, 15వ అధికరణలలోని సమానత్వ హక్కుకు వ్యతిరేకంగా ఉన్నందున సర్వోన్నత న్యాయస్థానం దాన్ని కొట్టివేసింది. 21వ లా కమిషన్ 2018లో ఏకరీతి పౌరస్మృతి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని చెప్పింది. అయితే ఇప్పుడు

బీజేపీ ప్రభుత్వం తన లక్ష్య సాధన కోసం 22వ లా కమిషన్ ద్వారా, చట్టం రూపు రేఖల్ని గురించి అసలేమీ చెప్పకుండా ప్రజాభిప్రాయాన్ని కోరింది.

రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 'వివాహం, విడాకులు, పిల్లల దత్తత, వీలునామాలు, వారసత్వపు ఆస్తి హక్కు, ఉమ్మడి కుటుంబం, ఆస్తి పంకాలు, తదితర అంశాలన్నీ వారి వారి వ్యక్తిగత చట్టాల పరిధులకు లోబడి చట్టాలు చేసే అధికారాలు పొందుపరిచారు. వీటితోపాటు వ్యవసాయేతర భూమి బదిలీ, రిజిస్ట్రేషను, వాటి దస్తావేజుల అంశం కూడా ఉమ్మడి జాబితాలో ఉంది. వీటిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని చట్టం చేయనంత కాలం ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలకే అధికారం ఉంటుంది. ఈ ప్రకారం ఒకే చట్టం వర్తింపజేస్తే, ఆదివాసులు నివసించే ప్రదేశాలలోని ఖనిజ సంపద కొల్లగొట్టడానికి, వారిని నిరాశ్రయులని చేయడానికీ ఈ చట్టం ఆస్కారం కల్పిస్తుంది. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా బీజేపీ పాలన ఉన్న రాష్ట్రాలలో ఎక్కడా ఈ ఏకరీతి పౌరస్మృతి ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేయకపోవడం గమనించాల్సిన అంశం.

ముఖ్యంగా కొద్ది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ హిందువులుగా ముద్రపడిన మెజారిటీ జన సమూహానికి తాము వీరందరి కోసం ఈ అభ్యుదయకర కార్యక్రమం తలపెట్టినట్లు భ్రమింపజేసి, మత వైషమ్యాలు రెచ్చగొట్టడం ద్వారా ఓట్లు నొల్లుకునేందుకు బీజేపీ వేసిన ఎత్తుగడగా అర్థమవుతోంది. ఇక ముఖ్యంగా రాజ్యాంగ దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా, రాజ్యాంగ పీఠికలోని 'సెక్యులర్, సోషలిస్ట్' పదాలను తొలగించి ప్రకటనలిచ్చిన పాలకులు, రాజ్యాంగంలో నుంచి ఆ పదాల్ని ఎత్తివేయడానికి ప్రయత్నాలు జరిపారు. రాజ్యాంగ మౌలిక రూపాన్ని, పీఠికలోని అంశాలను వాటి సారాంశానికి భిన్నంగా సవరణలు చేయకూడదనే ధర్మాసనపు చారిత్రాత్మక తీర్పులు వున్న నేపథ్యంలో, వీటిని ఎత్తేయడం వారి వల్ల కాక ఊరుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఒకే దేశం, ఒకే భాష (అది హిందీ మాత్రమే), ఒకే ఆహారపు అలవాటు, ఒకే పన్ను విధానం, ఒకే మతం, అంటూ ఉత్తరాది ఆర్య సంస్కృతిని దేశం మొత్తం రుద్ది, కేంద్రీకృత నిరంకుశ ఆధిపత్య దోపిడీకి మార్గం సుగమం చేసుకుంటున్న బీజేపీ పాలకులు అభ్యుదయకర చట్టాలు తెస్తారని ఆశించడం పులి గడ్డి తింటుందని భ్రమించడం వంటిదే. వీరు ప్రతిపాదించే ఉమ్మడి పౌరస్మృతిలో ప్రజోపయోగకర అంశాలు ఉంటాయని నమ్మడం నేతి బీరకాయలో నెయ్యి ఉంటుందని నమ్మడం వంటిదే.

భారత రాజ్యాంగం పార్లమెంటుకంటే అత్యున్నతమైనది. అధికరణం 25 ప్రజా సంక్షేమం, ఆరోగ్యం, నైతికతల పరిమితులకు లోబడి, ప్రతి వ్యక్తీ నాస్తికత్వంతో సహా తనకు ఇష్టం వచ్చిన మత భావనను అనుసరించేందుకు, ఆరాధనకు, ప్రచారానికీ స్వేచ్ఛను కల్పించింది. కాబట్టి, ఒకేసారి బలవంతంగా ఈ పౌరస్మృతిని రుద్దడం రాజ్యాంగ వ్యతిరేక ప్రతిపాదనగా భావించాల్సి ఉంటుంది. ప్రాథమిక హక్కులను మార్చడానికి అధికారం లేని పార్లమెంటు ఈ ఏకరీతి పౌరస్మృతి చట్టాన్ని తేవడం రాజ్యాంగ ధిక్కారమే అవుతుంది. ఇప్పటి వరకూ క్రమానుగతంగా వచ్చిన చట్టాలు, తీర్పులు పరిశీలిస్తే, ప్రాథమిక హక్కుల ప్రాతిపదికన క్రమానుగతంగా సామాజిక అభ్యుదయాన్ని చట్టాల ద్వారా ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం ఉందని, సామాజిక, మత వైషమ్యాల నివారణకు ఇదే మార్గమనీ, మనకు అర్థం అవుతున్నది. ❑

---

## రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నది ఎవరు?

(22వ పేజీ తరువాయి)

**స్వేచ్ఛను సాధించడానికి భారత రాజ్యాంగం కొన్ని అధికరణల్ని కేటాయించింది.**

- అధికరణం 19 : భావ ప్రకటన స్వేచ్ఛ
- అధికరణం 20: ఒక నేరానికి ఒకేసారే శిక్ష
- అధికరణం 21: వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు
- అధికరణం 21 : విద్యాహక్కు
- అధికరణం 22: నిర్బంధాలు – పరిమితులు

**దోపిడి నుంచి రక్షణ పొందడానికి మరికొన్ని అధికరణలు ఇలా ఉన్నాయి**

- అధికరణం 23: శ్రమశక్తిని దోపిడి చేయరాదు
- అధికరణం 24: బాలకార్మికుల నిషేధం

1949 నవంబర్ 26న లోక్ సభలో రాజ్యాంగాన్ని సమర్పిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత ఇలా అన్నారు "ఈ రాజ్యాంగం ఎంత గొప్పదయినా, దాన్ని అమలు పరిచేవారు దుర్మార్గులైతే ఆ రాజ్యాంగం తన లక్ష్యాన్ని చేరుకోదు"– అని. ఆయన దార్శని కుడు కాబట్టి, భవిష్యత్తులో జరగబోయేది ముందే ఊహించి చెప్పినట్టున్నారు. ఈ రోజు మన దేశంలో జరుగుతున్నది అదే – దాన్ని అరికట్టడం భారతీయులందరి బాధ్యత. నేరస్థుల్ని చట్టసభలకు పంపకుండా వివేకవంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకునే బాధ్యత ఓటు హక్కు గల దేశ పౌరులందరిదీ. ఆచరణకు మూలం ఆలోచనే కదా? అందుకే, ఆలోచించడం ప్రారంభించాలి! 73వ గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా దేశప్రజలందరూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలుపుకోవడానికి కంకణబద్ధులు కావాలి. ❑

# ఉమ్మడి బుల్ డోజర్ సమైక్యానికా!?



అనువాదం : రాఘవశర్మ


- బద్రీ రైనా

ఈ ప్రపంచం సృష్టించడం ద్వారా కానీ, పరిణామం చెందడం ద్వారా కానీ ఏర్పడిందని ఎలా భావించినా, దానికొక స్వభావం మాత్రం ఉందనేది వాస్తవం. ఆ స్వభావం భిన్నత్వమే కానీ, ఏకత్వం కాదు. జీవజాలంలో సారూప్యత కాకుండా, ప్రేమతో మునిగితేలే భిన్నత్వం ఉంటుంది. అది అన్ని జాతుల్లోనూ ఉంటుంది. మానవ జాతి సహా సృష్టిలో వున్న జీవ జాతులన్నీ కూడా ఆహారాన్ని తింటాయి. విస్తరిస్తాయి. సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. ఏ రెండు జీవ జాతుల మధ్య ఇవి ఒకే విధంగా ఉండవు. సింహాలు ఏనుగుల్లా తినవు. 'వెదుర్లు తిని నాలాగా శరీరాన్ని పెంచుకో' అని ఏ ఏనుగూ సింహాలకు సూచించదు. వెదురులో వున్న అద్భుతం ఏనుగుల జాతిని పెంచుతుంది. అంటే ఇదొక అద్భుతం. అన్ని జీవ జాతులకు ఈ అద్భుతం వర్తించదు. అన్నీ జీవించే క్రమంలో ఉంటాయి. పక్షులన్నీ కిచకిచలాడతాయి. ఒక జాతి పక్షులు మాత్రమే ఆ జాతి కిచకిచలను అర్థం చేసుకుంటాయి. వేరే పక్షుల భాషను మాట్లాడమని వాటిపైన ఏ ఒత్తిడీ లేదు. మనలాగా హిందీ భాష మాట్లాడి తీరాలన్న ఒత్తిడి అసలురాదు! ఏ రెండు జీవ జాతులూ కలుసుకోవు. తమలాంటి వాటిని సృష్టించవు. ఒకే సమయాన్ని పాటించవు. 'చాలా గుడ్లు పెట్టి, సంతానాన్ని బాగా పెంచు' అని వాటికి ఎవరూ చెప్పరు.

మనం నివసిస్తున్న ప్రాంతంలోవున్న ఈ ప్రపంచం ఎంతో మనోహరంగా రంగు రంగులతో, నీడలతో, భిన్నమైన సూర్యోదయాలతో, సూర్యాస్తమయాలతో మేఘమాలల అమరికలతో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి ఎంతో భిన్నంగా ఉంటుంది. ఒక చెట్టుకు మరొక చెట్టుకు వ్యత్యాసం ఉంటుంది. గబ్బిలమంత పెద్దగా ఉన్నా, సీతాకోక చిలుకలు చాలా భిన్నంగా ఉంటాయి. మతవాదులు తరుచూ చెబుతున్నట్టు ఒకే విధంగా ఉండదు. వైవిధ్యంగా ఉండడం ప్రకృతి సూత్రం. 'భగవంతుడు తనదైన రూపంలో ఉంటాడ'ని ఒక ఇంగ్లీషు కవి ఈ ప్రపంచానికి పేరు పెట్టాడు.

### మానవ సమూహాలు

మానవ సమూహాల్లో కూడా అదే కనిపిస్తుంది. భగవంతుడు తన సొంత ఊహతో 'మనిషి'ని సృష్టించాడు అనుకుందాం. తొలి సంతానంగా భగవంతుడికి సమీపంగా ఉండేది తెల్ల మనిషా, నల్ల మనిషా, గోధుమ వర్ణం మనిషా, పురుషుడా,




మహిళనా అన్నది సందేహమే! భగవంతుడిని ఆరాధించడంలో పురాతత్వ శాస్త్రంలో, తత్వశాస్త్రంలో, వేదాంత శాస్త్రంలో ఆ పోటీనే గాఢతను సృష్టించింది. భూమిలో, నివాసాల్లో, ప్రసారాల్లో, పోషకాల్లో, వాతావరణంలో విధిగా మన సంస్కృతిని నిర్మించుకోవలసి వచ్చింది. అన్ని విషయాల్లోనూ ఆయా మానవ సమూహాల లోపాలు, బలహీనతలు, అలవాట్లు వారి ప్రత్యేకమైన ఉనికిని చాటుతాయి. ఇటీవల పరిశీలించింది ఏమిటంటే సంయోగం చెందిన ఏ రెండు కుటుంబాలకు ప్రత్యేకమైన పొరచట్టాలు లేవు.

మనకు తెలిసిన కుటుంబాలలో మర్యాదలు, చిరునామాలు, పోషకాలు, వస్త్రధారణ, చదువుకోవడంలో వున్న వ్యక్తిగత అలవాట్లు, నైపుణ్యాలు, స్నేహాలు, నిద్రించే, నడిచే స్థిరమైన ప్రాంతాలు, టీ, కాఫీ, పాలు తాగడం వంటి వాటిలో మర్యాదలు ఒక పెద్ద కుటుంబంలో అందరికీ ఒకేలా ఉండవు. ప్రత్యేక అవసరాలు వున్న కుటుంబ సభ్యుల గురించి కాకుండా, ఏదో ఒక కుటుంబంలోని సభ్యులందరూ జ్ఞానాన్ని స్వీకరించడంలో ఒకేవిధంగా ఆనందాన్ని వ్యక్తం చేయలేరు. నవ భారతంలో, ముఖ్యంగా వారసత్వ బాధ్యతను ఎవరైతే ఆమోదించరో అలాంటి వారు 'అభివృద్ధి', 'జాతీయ ప్రయోజనాలు' పేరుతో ఆలోచనలను రూపొందించే పాలకుల ఏకీకృత ఆకాంక్షను అప్పుడప్పుడూ ప్రోత్సహిస్తున్నారు. ఏకీకృతం కోసం ఇచ్చే పిలుపు రాజకీయ జీవితంలో ఫెదరలిజానికి శాపంగా తయారైంది. వ్యక్తిగత జీవితంలో కానీ, కుటుంబ జీవితంలో కానీ స్వీయ నిర్బంధమనే జైలు శిక్షకు దారితీస్తుంది. జాతులు, మానవ సమూహాలు ఏకీకృతానికి పిలుపును ఇవ్వడం అనేది

ఎల్లవేళలా 'జాతీయ సామ్యవాద' పథకం లాంటిది. దీని చరిత్ర ను అర్థం చేసుకుందాం. నిజమైన జర్మన్లంతా నీలి కళ్ళు, అందమైన రాగి జుట్టుతో అర్యులలా ఉంటారనేది హిట్లర్ ఆలోచన. దీంతో నాజీలు జిప్సీను, స్లొవాను, రోమాలను తుడిచిపెట్టాలని ఒక భయంకరమైన ప్రయోగాన్ని చేశారు. ఈ రోజు జర్మనీ మాత్రం వలసలను పెద్ద సంఖ్యలో అనుమతిస్తోంది.

## ప్రతిఘటన

భారతదేశంలో చాలా మంది ఏకీకృత పౌరస్మృతిని ప్రతిఘటిస్తున్నారు. సామూహికంగా హిందూయేతరులందరినీ హిందువులుగా మార్చడానికి చేసే చర్యగా దీన్ని భావిస్తున్నారు. అన్ని మతాలు, సాంస్కృతిక సమూహాలు కలిసి చర్చలు జరిపి, ఒక అభిప్రాయానికి రావవడం తప్పేమీ కాదు. అదొక మంచి, హేతుబద్ధమైన చర్యని పలువురు భావిస్తున్నారు. అధికారం తరపున ఇలాంటి చర్చల ప్రక్రియ జరగకపోతే, ఏకీకృత పౌరస్మృతి ఎజెండా కాస్తా ఉమ్మడి పౌరస్మృతికి బదులు హిందూ సాధారణ చట్టంగా తయారవుతుందని అనుమానించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ గణతంత్రంలో హిందూ సమూహంతోపాటు, చిన్న చిన్న అన్ని సమూహాల్లో సంస్కరణలకంటే, వాటి పర్సనల్ లాను కొనసాగించడం మంచిది. లైంగిక న్యాయాన్ని దెబ్బ తీయకుండా ఉండాలి. వీటన్నిటికీ 'ఉమ్మడి బుల్ డోజర్' పరిష్కారం కాదు. సభ్యులందరి మధ్య ఒక సమానత్వాన్ని తీసుకొచ్చే, హేతుబద్ధతను తెచ్చే సమతావాద చట్టం తేవడం కోసం సామాజిక, నైతిక పరిణామంలో మనం ఎక్కడున్నామోనని అన్ని సమూహాలు, మతాలు స్థిరచిత్తంతో ఆలోచించాలి. ఉదాహరణకు, ముస్లిం పర్సనల్ లాను అమలు చేయడంలో ముస్లిం పురుషులు పాలకులుగా ఎందుకు వ్యవ హరిస్తుంటారో సమాధానం చెప్పాలి. వివాహ నిర్ణయంలో, నిఖాలో హక్కు ఉన్నప్పటికీ, విడాకులలో కూడా సమాన హక్కు ఉండాలి. ముస్లిం స్త్రీలకు 'ఖులా' హక్కు ఉందని తెలివి తక్కువగా సమాధానం ఇవ్వడం కాదు.(విడాకులు మంజూరయ్యాక, పెళ్ళి సమయంలో భర్తకు ఇచ్చిన కానుకలను తిరిగి ఇచ్చేయ మని ముస్లిం పర్సనల్ లా ప్రకారం స్త్రీలు కోరే హక్కు 'ఖులా') విడాకులు తీసుకోవడానికి చర్యలు జరుగుతున్నప్పుడు మత వ్యవస్థలో పురుషుడికే మొదటి అవకాశం లభిస్తోంది. ఏ మతంలోని సంస్కరణలైనా ఆ మతస్తులు చేపట్టడమే మంచిది. ఈ సంస్కరణలను వేరే మతస్తులు చేస్తున్నట్టయితే, వారికా హక్కు ఉన్నట్టయితే, కచ్చితంగా అది న్యూరో చక్రవర్తి సాధించిన 'ఉమ్మడి'లానే ఉంటుంది.

**ఈ గణతంత్రంలో హిందూ సమూహంతోపాటు, చిన్న చిన్న అన్ని సమూహాల్లో సంస్కరణలకంటే, వాటి పర్సనల్ లాను కొనసాగించడం మంచిది. లైంగిక న్యాయాన్ని దెబ్బ తీయకుండా ఉండాలి. వీటన్నిటికీ 'ఉమ్మడి బుల్ డోజర్' పరిష్కారం కాదు. సభ్యులందరి మధ్య ఒక సమానత్వాన్ని తీసుకొచ్చే, హేతుబద్ధతను తెచ్చే సమతావాద చట్టం తేవడం కోసం సామాజిక, నైతిక పరిణామంలో మనం ఎక్కడున్నామోనని అన్ని సమూహాలు, మతాలు స్థిరచిత్తంతో ఆలోచించాలి.**

## రాజ్యాంగం

ఉమ్మడి పౌరస్మృతిని ప్రతిపాదించే వారు హేతుబద్ధమైన వాదనలను వినిపించడంలో విఫలమైనప్పుడు, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో వున్న 44వ అధికరణంలోని ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రయత్నించాలని చేసిన సూచనను గుర్తుచేస్తున్నారు. ఈ అధికరణంలో ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావడానికి ఎలాంటి పద్ధతిని అనుసరించాలని కానీ, ఏ రూపంలో తీసుకురావాలని కానీ పేర్కొనలేదు. రాజ్యాంగంలో లిఖించిన మరో అధికరణంలో ఉండే ఆదేశిక సూత్రాలలో వున్న ఐదు మెట్లలో ఉమ్మడి పౌరస్మృతి ఒక మెట్టు మాత్రమే. 39వ అధికరణంలోని మూడు భాగాలలో వున్న నిబంధనలు ఈ సందేహాలను లేవనెత్తుతున్నాయి.

1. ఏ భూమిలో వనరులు ఉన్నాయో, ఆ వనరులు ఆ భూమి కలవారికే తొలుత చెందుతాయి. ఈ రోజున ప్రభుత్వం వీటిని గుర్తిస్తుందా ?

2.సంపదంతా కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించకుండా అడ్డుపడడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. గత తొమ్మిదేళ్ళుగా కొద్దిమంది ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో సంపదంతా కేంద్రీకరించిన విషయం వాస్తవం కాదా?

3.ఆదాయాల్లో వున్న అసమానతలను కనీస స్థాయికి తగ్గించాలి : మోదీ పరిపాలనలో ఉన్నంతగా గతంలో ఎప్పుడూ ఈ అసమానతలు ఇంత దారుణంగా లేవు. కులం, జాతి, భాష, ప్రాంతం, మతపరంగా పర్సనల్ లాతో సంబంధం లేకుండా అత్యధిక పౌరుల్లో ఆనందాన్ని నింపడానికి, ఏ ప్రభుత్వానికైనా 39వ అధికరణం అమలు అనేది అత్యున్నత ప్రాధాన్యతగా ఉండాలి.


39వ అధికరణం అమలు చేయడంలో ఎలాంటి చర్యలైనా సరే ఎందుకు కనిపించడం లేదు ? భారతీయులలో అత్యధిక సంఖ్యాకుల జీవిత ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదు ? అని మనం అడగవచ్చు. పెళ్ళి చేసుకోవడంలో, విడాకులు తీసుకోవడంలో, వారసత్వం అనుభవించడంలో, దత్తత తీసుకోవడం తదితర వాటిల్లో అన్నిట్లో ఒకటే, ఒకే విధంగా ఉంది. ఆర్థిక విషయాల్లోనూ సాధ్యమైనంత వరకు అదేస్థాయిలో పాల్గొంటారు. మధ్యప్రదేశ్‌లో ఒక గిరిజన వ్యక్తిపై ఓ ఉన్మాది మూత్ర విసర్జన చేసిన తాజా సంఘటనపై **(మిగతా 28వ పేజీలో)**

# పీటముడులు విప్పేదెలా?

- రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందేందుకు ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అయితే ఇది అంత సులభమేమీ కాదు.
- ఎందుకంటే మన దేశం వివిధ మతాలు, జాతుల సమ్మేళనం. ఎవరి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు వారివి. మతాచారాల ప్రకారమే చట్టాలను రూపొందించారు. అయితే యూసీసీ వస్తే ఇవేమీ ఉండవు. కులం, మతం, జాతి వేరైనా అందరికీ ఒకే చట్టం.
- భారత రాజ్యాంగం కుల మతాలకు అతీతంగా ప్రతి పౌరుడికీ సమానత్వపు హక్కుకు, న్యాయం పొందే హక్కుకు, జీవించే హక్కుకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో వివిధ మతాల వారికి ప్రస్తుతం అమలులో వున్న వేర్వేరు చట్టాలను విశ్లేషించి, ఆ తర్వాతే యూసీసీ ముసాయిదాను రూపొందించాల్సి ఉంటుంది.

**వీలునామా రాయకుండా చనిపోతే..**

- ఇప్పుడు వివిధ మతాల వారికి ఉద్దేశించిన చట్టాలలో వైరుధ్యాలను గమనిద్దాం. ఉదాహరణకు ఒక తండ్రికి కుమారుడు, కుమార్తె ఉన్నారనుకోండి. కుమారుడికి ఓ కొడుకు, కుమార్తెకు ఓ కొడుకు ఉన్నారు. ఓ దుర్ఘటనలో తండ్రి, కుమారుడు, కుమార్తె చనిపోయారు. ఇక మిగిలింది ఇద్దరు మనుమలు.
- తండ్రి తన ఆస్తుల పంపకానికి సంబంధించి వీలునామా ఏదీ రాయలేదు. తండ్రి హిందువైతే ఆస్తి ఎవరికి చెందుతుంది ? కుమారుడి కొడుకుకే చెందుతుంది. కుమార్తె కొడుకుకి ఏమీ రాదు.
- అదే తండ్రి పార్సీయో, క్రైస్తవుడో అయితే ఆయన ఆస్తి ఇద్దరు మనుమలకూ సమానంగా లభిస్తుంది.
- ముస్లింలకు సంబంధించిన చట్టంలో రెండు రకాల వారసులు ఉంటారు.
- వీలునామా రాయకుండా చనిపోయిన వ్యక్తి ఆస్తిని చట్టబద్ధమైన వారసులందరికీ సమానంగా పంచడం ఒక పద్ధతి.
- రెండో పద్ధతిలో వారసులందరూ ఆస్తిని పంచుకున్న తర్వాత




మిగిలిన ఆస్తిని సంబంధీకులెవరైనా ఉంటే వారికి ఇస్తారు. దీని ప్రకారం కుమారుడి కొడుకుకు, కుమార్తె కొడుకుకు ఆస్తిలో వాటా వచ్చినా కుమారుడి కొడుకుకే ఎక్కువ ఆస్తి లభిస్తుంది. ఎందుకంటే కుమార్తె కొడుకు సంబంధీకుల జాబితాలో ఉంటాడు.

**వివాహిత మహిళ చనిపోతే..**

- ఇప్పుడు మరో ఉదాహరణ తీసుకుందాం. ఒక మహిళ ఉందనుకుందాం. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఒక బాబు. ఒక పాప. వృద్ధులైన తల్లిదండ్రులకు ఆ మహిళ ఒక్కరే కుమార్తె. ప్రమాదంలో ఆ మహిళ చనిపోయిందనుకుందాం. ఆమె వారసుడెవరనేది మత విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది.
- ఆ మహిళ పార్సీ అనుకుందాం. ఆస్తిని నాలుగు భాగాలు చేసి భర్తకు ఒక భాగం, ఇద్దరు పిల్లలకూ చెరో భాగం ఇస్తారు. మిగిలిన భాగాన్ని రెండుగా విభజించి తల్లిదండ్రులకు పంచుతారు.
- ఒకవేళ ఆ మహిళ క్రైస్తవ మతస్తురాలు అనుకుందాం. ఆస్తిని మూడు భాగాలు చేసి భర్త, ఇద్దరు పిల్లలకు పంచుతారు. ఆమె తల్లిదండ్రులకు ఏమీ లభించదు.
- ఒకవేళ ఆ మహిళకు పిల్లలు లేకపోతే భర్తకు, తండ్రికి చెరి సగం పంచుతారు. తల్లికి ఏమీ రాదు.
- మహిళ హిందూ స్త్రీ అయితే భర్త, పిల్లల మధ్య ఆస్తిని పంచుతారు. తల్లిదండ్రులకు వాటా రాదు. అయితే ఆ మహిళ పిల్లలు లేని వితంతువు అయినా, భర్తకు వారసులు ఎవరూ

లేకపోయినా అప్పుడు ఆమె తల్లిదండ్రులకు ఆ ఆస్తి చెందుతుంది.

- ఒకవేళ ఆ మహిళ ముస్లిం అయితే ఆమె భర్తకు నాలుగో వంతు ఆస్తి వస్తుంది. కుమార్తెకు వచ్చే ఆస్తికి రెట్టింపు ఆస్తి కుమారుడికి వస్తుంది. తల్లిదండ్రులు కూడా ఒక వాటా పొందవచ్చు. ఆ మహిళకు పిల్లలు లేరనుకుందాం. భర్తకు సగం ఆస్తి దక్కుతుంది. మిగిలినది తల్లిదండ్రులకు పంచుతారు.

### జటిలం...సంక్లిష్టం

- దీనిని బట్టి మనకు అర్థమయ్యేది ఏమంటే ఒక్కో సందర్భంలో ఒక్కో మతానికి చెందిన చట్టం మేలైనదిగా అనిపిస్తుంది. మత ప్రాతిపదికన రూపొందించిన చట్టాలు జటిలమైనవి, సంక్లిష్టమైనవి.
- వారసత్వానికి సంబంధించి వీటి మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. ఆస్తి పంపకాల విషయంలోనే కాదు. దత్తత, వివాహం, విడాకుల విషయంలో కూడా ఈ చట్టాలు పరస్పర విరుద్ధంగా, జటలంగానే ఉన్నాయి. దీనికి కారణమేమిటి ?
- మన దేశంలో అన్ని రకాల సంప్రదాయాలనూ పాటిస్తారు. వీటిని క్రోడీకరిస్తే నిబంధనలన్నీ పీటముడులతో కూడి ఉంటాయి. మినహాయింపులూ ఉంటాయి. ఈ చిక్కుముడులను విడదీసి, ఒకేలా ముడివేస్తే అదే యూసీసీ అవుతుంది.
- అయితే అందరికీ ఆమోదయోగ్యమైన చట్టం సాధ్యమేనా? ఒక మతానికి సంబంధించిన నిబంధనలు మరో మతానికి వర్తించవు. మహిళకు సంబంధించిన ఉదాహరణనే తీసుకుందాం.
- వివాహిత మహిళ ఆస్తిలో వాటా విషయంలో క్రైస్తవులు, హిందువులు తల్లిదండ్రులను పరిగణనలోకి తీసుకోరు. పార్సీ, ముస్లిం మహిళలు అయితే తల్లిదండ్రులు కూడా ఆమె ఆస్తిలో వారసులు అవుతారు.
- మరి ఎవరి సంప్రదాయాన్ని అనుసరించాలి? ఏది ఉత్తమం ? ఎవరి సంప్రదాయాన్ని పాటించినా మరొకరి హక్కుకు భంగం కలుగుతుంది.
- సమానత్వం, న్యాయం, జీవనం వంటి విషయాలలో రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విఘాతం ఏర్పడుతుంది. ఓ పెద్ద మనిషి చెప్పినట్లు 'యుసీసీ అంటే అందరికీ ఒకే చట్టం. అయితే అది లింగ సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ఏకరీతి సూత్రాలపై ఆధారపడిన వ్యక్తిగత చట్టాల సమాహారం'. ❑

(ప్రజాశక్తి దినపత్రిక నుండి సేకరణ)

> **'గాంధీజీ విషయంలో ఆశ్చర్యకరమైన ధోరణి ఏంటంటే.. అతడు తన సమస్యలను జీవిత కాలంలో పరిష్కరించుకు లేకపోయాడని విమర్శిచడం. అలాగే ప్రస్తుత కాలంలోని సమస్యలను కూడా అతడు పరిష్కరించలేదని నిందించడం. ఇది పూర్తి అన్యాయమైన ధోరణి. అతడు ఒక మానవమాత్రుడు. తను చేయగలిగింది చేశాడు. మిగిలిన సమస్యలను మనం పరిష్కరించుకోవాలి గానీ..అన్నీ గాంధీజీ మీద రుద్దడం జరుగుతోంది'**
>
> **- రాజ్ మోహన్ గాంధీ**

# ఉమ్మడి బుల్ డోజర్ సమైక్యానికా!?

(26వ పేజీ తరువాయి)

ఏకీకృత పాలకులు మాట్లాడుతూ, ఇది గిరిజన తెగల్లో వున్న సర్వసాధారణ ఆచారమని సమర్థిం చపూనుకుంటున్నారు. అసలు విషయం ఏమిటంటే, త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లో 30 శాతం మంది గిరిజనులు ఉండడం గమనార్హం. ఏ 'ఉమ్మడి' అయినా సరే ప్రాణాలకు ప్రమాదంగా పరిణమిస్తోంది. అందుకు వారి కొక నమస్కారం. ఇతర మతాలకు ఇలాంటి సౌలభ్యాన్ని ఎందు కు అనుమతించరు? తమ మతంలోనే తాము చేపట్టే సంస్కర ణలను చేపట్టాల్సిన అవసరాన్ని ఎందుక గుర్తించరు?

### లక్ష్యం

ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఉమ్మడి పౌరస్మృతిని ప్రతిపా దించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇతరులలాగే ఈ మతం కూడా దీని కోసం పనిచేయాలనేది సుస్పష్టం. ట్రిపుల్ తలాఖ్ అనే భయంకరమైన విధానాన్ని వ్యతిరేకించే క్రమంలో ఆ మతానికి చెందిన వారే కీలక పాత్ర పోషించారు. ఇతరులు ఇలాంటి సంస్కరణలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి పౌర స్మృతి గురించిన హడావుడి వెనుక వున్న లక్ష్యం ఏమిటో ఎవ రైనా సరే తెలుసుకోలేనంత మూర్ఖులు కాదు. ఇది ముస్లింలను, హిందువులను మరొకసారి విడదీస్తోంది. రానున్న 2024 సాధారణ ఎన్నికల కోసం ఓటు బ్యాంకును భద్రపరచుకోవడా నికే. మోదీ రెండోసారి అధికారం చేపట్టాక గడిచిన నాలుగేళ్ళలో దీని గురించి ఎప్పుడైనా విన్నామా? ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఉమ్మడి పౌరస్మృతి పేరుతో ప్రజలను ఐక్యం చేయడానికి బదులు విడదీయడానికే ఈ ఉపాయమంతా. ❑

# బీజేపీ ఎన్నికల స్టంట్ యూసీసీ



- డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్‌రెడ్డి

ముసాయిదా రూపొందని ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. ఇదేదో ఉన్నట్టుండి చర్చకు వచ్చిన అంశం కాదు. ఎంతో కాలంగా నలుగుతున్నదే. జన సంఘ్ రూపాంతరం చెంది భారతీయ జనతా పార్టీగా మారిన నేపథ్యంలో తమ మతతత్వ అజెండాలో భాగంగా రూపొందించుకున్న రాజకీయ లక్ష్యాల్లో యూనిఫాం సివిల్ కోడ్ ఒకటి. యూసీసీ అనేది పూర్తిగా సామాజిక అంశాలకు చెందినది. వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం తదితర అంశాలకు సంబంధించి దేశంలోని అన్ని మతాల ప్రజలకు ఒకే రకమైన భారతీయ చట్టం ఉండాలన్నది ఉమ్మడి పౌరస్మృతి. మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలనేది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి చర్చకు వస్తూనే ఉంది. తాజాగా ఉమ్మడి పౌరస్మృతి లేకనే దేశం వెనుకబడి పోయిందనే విషప్రచారం కొనసాగుతోంది. ఉమ్మడి పౌరస్మృతిని స్థూలంగా గమనిస్తే దాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంది అనిపిస్తుంది. ఈ కారణం చేతనే పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవనభృతి లాంటి అనేక సామాజిక విషయాలకు సంబంధించిన చట్టాలు దేశంలో ఉన్న ముస్లింలకు మాత్రమే వేరుగా ఉన్నాయనే అసత్యం వ్యాప్తి చెందుతోంది. కాని ముస్లింలకు మాత్రమే వేరు వేరు చట్టాలున్నాయనడం అసంబద్ధం. ముస్లింలతోపాటు హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులకు కూడా వ్యక్తిగత చట్టాలున్నాయి. క్రైస్తవులకు వారి స్వంత చట్టాలు ఉన్నాయి. ఈ విషయం సామాజిక అవగాహన ఉన్న వారందరికీ తెలుసు. అయితే సంఘ్ పరివార్ మూకల వలలో పడిన విజ్ఞత లోపించిన వారే ముస్లింలకు మాత్రమే ప్రత్యేక చట్టాలున్నాయని నమ్ముతున్నారు. అమెరికాసహా ఐర్లాండ్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మలేషియా, టర్కీ, ఇండోనేషియా, సూడాన్, ఈజిప్ట్ వంటి అనేక దేశాల్లో యూసీసీ అమలవుతున్నా భారత్‌లో ఎందుకు లేదనే వితండ వాదనకు దిగుతున్నారు. 2018 నాటి 21వ లా కమిషన్ నివేదికలో మహిళల విషయంలో కొనసాగుతున్న అసమానతలకు మూలం వివక్ష అని స్పష్టంగా పేర్కొంది. లింగ సమానత్వం గురించి లా కమిషన్ మాట్లాడితే....ఎన్నికల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రధాని మోదీ ఉమ్మడి పౌరస్మృతి అనే వివాదాస్పద అంశం చుట్టూ చర్చకు కేంద్ర బిందువయ్యారు. బీజేపీ విధి విధానాలను, ఆ పార్టీ పుట్టుక నేపథ్యంలో వారు ఏర్పరచుకున్న లక్ష్యాలను గమనిస్తే తాజాగా చర్చనీయాంశమైన ఉమ్మడి పౌరస్మృతి అనేది పూర్తిగా ఎన్నికల స్టంట్ అనే విషయం స్పష్టమవుతుంది. నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 1996లో ఆ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో నారీ శక్తి విభాగంలో ఏమి పేర్కొన్నారో ఆత్మావలోకనం చేసుకోవాల్సి ఉంటుంది. లింగ సమానత్వం అనే అంశాన్ని బీజేపీ తమ నాటి మేనిఫెస్టోలో చేర్చింది. కులం, వర్ణ, వర్గాలకు అతీతంగా స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని పేర్కొంది. ముస్లిం దంపతులకు దత్తత హక్కులు లేనందున ఒక బిడ్డను దత్తత తీసుకోలేకపోతున్నారంటూ పెడబొబ్బలు పెట్టింది. దేశంలోని అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకు వివాహ వయస్సు 18 ఏళ్లుగా ఎందుకు ఉండరాదని, వారసత్వ చట్టంలో దేశంలోని మహిళలందరికీ సమానత్వం ఎందుకు ఉండకూడదని ప్రశ్నించింది. 1998 మేనిఫెస్టోలోనూ ఇవే అంశాలను ప్రస్తావించింది. అధికారంలోకి వచ్చి 10 ఏళ్లకు దగ్గరవుతున్నా మహిళా సాధికారత కోసం వేసిన అడుగులు లేక ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే మహిళలపై వివక్షను రూపుమాపుతుందనే సత్యదూరపు వాదనను తెరపైకి తెస్తోంది.

2024 జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న ప్రధాని మోదీ ఇటీవలే భోపాల్ నిర్వహించిన ఎన్నికల సభలో ఉద్దేశపూర్వకంగానే ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు. ఆ రాష్ట్రంలో గత అసెంబ్లీ


**దేశంలోని హిందూ వివాహ చట్టం ఇప్పటికీ ఏకరీతిలో లేదు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతులు అమలవుతున్నాయి. హిందూ వివాహ చట్టం గోవాలోని హిందువులకు వర్తించదు. గోవాలో హిందూ పురుషుని భార్య 30 ఏళ్లలోపు మగ బిడ్డకు జన్మనివ్వకపోతే పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చు. ఉత్తరాదిన మేనరిక వివాహాలు నిషిద్ధం. దక్షిణాదికి ఆ వివాహాలకు ఆమోదం. ఇలా చాలా చిక్కుముడులు, వైరుధ్యాలతో కూడిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా దుందుడుకు చర్యలకు దిగితే భారతీయ సమాజం సామాజిక సంక్షోభాలకు నిలయంగా మారుతుంది.**

ఎన్నికల్లో తమకు దక్కని అధికారాన్ని అడ్డుగోలుగా కొల్లగొట్టిన బీజేపీ పాలన సాగించింది. రానున్న ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఏమీ దొరక్క సర్వసాధారణంగా వారు వాడే ఆయుధం మత తత్వంతో కూడిన ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రధాని నోటి వెంట యూసీసీ ప్రస్తావన వచ్చిందో లేదో వాట్సప్ యూనివర్సిటీ యంత్రాంగం, అంధ భక్తులు తాము యూసీసీకి అనుకూలం అనేలా ప్రత్యేక అసత్యాల కథనాలను వండి సోషల్ మీడియా వేదికలపై వార్చింది. మీరు అనుకూలమా కాదా చెప్పాలంటూ విధి విధానాలు రూపొందని, ముసాయిదా కూడా తయారు కాని అంశాన్ని పట్టుకుని చర్చలకు భారత ప్రజానీకాన్ని పురిగొల్పేం దుకు నానా అగచాట్లు పడుతోంది.

ఇప్పటి వరకూ లా కమిషన్ ఇచ్చిన చాలా సిఫార్సులను అసలు పట్టించుకోని బీజేపీ యూసీసీపై మొండివైఖరితో ముందుకు వెళ్లడానికి వారు నిత్యం అనుసరించే మతతత్వ రాజకీయాలే కారణం. ఎన్నికలేవైనా హిందూ-ముస్లిం విభజన ద్వారా ఓట్లు పొందవచ్చునని చూస్తూనే ఉంటుంది. ఇటీవలే కన్నడనాట జరిగిన ఎన్నికల్లో ఏకంగా ప్రధాని మోదీ కేరళ ఫైల్స్ అనే ఉన్మాద సినిమాను చూడాలని, జై భజరంగ్‌భళి అంటూ ఓట్లు వేయాలని కోరడమే ఇందుకు ఉదాహరణ. మత ప్రభావం అధికంగా ఉన్న కన్నడ ప్రజలే పూర్తిగా బీజేపీని తిరస్కరించారు. ఇక దేశాన్ని అమ్మకానికి పెట్టిన బీజేపీ వల్లించే దేశభక్తి నినాదా లను ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరు. రామమందిరం వివాదం సమసిపోయింది. ఆ పేరుతో ఒక మత విభజన సాధ్యం కాదు కాబట్టే తమ అమ్ములపొదిలోని చివరి ఆయుధం ఉమ్మడి పౌర స్మృతి తుట్టెను కదిపింది. అంబేద్కర్ కూడా యూసీసీని కోరుకు న్నాడని వాదించే వారు ఆయన హిందూ కోడ్ బిల్లు కోసం చేసిన పోరాటాన్ని ఎందుకు విస్మరిస్తున్నారో, హిందూ వర్గాలకు చెందిన మహిళా ప్రయోజనాలు దాగి ఉన్న హిందూ కోడ్ బిల్లును బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోందో బహిర్గతం చేయాలి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో చట్టం ఎందుకు చేయడం లేదో సమాధానం చెప్పాలి. దేశంలో ఇప్పటికి అమలులో ఉన్న హిందూ వివాహ చట్టం ఏకరీతిలో లేదు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతులు అమలవుతున్నాయి. హిందూ వివాహ చట్టం గోవా లోని హిందువులకు వర్తించదు. గోవాలో హిందూ పురుషుని భార్య 30 ఏళ్లలోపు మగ బిడ్డకు జన్మనివ్వకపోతే పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చు. ఇటువంటివి దేశవ్యాప్తంగా అనేకం ఉన్నాయి. ఉత్తరాదిన మేనరిక వివాహాలు నిషిద్ధం. దక్షి ణాదికి ఆ వివాహాలకు ఆమోదం లభిస్తోంది. ఇలా చాలా చిక్కు ముడులు, వైరుధ్యాలతో కూడిన అంశాలను పరిగణలోకి తీసు కోకుండా దుందుడుకు చర్యలకు దిగితే భారతీయ సమాజం సామాజిక సంక్షోభాలకు నిలయంగా మారుతుంది.

మహిళా సాధికారత నిజమైన ఆశయం అయితే సమానత్వం కోసం ఆచరణాత్మకంగా అనేక చట్టాలు చేయవచ్చు. ఇప్పటికి ఉన్న గృహహింస చట్టం వ్యక్తిగత చట్టాలతో సంబంధం లేకుండా అమలవుతోంది. వివక్షను తొలగించేందుకు ఇటువంటి ఆచర ణాత్మక చట్టాలను మరిన్నిటిని రూపొందించే అవకాశాలు కూడా ఉన్నాయి. అయినా తమ ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగానే తెరపైకి తెచ్చిన ఈ ఉమ్మడి పౌరస్మృతి కారణంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనే విశ్లేషణలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందుకు కేంద్ర హోం మంత్రి తాజా గా క్రిస్టియన్‌లకు, ఆదివాసులకు యూసీసీ వర్తింపచేయం అని ప్రకటించడం వెనుక ఏ కారణాలున్నాయో సమాజం అర్థం చేసు కోవాలి. అందరికీ ఒకే చట్టం తమ లక్ష్యం అయితే కొందరికి ఉపశమనం ఇవ్వాల్సిన అవసరం ఏమిటో పాలకులే చెప్పాలి. అది ఉమ్మడి పౌరస్మృతి అనిపించుకుంటుందా ? ఇది ఇక్కడితో ఆగదు. దీర్ఘకాలంలో దేశంలోని హిందువుల్లోని వివిధ సంస్కృ తులను, ఆచార వ్యవహారాలను పాటించే వారి ఆగ్రహానికి కార ణమవుతుంది. ఈ విషయం బీజేపీకి బాగా తెలుసు. అయినా కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో ఆడుతున్న ఈ వికృత క్రీడకు రానున్న ఎన్నికల్లో పౌర సమాజమే సరైన సమాధానం ఇస్తుంది. ❑

## స్వీకారం



# హిందుత్వ కార్పొరేట్ కూటమిది ఏ విధానం



- ప్రభాత్ పట్నాయక్

ప్రతీ ఆధునిక సమాజంలోనూ ఫాసిస్టు శక్తులుంటాయి. సాధారణ పరిస్థితుల్లో అవి సమాజ జీవితపు ప్రధాన స్రవంతికి దూరంగానో, కాస్త ఎడంగానో నామమాత్రపు శక్తులుగా కొనసాగుతూ ఉంటాయి. ఒకసారి గుత్త పెట్టుబడిదారీ వర్గం ఈ శక్తులకు మద్దతునివ్వడం జరిగితే అవి అమాంతం కేంద్ర స్థానాన్ని ఆక్రమించుకుంటాయి. గుత్త పెట్టుబడిదారీ వర్గం ఈ ఫాసిస్టు శక్తులకు కావలసినంత ధనాన్ని అందిస్తుంది. విపరీతమైన మీడియా కవరేజి ఇస్తుంది. పెట్టుబడిదారీ సంక్షోభం ఏర్పడి దాని వలన నిరుద్యోగం బాగా పెరిగిపోయి దాని పర్యవసానాలు ఆ గుత్త పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యానికే ఒక సవాలుగా మారినప్పుడు ఆ వర్గం ఫాసిస్టు శక్తులకు పూర్తి మద్దతునందిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జీవిస్తూ ఆ వ్యవస్థలో ఏర్పడిన సంక్షోభం ఫలితంగా తీవ్ర పేదరికాన్ని అనుభవించే ప్రజానీకపు దృష్టిని మళ్ళించి సమాజంలో ఎవరో మైనారిటీ మతాలుగానో, మైనారిటీ జాతులుగానో వున్న ప్రజల పట్ల విద్వేషాన్ని, శతృత్వాన్ని పెంచడం అనేది ఈ ఫాసిస్టు శక్తులు చేసే పని. దీనికితోడు ఒకసారి ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాగానే రాజ్యాధికారాన్ని ఉపయోగించి అణచివేతకు పాల్పడతాయి. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని వారిపై ఫాసిస్టు గూండాలను ఉసిగొల్పి నానా రకాలుగా లైంగిక దాడులకు పాల్పడతాయి. ఈ గూండాలు కేవలం మైనారిటీలనే గాక, ఆలోచనాపరులమీద, మేధావుల మీద, రాజకీయ ప్రత్యర్థుల మీద, స్వతంత్రంగా వ్యవహరించే విద్యావేత్తల మీద సైతం దాడులకు తెగబడతాయి.

ప్రస్తుతం భారతదేశంలో ఇదే జరుగుతోంది. ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావడంతోపాటు ఇంకో కొత్త శక్తులు కూడా ముందుకొచ్చాయి. 'నూతన గుత్త పెట్టుబడిదారీ వర్గం' అనేదే ఆ కొత్త శక్తి. ఈ వర్గం ఫాసిస్టుశక్తులతో ఒక ప్రత్యేకమైన సన్నిహిత సంబంధాన్ని కలిగివుంది. డేనియల్ గ్యూరిన్ అనే ఫ్రెంచి మేధావి 'ఫాసిజం, బడా పెట్టుబడిదారీ వర్గం' అనే తన గ్రంథంలో జర్మనీలో జరిగిన పరిణామాలను ఈ విధంగా వివరించాడు. జర్మనీలో కొత్తగా ఉక్కు, వస్తూత్పత్తి రంగం, ఆయుధాల తయారీ రంగాల్లో తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ వర్గం 1930 దశకంలో నాజీలకు సంపూర్ణ మద్దతునందించింది. జౌళి రంగం, వినిమయ వస్తువుల తయారీ తదితర రంగాల్లో ముందునుంచీ ఉన్న గుత్త పెట్టుబడిదారులు అందించిన మద్దతుతో పోల్చితే ఈ కొత్త గుత్త పెట్టుబడిదారీవర్గం అందించిన మద్దతు చాలా ఎక్కువ. దానర్థం పాత గుత్త పెట్టుబడిదారీ వర్గం నాజీలను బలపరచలేదని మాత్రం కాదు. కొత్తగా తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ వర్గం మరింత దూకుడుగా నాజీలను బలపరిచింది. అదే మాదిరిగా జపాన్‌లో నిస్సాన్, మోరీ వంటి కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వాన్ని 1930వ దశకంలో బలపరిచాయి. వాళ్ళతో పోల్చితే పాత గుత్త పెట్టుబడిదారులుగా ఉన్న మిత్సుయి, మిత్సుబిషి, సుమిమోటో వంటి గుత్త సంస్థలు అంత ఉధృతంగా బలపరచలేదు. దానర్థం ఈ పాత గుత్త సంస్థలు అక్కడి ప్రభుత్వాన్ని బలపరచలేదని కాదు. బలపరిచే ఉధృతిలోనే తేడా ఉంది. జపాన్‌లోని గుత్త పారిశ్రామిక సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వాన్ని బలపరిచాయి గనుకనే రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోయిన అనంతరం అక్కడ జనరల్ డగ్లస్ మెకార్థర్ ఆధ్వర్యంలో అమెరికన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వం అంతవరకూ అక్కడున్న గుత్త పారిశ్రామిక సంస్థలను అన్నింటినీ మూసేసింది (అయితే అలా మూతబడ్డ సంస్థలన్నీ వేరే రూపాల్లో తిరిగి రంగం మీదకొచ్చాయి అన్నది వేరే విషయం). జపాన్‌లో కూడా కొత్తగా ఏర్పడ్డ గుత్త సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వానికి తిరుగులేని పూర్తి మద్దతు నందించాయి.

ఇప్పుడు మన దేశంలోను ఇదే ధోరణి కనిపిస్తోంది. కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలైన అదానీ, అంబానీలు మోడీ ప్రభుత్వానికి మద్దతును అందించడంలో బాగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. దానికి ఫలితంగా ఈ సంస్థలు పొందుతున్న ప్రయోజనాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. వీటితో పోల్చితే ఎప్పటి నుండో గుత్త సంస్థలుగా ఉన్నవి ఈ విషయంలో వెనకబడ్డాయి. దానర్థం ఆ పాత గుత్త సంస్థలు మోడీని బలపరచడానికి విముఖంగా ఉన్నట్టు కాదు. నిజానికి టాటా సంస్థల అధినేత నాగపూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయానికి వెళ్ళి తమ మద్దతు ప్రకటించడం ఆ సంస్థ హిందూత్వ ప్రభుత్వానికి ఎంత సన్నిహితంగా ఉందో సూచిస్తుంది. గుత్త పెట్టుబడిదారీ వర్గంతో, అందునా కొత్తగా తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ శక్తులతో మోడీ ప్రభుత్వం అత్యంత సాన్నిహిత్యాన్ని కలిగివుండడాన్ని తరచూ 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' (క్రోనీ క్యాపిటలిజం) అని వర్ణిస్తున్నారు. ఫాసిస్టు శక్తులకు, గుత్త పెట్టుబడిదారీ వర్గానికి, అందునా కొత్త గుత్త పెట్టుబడిదారులకు మధ్య నెలకొన్న సాన్నిహిత్యాన్ని ఇది సూచిస్తుంది. కాని ఈ బంధం తాలూకు నిర్దిష్ట ప్రత్యేక లక్షణాన్ని

అది సూచించడం లేదు. కార్పొరేట్-హిందూత్వ కూటమి అని ఆ బంధం ప్రత్యేక లక్షణాన్ని గురించి చెప్పవచ్చు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేది అన్ని తరహాల ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలకూ వర్తించే వర్ణన. అయితే, ఫాసిస్టు శక్తులు ఆధిపత్యంలోకి వచ్చిన ప్రత్యేక పరిస్థితుల నిర్దిష్ట స్వభావాన్ని అది సూచించదు. ఒక అర్థంలో చెప్పుకుంటే, పెట్టుబడిదారీ విధానం యావత్తూ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరూ నిబంధనలకు లోబడి' నడుచుకోవాలి. కాని ఆ నిబంధనల చట్రం లోపలే కొందరు ఆశ్రితులకు ప్రత్యేక ప్రయోజనాలు సమకూర్చవచ్చు. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే రాజ్యానికి, గుత్త పెట్టుబడిదారులకూ మధ్య ఉండే సంబంధం మరింత సన్నిహితంగా తయారౌతుంది. ద్రవ్య పెట్టుబడిపై రుడాల్ఫ్ హిల్ఫెర్డింగ్ (జర్మనీ) రాసిన ఉద్గ్రంథంలో బ్యాంకులకు, పారిశ్రామిక పెట్టుబడికి మధ్య 'వ్యక్తిగత సంపర్కం' జరిగి, దాని ప్రాతిపదికన 'ద్రవ్య గుత్తాధిపత్య సంస్థలు' ఏర్పడతాయని ఆయన సూచించాడు. అదే మాదిరిగా, ఈ 'ద్రవ్య గుత్తాధిపత్య సంస్థలకు', ప్రభుత్వానికి నడుమ 'వ్యక్తిగత సంపర్కం' ఉంటుందని కూడా ఆయన సూచించాడు. బహుళజాతి కంపెనీలలో ముఖ్య అధికారులుగా పని చేసినవారు ప్రభుత్వ పదవులలో ముఖ్య స్థానాలను చేపడతారు. అదే మాదిరిగా ప్రభుత్వంలో ముఖ్య పదవులు నిర్వహించిన వారు బహుళజాతి కంపెనీలలో ముఖ్య అధికారులుగా నియమించబడతారు. ఈ క్రమంలో ప్రభుత్వ విధానాలు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలను సంరక్షించే విధంగా మలచబడతాయి. ఈ విధంగా గుత్త పెట్టుబడిదారులకు ఎంత అనుకూలంగా మారిపోతున్నా, ఈ వ్యవహారం అంతా కొన్ని 'నియమ నిబంధనల' చట్రం లోపలే జరుగుతూ ఉంటుంది.

గ్వాటెమాలాలో అధినేతగా ఉండిన జాకొబో ఆర్బెంజ్ ప్రవేశపెట్టిన భూసంస్కరణలు అమెరికాకు చెందిన యునైటెడ్ ఫ్రూట్స్ కంపెనీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పరిణమించాయి. అప్పుడు సిఐఎ కుట్ర పన్ని ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది. అదే విధంగా ఇరాన్‌లో మొస్సాద్ ప్రధానిగా ఉన్న కాలంలో చమురు పరిశ్రమను జాతీయం చేశాడు. దాని ఫలితంగా బ్రిటిష్ యాజమాన్యంలో ఉన్న చమురు కంపెనీ తన ఆధిపత్యాన్ని కోల్పోయింది. అప్పుడు బ్రిటిష్, అమెరికన్ గూఢచారి సంస్థలు రెండూ కలిసి కుట్ర పన్ని మొస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోశాయి. అయితే ఈ అన్ని సందర్భాలలోనూ ఆ గూఢచారి సంస్థలు కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థల ప్రయోజనాల కోసం కుట్రలు చేశాయి తప్ప అక్కడి ప్రభుత్వాల నియమనిబంధనలను ఎన్నడూ తిరస్కరించలేదు. నిజానికి ఈ రోజు వరకూ బ్రిటిష్ ప్రభుత్వం ఇరాన్‌లో మొస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి జరిగిన కుట్రలో తమ ప్రభుత్వానికి భాగస్వామ్యం ఉన్నట్టు ఒప్పుకోనేలేదు.

అయితే ఫాసిస్టు శక్తులు రాజ్యాధికారాన్ని చేపట్టాక అంతా మారిపోయింది. ఒక మౌలికమైన మార్పే జరిగింది. 'నియమ నిబంధనలు' అనే వాటినే తోసిరాజనే కొత్త పద్ధతి వచ్చింది. ఇది మన దేశంలో స్పష్టంగా కనిపిస్తోంది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో మన ప్రధాని అప్పుడే కొత్తగా అనిల్ అంబానీ స్థాపించిన సంస్థను రాఫెల్ యుద్ధ విమానాల స్థానిక తయారీదారుడిగా గుర్తించాలని ఫ్రెంచి ప్రభుత్వాన్ని కోరాడు. ఇక్కడ గ్లోబల్ టెండర్లు పిలవాలన్న నిబంధన గాలికి పోయింది. కనీస అర్హతలు ఈ స్థానిక తయారీదారుడికి ఉండాలన్న నిబంధన కూడా అంతే. అప్పటికే విమానాల ఉత్పత్తిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థను సైతం పక్కన పెట్టేశారు. ఎందుకిలా చేశారన్న ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు.

అదే విధంగా అదానీ గ్రూపు 'నియమ నిబంధనలను' ఉల్లంఘించిందన్న హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన తర్వాత కూడా అదానీ సంస్థల వ్యవహారం మీద ఎటువంటి విచారణా లేదు. కొన్ని పారిశ్రామిక సంస్థలను 'ఎంపిక' చేసి, ఇతర దేశాలలోని సంస్థలతో జరిగే పోటీలో ఈ ఎంపిక కాబడిన సంస్థలే గెలుపొందేలా బీజేపీ ప్రభుత్వం పథకరచన చేస్తోందని కొన్ని కథనాలు వెలువడ్డాయి. గుత్త పెట్టుబడితో, అందునా, మరీ ముఖ్యంగా కొత్త గుత్త పెట్టుబడితో మోడీ ప్రభుత్వం ఎంత సన్నిహితంగా జతకట్టిందో ఇవి సూచిస్తున్నాయి. ఇటువంటి 'గెలుపు గుర్రాలను' ఎంపిక చేయడంలో ఎటువంటి నియమ నిబంధనలూ ఉండవన్నది స్పష్టం. ఈ ప్రభుత్వం హిందూత్వ శక్తులతో జతకట్టిన కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థల వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు తోడ్పడుతుంది. దీనికి బదులుగా, ఈ కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలు ఈ హిందూత్వ ప్రభుత్వానికి మీడియా నుండి పూర్తి మద్దతు ఉండేట్టు చూస్తాయి. స్వతంత్రంగా వ్యవహరించే ఒకటో రెండో టీవీ చానెళ్ళను అదానీ గ్రూపు కొనుగోలు చేసేసింది. దాంతో కార్పొరేట్-హిందూత్వ కూటమికి మీడియా నుండి సంపూర్ణ మద్దతు దొరకడం ఖాయం అయిపోయింది. ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' అని చెప్పడమంటే జరుగుతున్న దాన్ని బాగా తక్కువ చేసి చెప్పడమే అవుతుంది. ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అయితే, దీనికి ముందు స్వచ్ఛమైన, పక్షపాతంలేని పెట్టుబడిదారీ విధానం అమలులో ఉండేదని, దానిని అణగదొక్కి హిందూత్వ శక్తులు ప్రస్తుత విధానాన్ని అమలు చేస్తున్నాయని అర్థం వస్తుంది. స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానం అనేది ఎక్కడా, ఎప్పుడూ లేనే లేదు. పెట్టుబడిదారీ విధానం అంటేనే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం. గుత్త పెట్టుబడిదారీ విధానం ఉనికిలోకి వచ్చాక ప్రభుత్వానికి, ఆ గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. అయితే ఫాసిస్టు పాలన వచ్చాక ఈ సంబంధంలో గుణాత్మకమైన మార్పు వస్తుంది. ఇక్కడ ఏ నియమాలూ ఉండవు. హిందూత్వ-కార్పొరేట్ కూటమి ఏం చేస్తే అదే నియమం. ❑

# పేదరికం మీద పరిహాసం



- ఎం.కోటేశ్వరరావు

ప్రపంచ బహుముఖ దారిద్ర్య సూచిక (ఎంపిఐ)-2023 ప్రకారం మన దేశం గడచిన పదిహేను సంవత్సరాలలో 41.5 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి విముక్తి కలిగించినట్లు ప్రకటించారు. ఎందరో ఈ వార్తను చదివి సంతోషించారు. జీవన పరిస్థితులను 'గణనీయం'గా మెరుగు పరచినందున ఈ పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోపాటు, తమ పాలన కూడా వుంది గనుక, మరీ డబ్బా కొట్టుకుంటే జనం నవ్విపోతారు గనుక కాషాయ దళాలు కాస్త తగ్గి ఉన్నట్లు కనిపిస్తోంది. సున్నాకంటే ఒకటి విలువ ఎంతో ఎక్కువ అన్నట్లుగా దీని గురించి సానుకూల వైఖరితోనే మంచి చెడ్డలను చూద్దాం. ఈ సూచికను ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి), ఆక్స్‌ఫర్డ్ దారిద్ర్య, మానవ అభివృద్ధి చొరవ (ఓపిహెచ్ఐ) సంస్థ ఉమ్మడిగా రూపొందించాయి. ప్రభుత్వాలు అందించిన సమాచారాన్ని విశ్లేషించి వివరాలను వెల్లడించారు. ఇది ఒక్క మన దేశం గురించే కాదు, అన్ని దేశాల గురించీ 2010 నుంచి ప్రతి ఏటా ఇలాంటి సమాచారాన్ని ప్రకటిస్తున్నారు. వివిధ అంశాల ప్రాతిపదికన జీవన నాణ్యతను లెక్కిస్తున్నారు.

మన దేశంలో 2005-06 నుంచి 2019-2021 వరకు పదిహేను సంవత్సరాలలో వచ్చిన మార్పు ప్రకారం పోషకాహారం, శిశుమరణాలు, స్కూలుకు వెళ్లే సంవత్సరాలు, బడికి హాజరు, వంట గ్యాస్, పారి శుధ్యం, తాగునీరు, విద్యుత్ అందుబాటు, ఇంటివసతి, ఆస్తులు ఎంత మేరకు కలిగి ఉన్నారనే దాని ప్రాతిపదికగా అంచనా వేశారు. 2005-06లో ఇవి లేని వారు దేశ జనాభాలో 55.1 శాతం, 2015-16లో 27.7 శాతం, 2019-2021లో 16.4 శాతం మంది ఉన్నారని ఎంపిఐ సూచికలో పేర్కొన్నారు. మన దేశంలో 41.5 కోట్ల మంది జీవితాలు మెరుగుపడితే చైనాలో 2010-14 మధ్య 6.9 కోట్ల మంది జీవితాలు మెరుగుపడ్డాయి. ప్రపంచమంతటా 110 దేశాల్లో 110 కోట్ల మంది ఇంకా దారిద్ర్యంలో మగ్గుతున్నారు. మన దేశంలో 23 కోట్ల మంది ఉన్నారు. ప్రతి ఆరుగురిలో ఐదుగురు ఆఫ్రికాలోని సబ్ సహారా, దక్షిణాసియాలో ఉన్నారు. ఈ విశ్లేషణలన్నీ కరోనాకు ముందు ఉన్న సమాచారం ప్రాతిపదికగా చేసినవే, ఆ మహమ్మారి కలిగించిన ప్రతికూల ప్రభావం వలన దారిద్ర్యంలోకి దిగజారిన వారు ఇంకా పెరిగారని చెబుతున్నారు.

దారిద్ర్యం నుంచి ఇంత మంది బయపడ్డారు అన్నది ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దీనికి ఆయా దేశాలు నిర్ణయించిన ప్రమాణాలు తప్ప ప్రపంచమంతటికీ వర్తించే ప్రాతిపదిక లేదు. ప్రపంచబాంకు నిర్వహించే దారిద్ర్యం, అసమానతల వేదిక- పావర్టీ అండ్ ఇనీక్వాలిటీ ప్లాట్‌ఫాం (పిఐపి) విశ్లేషణ ప్రకారం రోజుకు 2.25 డాలర్లు, అంతకంటే తక్కువ వచ్చే వారు మన దేశంలో 2019లో 11.88 శాతం ఉన్నారు. త్వరలో మన దేశం చైనాను అధిగమించనుందని అనేకమంది చెబుతున్నారు గనుక, దానితో పోలిక ఎలా ఉందో చూద్దాం. 2017 పిపిపి పద్ధతిలో లెక్కించిన మేరకు 2019 నాటి వివరాలు. ఆ ఏడాది సగటున ఒక డాలరుకు రూ.70 మారకపు విలువ ఉంది (జులై 15న ఒక డాలరుకు రూ.82గా ఉంది). కనుక ఎవరికి వారు ఆ రోజున ఉన్న విలువ ప్రకారం లెక్కించుకోవచ్చు. ప్రామాణికంగా డాలర్లను తీసుకున్నారు గనుక ఇక్కడ కూడా దాన్నే తీసుకుందాం. విశ్లేషకులు తీసుకొనే రాబడి అంకెలలో స్వల్ప తేడాలుంటే జనాభా శాతాలు ఎలా మారతాయో కూడా చూద్దాం. ప్రపంచ బాంకు పేర్కొన్న ప్రమాణం ప్రకారమే రోజుకు 2.15 డాలర్ల రాబడిని ప్రాతిపదిక తీసుకుంటే 2015-2019 కాలంలో దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న జనాభా మన దేశంలో 18.7 నుంచి 10 శాతానికి తగ్గగా చైనాలో 1.2 నుంచి 0.1 శాతానికి తగ్గింది. పిఐపి వేదిక సమాచారం మేరకు దిగువ విధంగా ఉన్నారు.



బంగ్లాదేశ్ - పాకిస్తాన్ : రాబడి

| దేశం | డాలర్లలో రాబడి | జ. శాతం | డాలర్లలో రాబడి | జ. శాతం | డాలర్లలో రాబడి | జ. శాతం |
|---|---|---|---|---|---|---|
| బంగ్లాదేశ్ | 2.20 | 14.62 | 3.65 | 51.63 | 6.95 | 87.43 |
| పాకిస్తాన్ | 2.15 | 4.93 | 3.65 | 39.84 | 6.95 | 85.16 |

| భారత్-చైనా : రాబడి | | | | | | |
|---|---|---|---|---|---|---|
| దేశం | డాలర్లలో రాబడి | జ. శాతం | డాలర్లలో రాబడి | జ. శాతం | డాలర్లలో రాబడి | జ. శాతం |
| భారత్ | 2.25 | 11.88 | 3.60 | 43.66 | 6.95 | 84.31 |
| చైనా | 2.25 | 0.18 | 3.70 | 3.24 | 6.80 | 24.34 |

దిగువ అంకెలను బట్టి రోజుకు ఎక్కువ సంపాదించే వారు చైనాలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. రాబడిని బట్టి జీవన ప్రమాణాలు, నాణ్యత ఆధారపడి ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. జనాల రాబడితోపాటు ప్రభుత్వాలు అందించే సేవలు వాటికి తోడౌతాయి. బిజెపి పెద్దలు, కొన్ని మీడియా సంస్థలు మన దేశాన్ని పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ (2016), పాకిస్తాన్ (2018)లతో పోల్చిచూపటం తెలిసిందే. వాటి స్థితి ఎలా ఉందో కూడా చూద్దాం. అచ్చేదిన్ గురించి ప్రతి దేశంలోని పాలకులూ చెప్పే కబుర్లే కనుక ఎవరు ఎక్కడ ఉన్నారో ఎవరికి వారే పోల్చుకోవచ్చు.

దక్షిణాసియాలో మన ఇరుగు పొరుగు దేశాల్లో శ్రీలంక పరిస్థితి మెరుగ్గా ఉంది. మన దేశంలో దారిద్ర్యరేఖ గురించి ఎవరికి వారే తమదైన సూత్రీకరణలు చేశారు, భాష్యాలు చెప్పారు. వాటి తీరుతెన్నుల గురించి చూద్దాం. ప్రపంచ బ్యాంకు రోజుకు 1.90 డాలర్లుగా అంతకుముందు నిర్ణయించిన దానిని 2022లో 2.15 డాలర్లకు పెంచింది. దారిద్ర్యరేఖ నిర్ణయానికి అన్ని దేశాల ప్రమాణాలు ఒకే విధంగా లేవని ముందే చెప్పుకున్నాం. మన దేశంలో కూడా వివిధ కమిటీలు భిన్న ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకున్నాయి. అలఘ్ కమిటీ (1979) ప్రతి రోజూ పెద్దవారికి గ్రామాలలో 2,400, పట్టణాలలో 2,100 క్యాలరీల శక్తి అవసరమని, అందుకు అవసరమైన ఆహారం, దాని ధరలను ప్రాతిపదిక గా తీసుకుంది. తరువాత లకడావాలా కమిటీ (1993), టెండూల్కర్ కమిటీ (2009), రంగరాజన్ కమిటీ(2012)లు దీని గురించి నివేదికలు ఇచ్చాయి. రంగరాజన్ కమిటీ పట్టణాల్లో రోజుకు తల ఒక్కింటికి నెలకు రూ. 1,407, గ్రామాలలో రూ. 972 ఖర్చును దారిద్ర్యరేఖ నిర్ధారణకు ప్రామాణికంగా తీసుకుంది.

**కేంద్ర ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్‌గా రూ.200, రూ.500 చొప్పున నిర్ణయించింది. అరవై, ఎనభై ఏళ్లు దాటిన వారికి ఇది ఏమూలకు వస్తుందో, ఇతర ఏ ఆధారం లేని పని చేయలేని వారు దాని తో ఎలా బతుకులీడుస్తారో అచ్ఛేదిన్ కబుర్లు చెప్పే వారు ఎన్నడైనా ఆలోచించారా? దారు ణమైన అంశం ఏమంటే 2013 లోనే టాస్క్‌ఫోర్స్ కమిటీ పెన్షన్లు పెంచాలని సిఫార్సు చేసింది. దాన్ని పట్టించుకోవాల్సినంత గొప్పది కాదన్నట్లుగా గత తొమ్మిది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ సర్కార్ పక్కన పెట్టింది.**

మన దేశంలో దారిద్ర్యానికి కారణాలుగా దిగువ వాటిని పేర్కొంటున్నారు. జనాభా పెరుగుదల నిరంతరం జరుగుతున్నది. దానికి అనుగుణంగా వస్తు వినియోగ డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండటం. దీనికి కారణం కమతాలు చిన్నవిగా ఉండటం, రైతులకు పెట్టుబడి లేమి, నూతన సాంకేతిక పద్ధతుల గురించి తెలియనితనం, సాంప్రదాయ పద్ధతుల్లోనే సాగు, వృధాను అరికట్టలేకపోవటం, దీని వలన జీవన ప్రమాణాలు పెరగటం లేదని చెబుతున్నారు. వనరులను సమర్ధవంతంగా ఉపయోగించకపోవటం, ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండటం, పెట్టుబడుల లేమి, ధరల పెరుగుదల, నిరుద్యోగం, వారసత్వం, కులవ్యవస్థ కారణాలుగా పేర్కొంటున్నారు. ఇవి నాణానికి ఒక వైపు మాత్రమే. ఈ అంశాల పరిష్కారానికి పాలకులు అనుసరించిన దివాలాకోరు విధానాలు అసలైన కారణాలు.

ఆపరేషన్ అవసరమైన చోట పూత మందులు పూసి చికిత్స చేసినట్లుగా అనేక ఉపశమన పథకాలను అమలు జరిపినా ఫలితం ఉండటం లేదు. పరిమితమైన మెరుగుదలను చూపి మొత్తం దారిద్ర్యం నుంచి జనాలను బయటపడ వేసినట్లు చెబుతున్నారు. దానికి జీవన ప్రమాణాలు మెరుగుపడినట్లు అందమైన పేరు. ప్రపంచ బ్యాంకు చెప్పినట్లు రోజుకు 2.15 డాలర్లు అంటే (ఇప్పటి మారకపు రేటు ప్రకారం) రూ. 172 రాబడి ఉంటే దారిద్ర్యం నుంచి వెలుపలికి వచ్చినట్లే. దీని ప్రకా రం నెలంతా పని ఉందనుకుంటే రాబడి రూ. 5160 వస్తుంది. రంగరాజన్ కమిటీ ప్రతి వ్యక్తి నెలకు రూ. 1,407 ఖర్చు చేస్తే చాలని చెప్పింది. ఇవి నేడున్న స్థితిలో వాస్తవాల ప్రాతిపదికన వేసిన అంచనాలేనా ? మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిం చిన కనీస వేతనం నెలకు ఐదున్నర వేలకు అటూ ఇటూగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్‌గా రూ. 200, రూ. 500 చొప్పున నిర్ణయించింది. అరవై, ఎనభై ఏళ్లు దాటిన వారికి ఇది ఏమూలకు వస్తుందో, ఇతర ఏ ఆధారం లేని పని చేయలేని వారు దానితో ఎలా బతుకులీడుస్తారో అచ్చేదిన్ కబుర్లు చెప్పే వారు ఎన్నడైనా ఆలోచించారా? దారుణమైన అంశం ఏమంటే 2013లోనే టాస్క్‌ఫోర్స్ కమిటీ పెన్షన్లు పెంచాలని సిఫార్సు చేసింది. దాన్ని పట్టించుకోవాల్సినంత గొప్పది కాదన్నట్లుగా గత తొమ్మిది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ సర్కార్ పక్కన పెట్టింది. డిఎంకె సభ్యురాలు కనిమొళి సారథిగా ఉన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2023 మార్చి నెలలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో దీర్ఘకాలంగా

**(మిగతా 39వ పేజీలో)**


# అండమాను జైలు.. ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు

- పుస్తకానికి ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ పరిచయ వాక్యం

## విస్మరణ, విధ్వంసానికి విరుగుడు

సయ్యద్ నశీర్ అహమ్మద్‌ది ఆశ్చర్యకరమైన పట్టుదల. అసూయ పడవలసినంత పట్టుదల. చేయగలిగినదేమిటో, చేయవలసినదేమిటో స్పష్టత కలిగి ఉండటం అందరికీ సాధ్యపడే విషయం కాదు. సమాజానికి ఎంతగానో అవసరమయ్యే పనిని, రానురాను అవసరం పెరుగుతున్న పనిని ఆయన చేస్తున్నారు. కష్టపడగలిగేతత్వం, మొండితనం, లక్ష్యశుద్ధి ఉండడం ఇవన్నీ ఆయన ఇంత పనిచేయడానికి కారణం అవుతున్నాయనుకుంటాను. అందుకని ముందుగా అభినందనలతోనే ఈ పరిచయ వాక్యం మొదలు పెడుతున్నాను.

నశీర్ అహమ్మద్ పుస్తక సందర్భంలో, ఇతర రచనలనో ఇతర ప్రక్రియలనో తక్కువ చేయాలనుకోవడం కాదు కానీ, కవిత్వంతోనూ, కవిత్వ రాజకీయాలతోనూ సతమతం కావడం కంటే ఇటువంటి పుస్తక రచన చేయడం సమాజానికి ఉపయోగకరం అనిపిస్తుంది. ముఖ్యంగా, వర్తమానంలో అత్యంత ముఖ్యమయిన సామాజిక అవసరాల కోసం పనిచేసేవారు తక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు ఉన్న కొద్ది మందీ పనికివచ్చే పనులు చేయడం మంచిది. భారతీయ చేతనలోను, చరిత్రల్లోను ముస్లింను కుట్ర పూరిత అస్తిత్వంగా మలుస్తున్నప్పుడు. పరాయిగా, దేశద్రోహిగా, ఉగ్రవాదిగా మూసపోసే ప్రయత్నాలు జరుగుతున్న పుడు నశీర్ అహమ్మద్ ఒక సరైన సానుకూల అస్తిత్వాన్ని కాలమూ దాదాపుగా ఒకటే కావడంతో, ఆ దీవులను ప్రవాస కారాగార శిక్షకు యోగ్యమైనవిగా భావించారు. అప్పటి నుంచి రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ చేతికి వెళ్ళేదాకా ఆ దీవులు సమరయోధుల బందిఖానాగా, శిక్షా కాలం ముగిసిన వారిలో కొం దరి నివాసంగా కొనసాగింది. 1857 పోరాటం ముగిసిన మూడేళ్ళకు పోరాట కారుల విచారణ, శిక్షల విధింపులు ముమ్మరమయ్యాయి.





సయ్యద్ నశీర్ అహమ్మద్

దేశవ్యాప్తంగా అనేక సంస్థానాలలో తిరుగుబాట్లలో భాగమైనవారు, ప్రోత్సహించినవారు, బ్రిటిష్ ప్రభుత్వంలో పోలీసులు గాను, సివిల్ అధికారులు గాను పనిచేసిన వారు అనే కులు 1857 నాటి కేసులలో అండమాన్‌కు బందీలుగా వచ్చారు. హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెన్సీ మీద జరిగిన దాడి కేసులో మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ అను పోరాట యోధునికి అండమాన్ ప్రవాసశిక్ష విధించారు. సుప్రసిద్ధ సెల్యూలర్ జైలు అండమాన్‌లో బంధితులైన స్వాతంత్ర్య సమరయోధుల చేతనే నిర్మింపజేశారు. దుర్మార్గులు, క్రూరులు అయిన బ్రిటిష్ అధికారులు ఖైదీలతో అత్యంత అమానుషంగా వ్యవహరించేవారు. 1857 అనంతరం కూడా భారతదేశంలో అనేకచోట్ల తిరుగుబాట్లు

జరిగాయి. వాటిలో పాల్గొన్న వారు కూడా అండమాన్‌కే బందీలుగా వచ్చారు. 1920 దశకంలో జరిగిన మోప్లా తిరుగుబాటుదారులను ఇక్కడే బంధించారు.

సావర్కర్ సంగతి తెలిసిందే. జపాన్ చేతికి వెళ్ళే సమయానికి అండమాన్ జైలు ఖాళీ అయ్యింది. కానీ అక్కడ నివాసం ఏర్పర్చుకున్న వారిని బ్రిటిష్ ఏజెంట్లుగా ఆక్రమణదారులు అనుమానించి, తీవ్రమైన అణిచివేత చర్యలు అమలు చేశారు. ఈ పుస్తకంలో స్థూలంగా అండమాన్ చరిత్ర, అక్కడికి వచ్చిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, అండమాన్ జైలులో జరిగిన తిరుగుబాటు చర్యలు, బ్రిటిష్ వైస్రాయ్ హత్యల వివరాలన్నిటిని నశీర్ అహమ్మద్ క్రోడీకరించారు. బ్రిటిష్ వారిని 1857లో హిందూ ముస్లిం సిపాయిలు, సంస్థానాధీశులు కలసి ఎదిరించారు. ఆ యుద్ధం నాటికి, ఈ దేశం ముస్లింలకు, హిందువులకు చెందినదని పరాయివారు బ్రిటిష్ వారేనన్న భావన స్థిరపడింది. అదే జాతీయోద్యమంలో కొనసాగిందని, 20వ శతాబ్దపు మూడో దశాబ్దం నాటికి బ్రిటిష్ వారి విభజన రాజకీయాలు ఫలించి ఉభయ మత వర్గాల మధ్య దూరం పెరుగుతూ వచ్చిందని చరిత్ర చెబుతుంది. జాతీయోద్యమంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ మతతత్వం పెరిగి, ఆ విభజనను మరింత పెంచిందని, ఇప్పుడది ఒక రాజకీయ సామాజిక ఆధిక్యవాదంగా, ఫాసిస్టు ధోరణిగా పరిణమించిందని గుర్తిస్తున్నాము. ఈ నేపథ్యంలో ఒకనాటి ఐక్యతను స్మరించుకోవడం, ఈ దేశం కోసం జరిగిన నెత్తుటి త్యాగాలలో ఉన్న భాగస్వాములను గుర్తించడం, ప్రచారం చేయడం ఒక కర్తవ్యం. సయ్యద్ నశీర్ అహమ్మద్ దాన్ని నెరవేరుస్తున్నారు. రచనలు చేయడం, పుస్తకం ప్రచురించడం మాత్రమే కాదు, వీటిని విస్తృతంగా పాఠకులకు చేర్చడం కోసం నశీర్ అహమ్మద్ రకరకాల మార్గాలను అనుసరిస్తారు. పుస్తక విక్రయాలు మాత్రమే కాక, విద్యార్థులకు ఉచితంగా అందేట్టు చూడడం, డిజిటల్ రూపాలలో ఉచితంగా పంపిణీ చేయడం చేస్తారు. అయన ఆదర్శానికి సహాయ సహకారాలు అందించే మిత్రులు కూడా ఉన్నట్టున్నారు. మొత్తానికి నశీర్ అహమ్మద్ రచన, ప్రచురణ, ప్రచారం అన్నీ ఉద్యమ స్థాయిలో జరుగుతున్నవే. మీ నుంచి చాలా నేర్చుకోవాలి సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు ! ❑

## ప్రాణదాత గురిజాల యశోదమ్మ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా పురిణి గ్రామ ఆడపడుచు గురిజాల యశోదమ్మ 1931లో జన్మించారు. ఆమె తల్లి చొక్కరాసి లక్ష్మీదేవమ్మ, తండ్రి చొక్కరాసి కొండయ్య. పదమూడు సంవత్సరాల వయస్సులో పురిణికి చెందిన గురిజాల వెంకయ్యతో యశోదమ్మ వివాహం జరిగింది. రైతు కుంటుంబానికి చెందిన యశోదమ్మ కష్టజీవి. ఆమెకు ఆరుగురు సంతానం. ఆమె భర్త 04-06-2000న కన్నుమూసారు. ఆ తరువాత 80 ఏండ్ల వయస్సులో 05-05-2011న యశోదమ్మ నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో తుదిశ్వాస విడిచారు. మా అమ్మ సయ్యద్ బీబిజాన్, గురిజాల యశోదమ్మ నెల్లూరు జిల్లా పురిణి గ్రామ ఆడపడుచులు. మా ఇళ్ళు పక్క పక్కనే ఉండటం వలన మా కుటుంబాల మధ్య సహజ సిద్ధమయిన గ్రామీణ ఆత్మీయత పెనవేసుకుంది. అత్తా... మావా... అన్న... బావ... అక్కా... తాతా... అవ్వ అంటూ కలసి పోవడం పురిణి బిడ్డల అలవాటు. 1955లో మా అమ్మ నాకు, యశోదమ్మ తన పెద్ద కుమారుడు మాలకొండయ్యలకు జన్మనిచ్చారు. నేను మాలకొండయ్య కంటె నెలల చిన్నవాడ్ని. మా అమ్మకు పాలు సరిగ్గా పడలేదు. నాకు తల్లిపాల సమస్య వచ్చింది. ఆ పరిస్థితులలో యశోదమ్మ నాకు తల్లిపాల వరం ప్రసాదించి తల్లిపాల లోటు తీర్చింది. ఉదయం పొలానికి వెళ్ళేప్పుడు, సాయంత్రం పొలం నుండి ఇంటికి వచ్చేప్పుడు దారిలోని మా ఇంటికి వచ్చి నా కడుపు నిండా పాలుపట్టి నాకు ప్రాణం పోసింది. నేను తాగాక తన వద్ద మిగిలిన పాలను తన బిడ్డడు, మాలకొండయ్య మావకు పట్టి మిగిలిన ఆకలి తీర్చేందుకు అతడికి అన్నం పెట్టేది. నేను చిన్నోడిని కనుక నాకు పాలు పట్టడం అవసరమంటూ, తన బిడ్డ పాలలో నాకు భాగం కల్పించింది యశోదమ్మ. మానవత్వానికి మహోన్నత రూపంగా నిలిచిన ఆ గురిజాల యశోదమ్మ అత్తకు నా పుస్తకం అంకితం ఇవ్వగలగటం నా అదృష్టం.



**- సయ్యద్ నశీర్ అహమ్మద్.**

# మన కోసం మార్క్స్ ఆ రచన చేసి ఉంటే..



- మందలపర్తి కిషోర్

'కార్ల్ మార్క్స్ రాయతలపెట్టి, రాయలేకపోయిన ఒకానొక సంక్షిప్త రచన' గురించి ప్రముఖ మార్క్సిస్టు మేధావీ, చరిత్ర పరిశోధకుడూ, రాజకీయ వ్యాఖ్యాత, రచయిత జైరస్ బనాజీ ఇటీవల తన ఫేస్‌బుక్ అకౌంట్లో ప్రముఖంగా ప్రస్తావించారు. మే 27న బనాజీ పెట్టిన ఈ పోస్ట్‌లో 'మార్క్స్ రాయతలపెట్టి, రాయలేకపోయిన ఆ సంక్షిప్త రచనకు ఎంగెల్స్ ఎంతో ప్రాధాన్యమిచ్చా'డని వెల్లడించారు. 'మార్క్స్ ఆ రచనను పూర్తిచేసి వున్నా - కనీసం, దాని రాతప్రతి అయినా బయటపడి వున్నా - 'గతితర్కం గురించి మార్క్స్' పేరిట ఆ పుస్తకం మన కందరికీ అందుబాటులో ఉండేది! అలాంటి పుస్తకమేదీ మనకు దక్కకపోయినా, దశాబ్దాల తరబడి అందుకోసం గట్టి ఆకాంక్ష వ్యక్తమవుతూ వచ్చిందని ధ్రువీకరించే ఆధారాలు ఉన్నాయని చెబుతూ బనాజీ మూడు లేఖలలో ఆ రచన గురించి కనిపించిన ప్రస్తావనలను పేర్కొన్నారు. వాటిల్లో రెండు మార్క్స్ రాసినవి కాగా ఒకటి ఎంగెల్స్ రాసిన లేఖ. 'మార్క్స్ రాయాలనుకుని, రాయలేకపోయిన రచన' గురించి ఆ లేఖల్లో ఏముందో వివరంగా పరిశీలిద్దాం.

## మార్క్స్ లేఖల్లో ప్రస్తావనలు

లండన్‌లో వుండే మార్క్స్, మాంచెస్టర్లో ఉండే ఎంగెల్స్‌కు - 1858 జనవరి 16న - ఓ లేఖ రాశాడు. అందులో ఈ రచన గురించి ఇలా ప్రస్తావించాడని బనాజీ పేర్కొన్నారు - "నేనీ మధ్యన రాత్రుళ్ళు విపరీతంగా పనిచేస్తున్నా! ఒక చేత్తో లెమనేడ్ గ్లాసునూ, మరోచేత్తో కట్టలు కట్టలుగా చుట్టలనూ పట్టుకుని మాత్రమే ఈ పనిచేస్తున్నా!! అన్నట్టు, ఈ క్రమంలో నాకు కొన్ని చక్కని వాదనలు స్ఫురిస్తున్నాయి. ఉదాహరణకు, "లాభం" గురించి గతంలో ఎందరో ప్రతిపాదించిన ఎన్నో సిద్ధాంతాలను, ఏకిపారేశాను! ఈ విశ్లేషణ క్రమంలో, నాకు హెగెల్ తర్కం గొప్పగా వినియోగపడడం విశేషం! అయితే, హెగెల్ తర్కాన్ని విభిన్నమైన కోణం నుంచి నేను దర్శించాను - అది కేవలం యాదృచ్ఛికంగా నాకు స్ఫురించిన విషయం! ఫ్రెయిలిగ్రాత్(1) ఎక్కడో హెగెల్ రచనల సంపుటాలు బోలెడు సంపాదించాడు. వాటిని అతను నాకు బహూకరించాడు. అవి నిజానికి బకూనిన్ (2) సొంతం ! ఈ సంపుటాలు తిరగేస్తూ ఉండగా నాకీ విషయం తట్టింది. మళ్ళీ ఎప్పుడైనా తీరిక దొరికినప్పుడు, ఈ తర్కపద్ధతిలోని హేతుబద్ధతను సామాన్య పాఠకుడికి బోధపడే రీతిలో వివరిస్తూ ఒకటి-రెండు షీట్(3)ల మేరకు వివరించాలని ఉంది. ఈ తర్క పద్ధతిని కనుగొన్నవాడే కాదు, దాన్ని మార్మికత మాటున గందరగోళంగా మార్చినవాడు కూడా హెగెలే! (మార్క్స్-ఎంగెల్స్ లేఖలు వున్న సంపూర్ణ రచనల సంపుటం 40, పేజీ 249.)" అని మార్క్స్ ఆ లేఖలో పేర్కొనడం విశేషం! "పెట్టుబడి" (దస్ కపితాల్ రూపంలో) మొదటి సంపుటం జెర్మన్‌లో అచ్చు కావడానికి దాదాపు పదేళ్ళ ముందు మార్క్స్ ఈ లేఖ తన ప్రాణ మిత్రుడికి రాశాడని మనసులో పెట్టుకోవాలి.

అప్పట్లో సెయింట్ పీటర్స్ బుర్గ్‌లో ఉండిన తన చిరకాల మిత్రుడు డీట్స్ గాన్(4) కు 1868 మే తొమ్మిదో తేదీన మార్క్స్ ఓ లేఖ రాస్తూ ఇదే కోరికను వెలిబుచ్చాడు. ఎంగెల్స్‌కు లేఖ రాసి అప్పటికి పదేళ్లయిందనే దృష్టిలో ఉంచుకోవాలి! అదీ మార్క్స్ పట్టుదల, నిబద్ధత!! "రాజకీయ అర్థశాస్త్రం గురించి రచనలు చేయడమనే భారం నెత్తి మీంచి దించుకున్న తర్వాత, 'గతితర్కం' గురించి ఓ రచన చేస్తాను. వాస్తవానికి, గతితార్కిక సూత్రాలు హెగెల్ రచనల్లో-మార్మిక రూపంలో-ఉండనే ఉన్నాయి! ఈ మార్మిక ముసుగును చీల్చి పారేయడం అనేది జరగాల్సి ఉంది" అని మార్క్స్ ఆ లేఖలో రాశాడు. ఈ లేఖ రాసేనాటికి 'పెట్టుబడి' మొదటి సంపుటం జర్మన్‌లో వెలువడి ఏడాది కూడా కాలేదు! ఇవి రెండూ మార్క్స్ రాసిన లేఖల్లో కనిపించిన ప్రస్తావనలు.

## ఎంగెల్స్ లేఖలో ప్రస్తావన

కాగా ఎంగెల్స్ కూడా-మార్క్స్ కన్నుమూసి 20 రోజులన్నా కాక ముందే-రష్యన్ నరోదిజం పితామహుడిగా చెప్పుకునే లవ్రోఫ్(5)కు రాసిన లేఖలో ఇదే రచన గురించి ప్రస్తావించాడు. 1883 ఏప్రిల్ రెండో తేదీన రాసిన ఈ లేఖ ఫ్రెంచ్‌లో వుందని బనాజీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అందులోనూ, ఎంగెల్స్ కొన్ని రాత ప్రతుల గురించి చెప్పడం గమనార్హం. 'రెండు రాత ప్రతులు ఇప్పటి వరకూ నా చేతికి వచ్చాయి. వాటిల్లో ఒకటి 'పెట్టుబడి చెలామణీ' గురించి రాసింది. మరొకటి 'పెట్టుబడిలో వచ్చే సకల పరిణామ క్రమాల గురించిన రచనా ప్రణాళిక. ఇది వెయ్యి ఫోలియో(6) పేజీల్లో ఉంది! ఈ రాతప్రతి యథాతథంగా ముద్రణకు పంపతగిన స్థితిలో ఉందో లేదో నేనప్పుడే చెప్పలేను. ఈ చిత్తుప్రతికి నేను సాఫు ప్రతి సిద్ధం చెయ్యవలసి వుంది! మూర్(7) మనకు వదిలి వెళ్ళిన

రాతప్రతులను పరిశీలించేందుకు ఎన్నో గంటలు కేటాయించవలసి వుంటుంది. రేపు నాకు ఆ పాటి తీరిక దొరుకుతుంది! వాటిల్లో–మూర్ ఎన్నో దశాబ్దాలుగా రాయాలనుకుంటున్న–'గతితర్కం–ఓ రేఖాచిత్రం' అనేది ఉండి ఉండాలి. ఈ రచన ఎందాకా వచ్చిందనే విషయాన్ని మూర్ మన అందరి దగ్గిరా దాచి పెట్టే వుంచాడు. అలాంటి రచన సాగుతోన్న విషయం పసిగట్టిన మరుక్షణం నుంచీ, దాన్ని అచ్చు వేసేందుకు అనుమతించాల్సిందిగా అభ్యర్థిస్తూ పాఠకజనం ఆయన్ని వేధించుకు తింటారనే మూర్ అలా చేసి వుంటాడు!" అని ఎంగెల్స్ లవ్రోఫ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నాడు. జైరస్ బనాజీ తన ఫేస్ బుక్ పోస్ట్‌లో ఈ లేఖ పాఠాన్ని ఉటంకించారు.

## అడ్డుపడిన ఆటంకాలేమిటి?

- మార్క్స్ "గతితర్కం– ఓ రేఖాచిత్రం" లాంటి లఘు రచన చెయ్యాలనే ఆకాంక్ష వ్యక్తం చేసిన తర్వాత పాతికేళ్ళు జీవించాడు కదా! కానీ ఆ లఘు రచన చెయడానికి అడ్డుపడిన విషయం ఏమై వుండొచ్చు?
- 1.తత్వ శాస్త్రంలో డాక్టరేట్ పొందినప్పటికీ, జెనా విశ్వ విద్యాలయానికి అద్భుతమైన పరిశోధన పత్రం సమర్పించి ఉన్నప్పటికీ, మార్క్స్‌కు ఏ యూనివర్సిటీ పిలిచి పీట వెయ్యలేదు! తన రాజకీయ–సామాజిక–ఆర్థిక–చారిత్రక సిద్ధాంతాలను దాచుకునేందుకు ఎన్నడూ ప్రయత్నించని పాపానికి మార్క్స్ ను జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం దేశాలు తరిమికొట్టాయి.
- 2.ఎన్ని ఇబ్బందులొచ్చినా మార్క్స్ తత్వంలో మార్పు రాలేదు– కడదాకా తను నమ్మిన ఆదర్శాలకే కట్టుబడి, నూరు శాతం "పర్ఫెక్షనిస్ట్"గానే కొనసాగాడు. 1950కి ముందు అచ్చయిన రచనల్లో అత్యధిక పాఠక జనాదరణ పొందిన రచనల్లో ఒకటిగా 'పెట్టుబడి' కొనసాగడానికి ఈ పెర్ఫెక్షనిజమే ఓ కారణం. అంతర్జాతీయ స్థాయి పరిశోధన గ్రంథాల్లో అత్యధికంగా ప్రస్తావించిన ప్రామాణిక రచనగా "పెట్టుబడి"కి పెట్టుబడే పోటీ!

ఇంతకీ మార్క్స్ రచయితగానే కాదు–కమ్యూనిస్టు తత్వవేత్తగానూ, మేధావిగానూ, కార్మికవర్గ ఉద్యమకారుడిగానూ, పత్రికల్లో విస్తృతంగా రాసిన కాలమిస్టు గానూ కూడా 'పర్ఫెక్షనిస్ట్'గానే కడదాకా కొనసాగాడు. ఏ అంశం గురించి రాసినా విజ్ఞాన సర్వస్వం లాంటి రచనలే చెయ్యగలగడానికి ఈ పర్ఫెక్షనిజమే తోడ్పడింది. జైరస్ బనాజీ అంచనా ప్రకారం, "గతితర్కం– ఓ రేఖాచిత్రం" లాంటి లఘు రచన చెయ్యకుండా మార్క్స్‌కు అడ్డుపడింది ఈ పర్ఫెక్షనిజమే!

- 3.దానికితోడుగా, పెట్టుబడిదారీ విధానాన్ని అధ్యయనం చెయ్యడానికి, రాజకీయ అర్థశాస్త్రంలో లోతైన కృషి చెయ్యడమే కీలకమని మార్క్స్ భావించినందువల్ల ఆ రంగానికే ఆయన తన శక్తి సామర్థ్యాల్లో సింహభాగం ధారబోయడం కూడా "గతితర్కం– ఓ రేఖాచిత్రం" లాంటి రచనలు చెయ్యడానికి అడ్డుపడివుండవచ్చు. బహుముఖాలుగా విస్తరించిన మార్క్స్ ప్రతిభ అంతే వైవిధ్యంతో వ్యక్తం కాకుండా వుండడానికి అంతంతమాత్రంగా ఉండిన మార్క్స్ ఆరోగ్యం కూడా ఒక మేరకు అడ్డుపడి వుండవచ్చు.
- 4.అనారోగ్యానికి తోడుగా మార్క్స్ ఆర్థిక అనారోగ్యం –దాన్నే వాడుక భాషలో పేదరికం అంటారు– కూడా కొంతవరకూ అడ్డుపడి వుండవచ్చు. లండన్‌లో మూడు దశాబ్దాలకు పైగా నివసించినా, ఇంగ్లిష్ భాషలో గొప్ప స్టైలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నా అక్కడ ఉన్నన్నాళ్ళూ మార్క్స్ ఎంగెల్స్ ఆర్థిక సహకారం ఆలంబనగానే బతకవలసి వచ్చింది!
- ఈ అంచనా(లు) ఎంత వరకూ సరైనవో తూచి చెప్పాల్సిన పెద్దలు వాళ్ళ తీర్పు వెలువరిస్తార్లెండి – మన వరకూ మనం "మార్క్స్ గతి తర్కంపై ఆ సరళ, లఘు కృతి వెలువరించి వుంటే ఎంతబావుణ్ణు!"అనుకోకుండా ఉండగలమా ? ❑

## వివరణ

- 1. ఫెర్డినాండ్ ఫ్రెయిలిగ్రాత్(1810–1876): కార్ల్ మార్క్స్‌కు మంచి మిత్రుడు, విప్లవకవి, ప్రపంచ ప్రసిద్ధ అనువాదకుడు, ఉదారవాదం (ప్రైవేత్ రంగానికి పట్టం కట్టే 'ఉదార'వాదం కాదు– అన్నివర్గాల ప్రజలకూ సమానంగా ప్రజాస్వామ్య హక్కులు అందుబాటులోకి రావాలని చెప్పే నిజమైన ఉదారవాదం) కోసం పోరాడిన యోధుడు, ఫ్రెయిలిగ్రాత్. జెర్మన్ భాషతోపాటు ఫ్రెంచ్, ఇంగ్లిష్ భాషల్లోకూడా గొప్ప విద్వత్తు సంపాదించారు.
- 2. మిహాయిల్ అలెక్సాండ్రవిచ్ బకూనిన్ (1814–1876): ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ అరాజకవాది–విప్లవకారుడు, అనార్కో సిండికాలిజం ప్రవక్త బకూనిన్. మార్క్స్–ప్రూదా (ప్రౌధాన్) బకూనిన్‌ను మొదట్లో విశేషంగా ప్రభావితుణ్ణి చేశారు. అయితే, 'కార్మికవర్గ నియంతృత్వం' అనే భావనను ఆదినుంచి అంతం వరకూ వ్యతిరేకించినవాడు బకూనిన్. కార్మికవర్గ విప్లవానికి రాజ్యం తాలూకు ఏ రూపమూ సహకరించదనీ, రాజ్యాన్ని దుంపనాశనం చెయ్యాలన్నదే ఈ అరాజకవాది నినాదం. రాజ్యం ఆవశ్యకత లేని దశకు మానవ సమాజం చేరుకున్నప్పుడు, అదే అంతరించిపోతుందని మార్క్స్ నేతృత్వంలోని వర్గం వాదించింది. అంతవరకూ, అసమానతలు తొలగించేందుకు కార్మికవర్గం రాజ్యవ్యవస్థను వినియోగించుకోవచ్చునని ఈ వర్గం వాదన. ఇది పెద్ద వివాదంగా మారి

ఫస్ట్ ఇంటర్నేషనల్ చీలికకు దారితీసింది. దాంతో, 1872లో హేగ్ నగరంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ బకూనిన్‌ను బహిష్కరించింది.

- 3. షీట్: ఇది వాడుక అర్థంలో రాసినమాట కాకపోవచ్చు. ముద్రణ పరిభాషలో 'ఫార్మ్', 'షీట్' లాంటి మాటల్ని ఒకే అర్థంలో వాడతారు. ఫార్మ్ లేదా షీట్ నే కొన్నిచోట్ల సెక్షన్ అని కూడా అనడం కద్దు. 1/8 సైజు పుస్తకం విషయానికి వస్తే, ఒక్కో ఫార్మ్‌లో –లేదా షీట్లో– 16 పేజీలుంటాయి. 1/4 సైజు పుస్తకంలో అందులో సగం పేజీలే ఉంటాయి. సైజు పెరిగే కొద్దీ ఒక్కో ఫార్మ్‌లో – లేదా షీట్లో – పేజీల సంఖ్య తగ్గుతుంది.
- 4. పీటర్ జోసెఫ్ డీట్స్ గాన్ (1828–1888) : మార్క్సిస్ట్ తాత్త్వికుడు, జర్నలిస్టు, తోళ్ళ వ్యాపారం కూడా చేశాడు. మార్క్స్ రచనలు చదవకుండానే, గతి తార్కిక భౌతికవాద భావనను డీట్స్ గాన్ స్వయంగా అభివృద్ధి చేశాడంటారు.
- 5. ప్యోత్ర్ లవ్రోఫ్ (1823–1900): రష్యాలో నరోదిజం పేరిట పెల్లుబికిన విప్లవోద్యమానికి సైద్ధాంతిక భూమికను రూపొందించిన వాడు ప్యోత్ర్ లవ్రోఫ్. మార్క్స్–ఎంగెల్స్ ల మిత్రుడు, మొదటి ఇంటర్నేషనల్ లో చురుగ్గా పాల్గొన్న వాడు, సమాజ శాస్త్రవేత్త, చరిత్రకారుడు కూడా.
- 6. ఫోలియో పేజీలు: అరఠావు కాయితాన్ని మధ్యకు మడిస్తే వచ్చేదే ఫోలియో పేజీ అని ఎక్కడో చదివిన గుర్తు!
- 7. మూర్: ఇది మార్క్స్ ముద్దు పేరు! ఎంగెల్స్‌ను మేజర్ అనీ, మార్క్స్‌ను మూర్ అనీ సన్నిహితులు పిలుచుకునేవారట!

# పేదరికం మీద పరిహాసం

**(34వ పేజీ తరువాయి)**

ఎదుగుబొదుగూ లేకుండా ఉన్న ఈ మొత్తాలు ఇప్పుడు దేనికీ చాలవని, పెంచాలని చేసిన సిఫార్సును కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నది పచ్చి నిజం.

మన దరిద్రం గురించి మనమే చెప్పుకుంటే ప్రపంచంలో పలుచన కామా అని కొంత మంది మండిపడతారు. కానీ మన గురించి ప్రపంచం ఎన్నో అంశాలను చెబుతోంది. మన పాలకులు వాటిని దాచిపెడుతున్నారు. ఎవరైనా లేవనెత్తితే రాజద్రోహం అంటున్నారు. ఈ అంశాలను ఎక్కడ చర్చించాలి? ప్రపంచ సంస్థలు ఇచ్చే ర్యాంకులు, సూచికలను అంగీకరించేది లేదు, వాస్తవాలకు ప్రతిబింబం కాదు అంటారు. పోనీ వారు అసలైన అంకెలను వెల్లడిస్తారా అంటే అదీ లేదు. నిజంగా మన దేశం దరిద్రం నుంచి 41.5 కోట్ల మందిని విముక్తి చేస్తే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన గణాంకాలు చెబుతున్న దేమిటి? కేంద్ర ప్రభుత్వం 2018లో అనీమియా (రక్తహీనత) ముక్త భారత్ పథకాన్ని ప్రకటించింది. జీవన ప్రమాణాలను ప్రతిబింబించే వాటిలో ఇది ఒకటి. ప్రధాని నరేంద్రమోడీ కేంద్రంలో అధికారానికి వచ్చిన తరువాత రెండుసార్లు 2015–16లో నాలుగవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్ హెచ్ఎస్), 2019–21లో ఐదవ సర్వే చేశారు. రక్తహీనత పెరుగుదల తగ్గుదల గురించి ఈ రెండు సర్వేలను పోలుస్తూ కేంద్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో పిఐబి ద్వారా సమాచారాన్ని విడుదల చేసింది. దాని ప్రకారం ఒకటి రెండు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తప్ప దేశమంతటా, మెజారిటీ రాష్ట్రాలలో రక్తహీనత ఉన్నవారి సంఖ్య పెరిగింది. దరిద్రం తగ్గితే ఇది కూడా తగ్గాలి కదా!

మన దేశంలో రక్తహీనత వివరాలు

| గణన | రాష్ట్రం | పిల్లలు | 15 -49 స్త్రీలు | 15 -49 గర్భిణులు | మొత్తం స్త్రీలు | బాలికలు | బాలురు |
|---|---|---|---|---|---|---|---|
| సర్వే 4 | దేశం | 58.6 | 53.2 | 50.4 | 53.1 | 54.1 | 29.2 |
| సర్వే 5 | దేశం | 67.1 | 57.2 | 52.2 | 57 | 59.1 | 31.1 |
| సర్వే 4 | గుజరాత్ | 62.6 | 55.1 | 51.3 | 54.9 | 56.5 | 31.9 |
| సర్వే 5 | గుజరాత్ | 79.7 | 65.1 | 62.6 | 65 | 69.0 | 36.0 |
| సర్వే 4 | కేరళ | 35.7 | 34.7 | 22.6 | 34.3 | 37.8 | 14.3 |
| సర్వే 5 | కేరళ | 9.4 | 36.5 | 31.4 | 36.3 | 32.5 | 27.4 |

జనాభాను ఆరు బృందాలుగా విభజించి రక్తహీనత పరిస్థితి ఎవరిలో ఎలా ఉందో విశ్లేషించారు (పట్టిక). ఇక్కడ బాలికలు, బాలురు అంటే 15–19 సంవత్సరాల వారు. గుజరాత్ అభివృద్ధి నమూనాను దేశమంతటా విస్తరిస్తాను అని నరేంద్రమోడీ 2014 ఎన్నికల్లో చెప్పిన సంగతి తెలిసిందే. కేరళలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గానీ సిపిఎంగానీ తమది నమూనా అనే మాటలు చెప్పలేదు. దేశసగటు కంటే ధనిక రాష్ట్రం గుజరాత్‌లో రక్తహీనత అన్ని తరగతుల వారిలో ఎక్కువగా ఉంది. దానికి విరుద్ధంగా కేరళలో మెరుగైన స్థితి ఉంది. ప్రపంచ ఆకలి సూచికలో 2022 లో 121 దేశాలకు గాను మన ర్యాంక్ 107గా ఉంది. మెజారిటీ రాష్ట్రాలలో బిజెపి, నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారానికి రాక ముందు 2013లో 120 దేశాలకు మన రాంకు 63గా ఉంది. ఇండెక్స్ ముండీ డాట్ కామ్ సమాచారం 2019 ప్రకారం ఐదేళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్నవారు 186 దేశాలకు గాను మనం 32వ స్థానంలో ఉన్నాం, అదే చైనా 141వ స్థానంలో ఉంది. మన కంటే మెరుగైన స్థానాల్లో శ్రీలంక 98, బంగ్లాదేశ్ 55, నేపాల్ 51, భూటాన్ 50, మయన్మార్ 41, పాకిస్తాన్ 33వ స్థానంలో ఉంది. రెండు ఇంజన్ల పాలన ఉంటేనే అభివృద్ధి అని చెప్పేవారు దీనికి ఏ సమాధానం చెబుతారు. పిల్లలను ఆరోగ్యంగా ఉంచలేని వారు జిడిపి గురించి ఎన్ని కబుర్లు చెప్పినా దాని వలన ఫలితం ఏమిటి ? ❑

# శ్రామిక విప్లవ యోధ ఎంగెల్స్



- కె.కుమార్‌రెడ్డి

జర్మనీలోని బారెన్ నగరంలో 1820 నవంబరు 28న తేదీన ఎంగెల్స్ జన్మించారు. తండ్రి సంపన్నుడైన జౌళి పారిశ్రామికవేత్త, బాల్యం నుంచే ఎంగెల్స్ తన చుట్టూ ఉన్న సమాజంలోని పేదరికపు బాధలను గమనించారు. 1839లో తను రాసిన తొలి రచన 'వుప్పెర్ టాల్ లేఖావళి'లో బార్మన్, ఎబ్బర్ ఫెల్డకు చెందిన ఫ్యాక్టరీ కార్మికులు, చేతివృత్తిదారులు, వృత్తిపనివారల కఠోర జీవితాన్ని అక్షరీకరించారు. అత్యంత చురుకైన ఎంగెల్స్ విద్యార్థి దశలోనే సాహిత్యం, చిత్రకళ, సంగీతం, విదేశీ భాషలకు ఆకర్షితుడయ్యారు. గుర్రపుస్వారీ, కత్తిసాము, ఈతలో మేటిగా ఉండేవారు. ఎంగెల్స్ తన తండ్రి పోరు పడలేక ఉన్నత పాఠశాల విద్యకు స్వస్తి పలికి బ్రెమైన్ నగరంలోని వాణిజ్య సంస్థలో ఉద్యోగానికి వెళ్లారు. ఇక్కడే ఆయన ఇంగ్లీషు, డబ్చి, ఫ్రెంచి తదితర భాషల్లో పట్టు సంపాదించారు. దాదాపు ఆయనకు 25 భాషలు వచ్చు. ఇక్కడే కవి ఫెర్డినాండ్ లిత్ ప్రభావంతో కవిత్వ రచన ప్రారంభించారు. అనేక గ్రంథాలను అధ్యయనం చేశారు. డేవిడ్ స్ట్రాస్ రాసిన దాస్ లెవెన్ యేసు (ఏసు జీవితం పుస్తక ప్రభావంతో మతంతో ఆయన తెగతెంపులు చేసుకున్నారు.

సంకుచిత మత విశ్వాసాల స్థానంలో నూతన ప్రపంచ దృక్పథాన్ని రూపొందించుకునే ప్రయత్నంలో రాజకీయ సమస్యలపై ఎంగెల్స్ ఎఫ్.ఓస్వాల్ పేరుతో టెలిగ్రాఫ్ ఫర్ డాయిష్ లాండ్లో రాసిన వ్యాసాలలో మూర్ఖత్వంతో కరుడుకట్టిన అక్కడి దోపిడీ సమాజాన్ని క్రోధనల జ్వాలలకు గురిచేశారు. దీంతో ఆ సమాజమంతా అట్టుడికినట్టు ఉడికిపోయింది. ఆ వ్యాసాల్లో ఎంగెల్స్-ఉత్సాహపరుడైన విప్లవ ప్రజాస్వామ్య వాదిగా దర్శనమిచ్చారు. విశాలమైన ప్రపంచ దృక్పథం, విప్లవాత్మక స్వభావం, శ్రమజీవుల పట్ల చిత్తశుద్ధితో కూడిన సానుభూతి.. యువకుడైన ఎంగెల్స్‌ను తను జీవిస్తున్న సమాజంకన్నా ఉన్నతంగా నిలిపాయి. 1841లో ఎంగెల్స్ వుప్పెర్ లాలు తిరిగి వచ్చి మిలటరీ సర్వీసులో చేరాడు. సైనిక శాస్త్రాన్ని అభ్యసించారు. బెర్లిన్ విశ్వ విద్యాలయంలో బయటి విద్యార్థిగా తత్వశాస్త్రోపన్యాసాలు వినేవారు. బెర్లిన్‌లోని హెగెల్సియస్ట్ కేంద్రంలో సభ్యుడిగా చేరారు. వామపక్ష యువ హెగెలియన్లు జరుపుతున్న తాత్విక పోరాటాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. 1842 అక్టోబరు 8న ఆయన నిర్బంధ సైనిక శిక్షణ ముగిసింది. తండ్రి ఆదేశం మేరకు ఆయన ఇంగ్లండులోని మాంచెస్టరులో ఎర్మెన్ అండ్ ఎంగెల్స్ నూలు మిల్లులో వాణిజ్య శిక్షణ తీసుకున్నారు. బ్రిటన్ నివాసం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. ఇంగ్లండులోని తీవ్రమైన వర్గ వైరుధ్యాలు ఎంగెల్స్ దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. సాహిత్యంతోనూ, అధికార పత్రాలతోనూ ఎంగెల్స్ సరిపెట్టుకోక, కార్మికుల జీవితాలనూ, అభిప్రాయాలనూ, వారి పోరాట రూపాలనూ, పద్ధతులనూ అధ్యయనం చేశారు. ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి అన్న తన పుస్తకానికి దాన్నే భూమికగా వాడుకున్నారు. థామస్ కార్ లైలి అనే జర్మన్ కవి ఎంగెల్స్ ప్రతిభను, కృషిని గుర్తించారు. అప్పుడే ఇంగ్లండులో జరిగిన చార్టిస్టు ఉద్యమంతోనూ ఎంగెల్స్ మమేకమయ్యారు. ఊహాజనిత సామ్యవాద ప్రవక్తల్లో ఒకరైన రాబర్ట్ ఓవెన్ భావాలను ప్రచారం చేసే బ్రిటీష్ సోషలిస్టులతో కూడా ఎంగెల్స్ పరిచయం పెంచుకున్నారు. వారి పత్రిక ది న్యూ మోరల్ వరల్డ్ ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్లోని సోషలిస్టు ఉద్యమాన్ని గురించి, ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతకర్తలైన సెయింట్ సైమన్, ఛార్లెస్ ఫొరియర్ సిద్ధాంతాలను, ఎటీన్ కేబిట్, పీరీ లెరో, పీరీజోసోఫ్ ప్రొధన్, విల్ హెల్మ్ వైటింగ్ దృక్పథాలను బ్రిటిష్ కార్మికులకు పరిచయం చేసేవారు. జర్మన్ భావవాద తత్వశాస్త్రానికి శిఖరాయ మానమైన హెగెల్ బోధనలను వారికి తెలిసేవారు. వారి దృక్పథాలు, భావాల్లోని బలహీనతలు, లోపాలను ఎత్తి చూపించేవారు. ప్రపంచ సంస్కృతికి వారు చేసిన నిర్మాణాత్మకమైన సేవను ఆయన వివరించేవారు. కారల్ మార్క్స్, ఆర్నాల్డ్ రూగెల సంపాదకత్వంలో 1844 ఫిబ్రవరిలో పారిస్ నుంచి వెలువరించిన దయష్ ఫ్రాగ్జో సెషె యాడ్ బ్యూషర్లో ఎంగెల్స్ జాతీయార్థిక వ్యవస్థపై సంక్షిప్త విమర్శతో వ్యాసం రాశారు. ఇది బూర్జువా అర్థశాస్త్రాన్నీ, తత్పర్యవసానంగా పెట్టుబడిదారీ విధానాన్ని, శ్రామికవర్గ దృక్పథం నుంచి ఎంగెల్స్ విమర్శించారు. ఈ తరహా మొదటి రచన ఇది. దీనిలో మానవుణ్ణి ద్వేషించే అభివృద్ధి నిరోధకమైన మాల్తూస్ సిద్ధాంతాలపై ఎంగెల్స్ దాడిచేశారు. ఇంగ్లండ్లో ఉండగా ఎంగెల్స్ చేసిన రచనలను పరిశీలిస్తే ఆయన క్రమంగా భౌతిక వాద ప్రపంచ దృక్పథం వైపు పయనించినట్లు స్పష్టమవుతున్నది. గతం, వర్తమానం అనే గ్రంథంలో కొత్త మతాన్ని ప్రతిపాదించడానికి థామస్ కార్లైల్చె చేసిన ప్రయత్నాన్ని భౌతికవాద, నాస్తిక దృక్పథంతో ఎంగెల్స్ ఖండించారు.

మార్క్స్‌తో కొద్ది రోజులపాటు కలిసి ఉన్న సమయంలో

ప్రారంభించిన తమ ఉమ్మడి రచనలోనే, విప్లవాత్మకమైన భౌతిక వాద తత్వశాస్త్రానికి వారు పునాది వేశారు. దీనిలో అధిక భాగం మార్క్స్ కృషే అదే 'ది హెూలీ ఫ్యామిలీ. దీనిలో రాజకీయ రంగం నుంచి నిష్క్రమించి కేవలం పరిశుద్ధ తత్వశాస్త్రం రంగానికే పరిమితమైపోవాలనుకునే జర్మన్ మేధావి వర్గంతోనూ, బ్రూనో బావర్‌లాగ తమను తాము తాత్విక నాయకులుగా పరిగణించుకుని శ్రామికవర్గాన్ని అలగా జనంగా చూసే వారితోనూ బలా బలాలు తేల్చుకోవాలనుకున్నారు. అన్ని రకాల దోపిడీకి, పీడనకూ స్వస్తి చెప్పే బాధ్యత కార్మిక వర్గానిదేనని నిర్ణయించుకొని బ్రూనో బావర్తో, అతనిలాంటి తత్వవేత్తలతో వీరిద్దరూ పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు. దీన్నే లెనిన్ ఇలా అన్నారు 'సోషలిస్టు సమాజ నిర్మాతగా శ్రామిక వర్గానికి గల చరిత్రాత్మక పాత్రను స్పష్టం చెయ్యడమే మార్క్స్ - ఎంగెల్స్ సిద్ధాంతంలోని ప్రధానాంశం.' ఈ ప్రతిపాదనే సోషలిజాన్ని ఊహజనిత స్వర్గ స్థాయి నుంచి శాస్త్రీయస్థాయికి మార్చింది. దానికి వాస్తవికమైన పునాదిని చేకూర్చింది. విప్లవాత్మకమైన వర్గంతో దాని భవితవ్యాన్ని ముడి పెట్టింది.

ఇంగ్లండ్ నుంచి జర్మనీలోని సొంతూరు వచ్చిన ఎంగెల్స్ ఇక్కడ ఉండలేక 1845లో తిరిగి మార్క్స్ ఉన్న బ్రసెల్స్‌కు వెళ్లాడు. ఇక్కడే మార్క్స్, ఎంగెల్స్‌లు తమ నూతన భావాలను 'ది జర్మన్ ఐడియాలజీ' అనే పెద్ద గ్రంథంలో పొందుపర్చారు. చారిత్రక భౌతికవాదానికి సంబంధించిన ప్రాతిపదిక సూత్రాలు దీనిలో సంక్షిప్తంగా ప్రతిపాదించారు. భావి కమ్యూనిస్టు సమాజ రూపురేఖలు దీనిలోనే రేఖా మాత్రంగా దర్శనమిస్తాయి. విప్లవ సిద్ధాంతానికీ, కార్యాచరణకీ మధ్య ఉండాల్సిన అవిభాజ్య ఐక్యత గురించి ఉన్నతస్థాయి సిద్ధాంతపు క్రియాశీల, పరివర్తనాత్మక పాత్ర గురించి వారు నొక్కి వక్కాణించారు. శాస్త్రీయ కమ్యూనిజం, గతితార్కిక, చారిత్రక భౌతికవాదానికి సంబంధించిన సైద్ధాంతిక, తాత్విక సూత్రాలను రూపొందించడంలో ది జర్మన్ ఐడియాలజీ ఒక ముఖ్యమైన ఘట్టం.

వివిధ దేశాల్లోని సోషలిస్టు, కార్మికోద్యమ ప్రతినిధులను ఐక్యం చేసేందుకు, వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు నెరిపేందుకు మార్క్స్-ఎంగెల్స్ 'ది బ్రసెల్స్ కమ్యూనిస్టు కలెస్పాండెన్సు కమిటీని నెలకొల్పారు. జర్మనీ, పారిస్, ఇంగ్లండ్ తదితర ప్రాంతాల్లోని కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకున్నారు. మార్క్స్-ఎంగెల్స్ కొత్త సిద్ధాంతం కార్మికుల్లోకి చొచ్చుకుపోతున్నది. ఈ దశలో పారిస్ వెళ్లిన ఎంగెల్స్. అక్కడ జరిగిన సమావేశంలో కమ్యూనిస్టుల లక్ష్యాన్ని వివరించారు. బూర్జువా వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా శ్రమజీవుల ప్రయోజనాలను బలపరచడం, ప్రైవేటు యాజమాన్యాన్ని రద్దుచేసి దానిస్థానంలో ఉమ్మడి యాజమాన్యాన్ని ప్రవేశపెట్టడం ద్వారా దాన్ని సాధించడం, హింసాయుత ప్రజాతంత్ర విప్లవం ద్వారానే ఈ లక్ష్యాలు సాధించగలం. ఎంగెల్స్ చేసిన ఈ ప్రతిపాదనపై ఓటింగ్ జరిగి చివరకు లీగ్ ఆఫ్ ది జస్ట్ శాఖలోని వారు తమను తాము కమ్యూనిస్టులుగా ప్రకటించుకున్నారు. మార్క్స్ ఎంగెల్స్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు సరైనవనీ, వాటికి ఒక ప్రణాళిక రూపం ఇవ్వాలని జోసెఫ్మల్ తదితరులు కోరారు. 1847 జూన్ తొలి దినాల్లో లండన్లో లీగ్ మహా సభ జరిగింది. ఈ మహాసభలోనే 'లీగ్ ఆఫ్ ది ఆర్ట్' పేరు 'కమ్యూనిస్టు లీగ్ 'గా మారింది. మానవులందరూ సోదరులు అన్న లీగ్ పాత నినాదం స్థానే మార్క్స్ ఎంగెల్స్ ప్రతిపాదించిన 'ప్రపంచ కార్మికులారా! ఏకం కండి' అనే కొత్త వివాదం వచ్చింది.

మహాసభానంతరం మార్క్స్ అధ్యక్షుడిగా బ్రసెల్స్ కమ్యూనిస్టు లీగ్ శాఖను స్థాపించారు. దీనికితోడు వారిద్దరు కలిసి బ్రుసెల్స్ లోనే 'జర్మన్ వర్కర్క్ సొసైటీ'ని స్థాపించారు. అది కూడా లీగ్ శాఖ ఆధ్వర్యంలోనే పని చేసింది. దాయ్ బ్రుస్సెలర్ జ్ఞైటుంగ్-ఎ పొలిటికల్ అండ్ ఎకనామిక్ రివ్యూ అనే పత్రిక ద్వారా వారు అనేక వ్యాసాలు రాశారు. సోషలిస్టు విప్లవం కోసం కార్మికవర్గం పోరాటం ప్రారంభించాల్సి ఉంటుందని తమ వ్యాసాల్లో పక్యాణించారు. కమ్యూనిస్టు లీగ్ ద్వితీయ మహాసభ సన్నాహక కృషికిగానూ 1847 అక్టోబరు మధ్యలో ఎంగిల్స్ మరోమారు పారిస్ వెళ్లారు. నవంబరు 20న ఈ కార్యక్రమం ముసాయిదా చిత్తుప్రతిని తయారుచేశానని ఎంగెల్స్ మార్క్స్ కు తెలియజేస్తూ దాన్ని కమ్యూనిస్టు ప్రణాళిక అని పిలవాలని సూచించారు. 'కమ్యూనిస్టపై ప్రణాళిక అని పిలిస్తే బాగుంటుందను కుంటాను. అందులో ఎంతో కొంత చరిత్ర కూడా వివరించాలి. కనుక ఇంత వరకూ అది ఉన్న రూపం బొత్తిగా అనువైనది.. కాదని నా ఉద్దేశం. ఇక్కడ నేను తయారుచేసినంత వరకూ నాతో తీసుకు వస్తాను. అది సాదా కథ రూపంలో సాగింది.

అయితే, కొందర తొందరగా గీకేసిన మూలాన భాష అధ్వాన్నంగా ఉంది. కమ్యూనిజం అంటే ఏమిటి? అని ప్రారంభించాను. అక్కడ నుంచి ఒక్కమారు శ్రామికవర్గం దగ్గరకు గంతేశాను. దాని పుట్టుక, పూర్వపు శ్రమజీవులకూ దానికీ గల భేదం, శ్రామికవర్గానికీ, బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం పెరుగుదల, సంక్షోభాలు, తుది నిర్ధారణలు వీటన్నిటి మధ్య సవాలక్ష ఉన్నాయి. వీలున్నంత వరకూ, విషయాలు బహిరంగ ప్రకటనకు ముగింపుగా కమ్యూనిస్టు పార్టీ విధానం ఉన్నది'. ఇలా కమ్యూనిస్టు సూత్రాలు పేరున కమ్యూనిస్టు ప్రణాళిక తొలి ముసాయిదాను ఎంగెల్స్ రాశారు. కమ్యూనిస్టు లీగ్ రెండవ మహాసభలో తీవ్రమైన, దీర్ఘమైన వాదోపవాదాలు జరిగి మార్క్స్ ఎంగెల్స్ కొత్త సిద్ధాంతా న్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. చివరకు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక లండన్లో 1848 ఫిబ్రవరిలో ప్రచురితమైంది. శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతమైన శాస్త్రీయ కమ్యూనిజానికి క్లుప్తమూ, స్పష్టమూ

అయిన మొదటి సిద్ధాంత సంక్షిప్తీకరణ ఇది. ఈ శాస్త్రీయ కమ్యూనిస్టు ప్రథమ సిద్ధాంతపత్రం దరిమిలా ఎంగెల్స్ చెప్పినట్లు, సోషలిస్టు సాహిత్యంలో అత్యంతవ్యాప్తి చెందిన అంతర్జాతీయ గ్రంథమూ, సైబీరియా నుంచి కాలి ఫోర్నియా వరకు గల ప్రపంచ దేశాలన్నింటికీ చెందిన కోట్లది మంది కార్మికుల ఉమ్మడి కార్యక్రమంగా వర్ధిల్లుతోంది.

1848-49 విప్లవాల తర్వాత మార్క్స్ ఆర్థిక శాస్త్రాధ్యయనం లో పూర్తిగా నిమగ్నమయ్యారు. లండన్లో ఉంటూ కాపిటల్' రచనకు సన్నాహాలు సాగించారు. మార్క్స్ రాసిన 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ ది పొలిటికల్ ఎకానమీ, డాపిటల్-1వ భాగంపై బూర్జువా విమర్శకులు దురుద్దేశ పూర్వకంగా మౌనం వహించినప్పుడు, బూర్జువా పత్రికల్లోనూ, ప్రజాస్వామ్య పత్రికల్లోనూ ఎంగెల్స్ రాసిన వ్యాసాలు వాటిని పది మంది దృష్టికి తెచ్చాయి. ఈ దశలోనే ఎంగెల్స్ 'ప్రకృతి తత్వశాస్త్రంలోను, విజ్ఞాన శాస్త్రాల్లోను అధ్యయనం సాగించారు. ఈ అధ్యయనం ద్వారా ఎంగెల్స్ సేకరించిన విషయాలు, వివరాలు తర్వాత కొద్ది కాలంలో 'యాంటీ డ్యూరింగ్ (బెర్లిన్ విశ్వ విద్యాలయ ఆచార్యుడు యూగిన్ డ్యూరింగ్ రచనల ఖండన) రాయడానికి ఆయనకు తోడ్పడ్డాయి. మార్క్సిజానికి ఈ గ్రంథం దాదాపు విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చు. ప్రధానంగా తాత్విక గ్రంథమైన దీనిలో చాలా ముఖ్యమైన రాజకీయార్థిక భావాలు ఉన్నాయి. ఉత్పత్తినీ, సాంఘికార్థిక సూత్రాలన్నింటినీ అధ్యయనం చేసే ఒక విజ్ఞాన శాస్త్రంగా అర్థశాస్త్రానికి ఆయన ఇచ్చిన నిర్వచనం గమనార్హమైనది. ఈ నిర్వచనం చాలా ముఖ్య మైనదని లెనిన్ పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రాలన్నింటిలో, విప్లవం తెచ్చిన డ్యూరింగ్ పెటీ బూర్జువా ఊహాజనిత భావాలను విమర్శించడమే కాకుండా, మార్క్సిస్టు అర్థ శాస్త్ర విధానాంతో కూడా యాంటీ-డ్యూరింగ్ రూపుదిద్దింది. బిస్మార్క్ స్టేట్ జీవిత విశేషాలు, సోషలిజంను కూడా ఈ పుస్తకం తీవ్రంగా విమర్శిం చింది. ఈ గ్రంథంలోని భావాలు ఈనాటికీ తమ సందర్భశుద్ధిని కోల్పోలేదు. క్యాపిటల్ రెండు మూడు భాగాలను వెలువరించ డంలో ఎంగెల్స్ చేసిన అపార కృషి ఉండనే ఉంది.

మార్క్స్ ఈ పుస్తకాలను ఎంగెల్స్‌కు అప్పగించే నాటికి ఆ రాతప్రతులు అచ్చుకిచ్చే దశకు చాలా దూరంలో ఉన్నాయి. ఆ రెండు పుస్తకా లను సంస్కరించి, వాటికి ప్రచురణ యోగ్యమైన రూపు తీసుకు రావడానికి ఎంగెల్స్‌కు అనేక సంవత్సరాలు పట్టింది. ఆ రెండు పుస్తకాల్లోని అనేక భాగాలనూ, కొన్ని ప్రకరణాలను ఎంగెల్స్ రచించారు. అవన్నీ ఒక ఎత్తు. అయితే, కాపిటల్ రెండు మూడు భాగాలకు ఎంగెల్స్ రాసిన భూమికలు మరొక ఎత్తు. ఈ భూమికలలో మార్క్స్ తన రాత ప్రతులను ఏ పరిస్థితుల్లో వదిలి పెట్టినదీ, మార్క్సిస్టు అర్థశాస్త్ర సిద్ధాంత ప్రాతిపదికలేమిటో, ఆ సిద్ధాంత ఆవిర్భావ ప్రధాన దశలేమిటో, వాటి ప్రత్యేకతలేమిటో ఎంగెల్స్ వివరించారు. అర్థ శాస్త్ర రంగం లో తన మహాపునాది అదనపు విలువ సిద్ధాంతమని లెనిన్ చెప్పిన అపూర్వ విప్లవపు విశేష ప్రాధాన్యమేమిటో కూడా ఎంగెల్స్ వాటిలో స్పష్టపరిచారు. 1880వ శతాబ్దంలో పురాతన జర్మన్ల చరిత్రపై ఆయన చేసిన రచనల్లో ద ఆరిజిన్ ఆఫ్ ది ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రోపర్టీ అండ్ ది స్టేట్ (కుటుంబం, స్వంత ఆస్తి, రాజ్యాల పుట్టుక) అన్న రచన ముఖ్యమైనది. ఈ పుస్తకం రాయడం ఒక విధంగా మార్క్స్ ఆదేశాలను పాటించడంగా ఆయన పరిగణించారు. ఆయన ప్రకృతి- గతితర్కం అసంపూర్ణ రచవే అయినప్పటికీ, గాఢమైన, సంపద్వంతమైన భావాలకూ, సైద్ధాంతిక ప్రాముఖ్యతకూ కాణాచి. తన ప్రకృతి గతి తర్కంలో ఆయన సమకాలీన ప్రకృతి విజ్ఞానశాస్త్ర నిర్ణయాలన్నింటినీ తత్వశాస్త్రరీత్యా విశ్లేషించి, ప్రకృతిలో ప్రతి పరిణామమూ గతితార్కిక పద్ధతిలో జరుగుతుం దనీ, ప్రకృతిని సరిగా అర్థం చేసుకోవాలంటే భౌతికవాద గతి తర్కమొక్కటే సరైన పద్ధతి అని నిరూపించారు. కళలు, సాహి త్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో ముందుకు తీసుకుపోయినప్పుడే అవి సమాజానికి, మనిషికి ఉపయోగపడతాయని అనేక సంద ర్భాల్లో సోదాహరణలతో ఎంగెల్స్ వివరించారు.

శ్రామిక విప్లవయోధ ఎంగెల్స్ రచనలన్నింటిలోనూ గాఢమైన శాస్త్రీయ దృక్పథం కనిపిస్తుంది. కమ్యూనిస్టు సిద్ధాంతానికి అవి పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు బోధపడుతుంది. శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతానికి రూపకల్పన చెయ్యడానికీ, ఆ విజ్ఞాన శాస్త్రాన్ని కార్మికోద్యమంతో మేళవించడానికి ఆయన యావజ్జీవితం అంకితం చేశారు. విప్లవ పోరాటలకు ఆయన ఊపిరి. 'ధర్మం కోసం మనం పోరాడేటప్పుడు ప్రేమ, లాభం, సంపద- వీటిలో దేన్ని త్యజించాల్సి వచ్చినా మనం వెనుకంజ వెయ్యరాదు. పోరాట క్రమంలో మనం పొందే ఆనందం సహస్రాధికంగా ఉంటుంది. మన శరీరాల్లో తుది రక్తపు బొట్టున్నంత వరకూ పోరాటం కొనసాగిద్దాం" అని ఆయన 1848లో పేర్కొన్నారు.

ఆయన దృష్టిలో జీవితమంటే పని, పని అంటే పోరాటం. తనలో ఇంకా మిగిలి ఉన్న బలాన్నంతటనీ శ్రామికవర్గ లక్ష్య సాధనకు జరిగే పోరాటానికే వెచ్చించాలని తపిస్తూ 1895 ఆగస్టు 5వ తేదీన ఫ్రెడరిక్ ఎంగెల్స్ కన్నుమూశారు.


తన జీవితకాలంలో శ్రామికవర్గ విజయాన్ని, వర్గ వైరుధ్యాలు అంతం కావడాన్ని చూస్తాననీ, జాతుల మధ్య యుద్ధాలను అంతం చేసి, నాగరిక ప్రపంచంలో సుఖశాంతులను తీసుకురాగలననీ, తీసుకు రావాలన్న ఆశాభావంతోనే తుది శ్వాస విడిచిన ఆ శ్రామిక విప్లవవాదికి మనం అర్పించే నివాళి ఆయన కలలను నిజం చేసేలా సమసమాజ సాధనకు పోరాడటమే. బడుగు బలహీన వర్గాల పక్షాన ఉద్యమించడమే. ❑




మౌన ముని

ఇదేనా సమానత్వం..









గుట్టు.. గట్టున

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 11 August 2023




## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.